బుధవారం 23-10-2019

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 212


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

## 'భారత్‌కీ లక్ష్మి' రాయబారులు దీపిక, సింధు



సినీ నటి దీపికా పదుకొణే, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధులను 'భారత్‌కీ లక్ష్మి' రాయబారులుగా ప్రధాని ప్రకటించారు. మహిళా సాధికారతకు తోడ్పడిన స్త్రీలను ఈ దీపావళికి 'భారత్‌కీ లక్ష్మి' పేరుతో గౌరవిద్దామని 'మన్‌కీ బాత్'లో మోదీ పిలుపునిచ్చారు. - 4లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




# 'ఆర్టీసీ'పై కమిటీ

## సీఎం కేసీఆర్ ఆదేశం

- 'విలీనం' డిమాండ్‌ను కార్మికులే వదులుకున్నారు..
- కోర్టులో సైతం అదే చెప్పారు
- విలీనం మినహా మిగిలిన 21 డిమాండ్లు పరిశీలించండి
- రవాణాశాఖపై సమీక్షలో కేసీఆర్ సూచన
- ఆరుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు
- 2,3 రోజుల్లో ముఖ్యమంత్రికి నివేదిక
- ఆ తర్వాతే చర్చలపై నిర్ణయం
- 28న ఆ వివరాలను కోర్టుకు నివేదించనున్న సర్కారు
- మరో వెయ్యి అద్దె బస్సులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్న సీఎం

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో మంగళవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సమ్మె పరిష్కారానికి ఇరువర్గాలు బెట్టు వీడి ప్రయత్నాలు చేయాలన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశాన్ని పక్కనపెట్టి మిగిలిన 21 డిమాండ్లను పరిశీలించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనే డిమాండ్‌ను కార్మిక సంఘాలు తమంతట తామే వదులుకున్నందున దాన్ని పరిగణించాల్సిన అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు. మిగిలిన డిమాండ్ల పరిశీలనకు ఆర్టీసీ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి రెండు మూడు రోజుల్లో నివేదిక అందించేలా చూడాలంటూ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మను ఆదేశించారు. ఆ నివేదిక అందిన తర్వాత చర్చలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈనెల 28న జరిగే విచారణలో హైకోర్టుకు అదే విషయాన్ని నివేదించనున్నారు. ఆర్టీసీ సమ్మెపై విచారణ



జరుపుతున్న హైకోర్టు.. శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఉధృతంగా సాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె పరిష్కారానికి సంబంధించి ఆర్టీసీ ఎండీకి కొన్ని సూచనలు చేసింది. కానీ ఇందుకు సంబంధించిన మధ్యంతర ఉత్తర్వుల ప్రతి అధికారులకు అందకపోవడంతో సోమవారం వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కోర్టు చేసిన వ్యాఖ్యలను స్పష్టంగా తెలుసుకున్న తర్వాతే స్పందించాలని నిర్ణయించారు. అధికారులు రెండుసార్లు సీఎంతో సమావేశం కోసం వెళ్లినా.. ఉత్తర్వుల ప్రతి లేకుండా చేసేదేమీ లేకపోవడంతో ముఖ్యమంత్రి కూడా భేటీలో పాల్గొనలేదు. చివరకు మంగళవారం హైకోర్టు ఉత్తర్వులు అందడంతో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తొలుత అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం రాత్రి ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**విలీనంపై పట్టు పట్టబోమని చెప్పారు...**

''ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కార్మిక సంఘాలు తమంతట తామే వదులుకున్న నేపథ్యంలో ఇతర డిమాండ్లను పరిశీలించాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటిస్తేనే చర్చలు జరుపుతామని కార్మిక సంఘాల నాయకులు మొదట ప్రకటించారు. అదే తమ ప్రథమ అవసరం అని కూడా చెప్పారు. కానీ హైకోర్టులో విచారణ సందర్భంగా మాత్రం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మీదనే పట్టు పట్టబోమని చెప్పారు. కార్మిక సంఘాల తరఫున కోర్టులో వాదించిన

మిగతా 2వ పేజీలో ▶

# మున్సి'పోల్స్'కు ఓకే

**మున్సిపల్ ఎన్నికలపై దాఖలైన పిల్స్‌ను తోసిపుచ్చిన హైకోర్టు**

- అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఓటర్ల గణన చేయొచ్చని వెల్లడి
- పిటిషనర్లు ఆధారాల్లేకుండానే కోర్టును ఆశ్రయించారని వ్యాఖ్య
- స్టేలపై మాత్రం సింగిల్ జడ్జి దగ్గరే తేల్చుకోవాలన్న ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ విషయంలో నెలకొన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు అవసరమైన ముందస్తు ప్రక్రియను ప్రభుత్వం చట్ట ప్రకారం చేయలేదంటూ దాఖలైన రెండు



ప్రజాహిత వ్యాజ్యాల (పిల్స్)ను హైకోర్టు ధర్మాసనం మంగళవారం తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 243–జెడ్ ప్రకారం ఎన్నికల వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఓటర్ల జాబితా ఆధారంగా మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గణన చేయవచ్చని తేల్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. తీర్పు వెలువడిన వెంటనే అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు కల్పించుకొని పలు మున్సిపాలిటీలకు సంబంధించిన కేసులు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, కొన్నింటిలో స్టే ఆదేశాలు వెలువడ్డాయని, వాటి విషయంలోనూ జోక్యం చేసుకొని ఎన్నికల నిర్వహణకు వీలుగా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ వాటన్నింటినీ సింగిల్ జడ్జి వద్దే పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది.

**ఆరోపణలను పరిగణనలోకి తీసుకోలేం...**

''అసెంబ్లీకి వినియోగించిన ఓటర్ల జాబితా ఆధారంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించొచ్చని మున్సిపల్ చట్టంలోని సెక్షన్–11 స్పష్టం చేస్తోంది. జూలై 3న రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు వెలువరించిన నోటిఫికేషన్‌ను పిటిషనర్లు సవాల్ చేయడం సరికాదు. సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల మేరకు వాటి విషయంలో

మిగతా 2వ పేజీలో ▶

## ఇన్ఫోసిస్..ఇన్వెస్టర్రర్!

షేరు 16 శాతం క్రాష్

- బిజినెస్‌లో












## ఇద్దరే ముద్దు.. లేదంటే అన్నీ కట్

**అస్సాం సర్కార్ సంచలన నిర్ణయం**

మీరు అస్సాంలో నివసిస్తున్నారా? ఇద్దరిని మించి పిల్లల్ని కనాలనే కోరిక మీకుందా? అయితే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వం ఇచ్చే పథకాలపై ఆశలు వదులుకోవాలి.

వివరాలు 4లో



## బెయిల్ వచ్చినా జైల్లోనే...

ఈడీ అదుపులోనే చిదంబరం

వివరాలు 4లో

మంగళవారం కచ్చులూరు మందం వద్ద వశిష్ట బోటును వెలికితీసిన దృశ్యం



# ఒడ్డుకు 'వశిష్ట'

- గోదావరిలో ముగిసిన ఆపరేషన్ 'రాయల్ వశిష్ట'
- తీవ్రంగా శ్రమించిన ధర్మాడి బృందం
- డీప్ డైవర్లతో కలసి పట్టు వదలకుండా అన్వేషణ
- బోటు వెలికితీతపై అన్ని ప్రయత్నాలకు సహకరించిన ఏపీ ప్రభుత్వం

2లో

| | | |
|---|---|---|
| బోటులో బయటపడ్డ మృతదేహాలు | 7 | ఇప్పటిదాకా లభ్యమైన మృతదేహాలు 46 |
| ఆచూకీ తెలియాల్సిన మృతదేహాలు | 5 | |
| 38 | సహాయక చర్యలు కొనసాగిన రోజులు | |

# పుప్పాల్‌గూడ భూములు సర్కారువే

**కాందిశీకుల వారసులకు సుప్రీంకోర్టులోనూ చుక్కెదురు**

- హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
- 198.30 ఎకరాలు ప్రభుత్వానికే చెందుతాయని తుది తీర్పు
- వాటి విలువ సుమారు రూ.7 వేల కోట్లని అంచనా

సాక్షి, రంగారెడ్డి జిల్లా

కాందిశీకులకు భూముల కేటాయింపు వివాదంపై సుప్రీంకోర్టులోనూ రాష్ట్ర ప్రభుత్వానికి భారీ విజయం లభించింది. రంగారెడ్డి జిల్లా పుప్పాల్‌గూడలో రూ. కోట్ల విలువైన 198.30 ఎకరాలను రమేష్ పరశరాం మలాని తదితరులకు కేటాయిస్తూ 2003లో ఉమ్మడి ఏపీ సీసీఎల్ఏ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ 2016లో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. కాందిశీకుల భూములను కేటాయించే అధికారం సీసీఎల్ఏకి లేదని పునరుద్ఘాటించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రమేష్ మలాని దాఖలు చేసిన అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జస్టిస్ హేమంత్ గుప్తాలతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. కాందిశీకుల భూములను ఒకసారి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం బదిలీ చేసిన తర్వాత ఆ భూములను ఇతరులకు కేటాయించే అధికారం రాష్ట్ర పరిధిలోని మేనేజింగ్ అధికారి లేదా సెటిల్‌మెంట్ కమిషనర్‌కు మాత్రమే ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాదాపు 13 ఏళ్లపాటు కోర్టుల్లో నడచిన ఈ కేసులో ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించింది. ఈ భూములు ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండటంతో ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఎకరా రూ. 35 కోట్లు పలుకుతోంది. మొత్తం ఎకరాలను పరిగణనలోకి తీసుకుంటే దీని విలువ సుమారు రూ. 7 వేల కోట్లు ఉంటుందని అంచనా. ఇప్పటికే భూముల అమ్మకం ద్వారా రూ. 10 వేల కోట్లను సేకరించాలని సీఎం కేసీఆర్ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం హక్కులు దక్కించుకున్న భూములను వేలం వేసే వీలుంది.

**కేసు పూర్వాపరాలు ఇవీ..**

పశ్చిమ పాకిస్తాన్ నుంచి మన దేశానికి శరణార్థునిగా వచ్చిన పరశరాం రాంచంద్ మలాని అనే వ్యక్తికి రంగారెడ్డి జిల్లాలో అప్పటి హయత్‌నగర్ మండలం బాటసింగారం, హైదరాబాద్ బోయిన్‌పల్లిలో మొత్తం 323.10 ఎకరాలను 60 ఏళ్ల

మిగతా 2వ పేజీలో ▶

## ఇదండీ సంగతి



మనలో మాట! అసలు శాశ్వత కట్టడాలు ఏమున్నాయని జ్ఞాపకాలను చెరిపేయడానికి! నో చాన్స్! సార్!!

# కృష్ణాకు పోటెత్తుతున్న వరద

**శ్రీశైలం జలాశయంలోకి 3.36 లక్షల క్యూసెక్కుల నీరు**

- ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా ప్రవాహాలు
- నేడు మరింత వరద వచ్చే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్

ఎగువన కురుస్తున్న వర్షాలతో మళ్లీ కృష్ణా నదిలోకి వరద పోటెత్తుతోంది. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీశైలం జలాశయంలోకి 3.36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో.. తొలుత ఒక గేటు ఎత్తి 50వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. అనంతరం వరద ఉధృతి పెరుగుతుండటంతో ఒక్కో గేటును ఎత్తుతూ వచ్చారు. మంగళవారం రాత్రికి ఎనిమిది గేట్లను ఎత్తి మూడు లక్షల క్యూసెక్కుల వరదను కిందకు విడుదల చేశారు. పశ్చిమ కనుమల్లోనూ, కృష్ణా ప్రధాన ఉప నది అయిన తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోనూ మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ సంస్థ అంచనాల నేపథ్యంలో.. బుధవారం ఎగువ నుంచి భారీ వరద వచ్చే అవకాశం ఉందని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. మరోవైపు శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీల్లోకి వస్తున్న

మిగతా 2వ పేజీలో ▶



మంగళవారం నాగార్జునసాగర్ ఆరు గేట్లు ఎత్తడంతో దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

## క్లుప్తంగా...

### న్యాక్‌కు అసోచామ్ అవార్డు

**సాక్షి, హైదరాబాద్:** నిర్మాణరంగ వృత్తుల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిర్మించుకున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ప్రతిష్టాత్మకమైన అసోచామ్ నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు–2019ను కైవసం చేసుకుంది. నిర్మాణ రంగ అభివృద్ధికి నైపుణ్య శిక్షణనందిస్తూ దాదాపు 74 వేల మందికి శిక్షణ, ఉపాధిని అందించినందుకు స్కిల్ డెవలప్‌మెంట్/ఒకేషనల్ ట్రైనింగ్ (సౌత్) అవార్డు న్యాక్‌ను వరించింది. మంగళవారం పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి ఈ అవార్డును అందుకున్నారు. న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ, భిక్షపతి.. రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కలిసి ఈ పురస్కారాన్ని చూపించారు. ఈ సందర్భంగా న్యాక్ డైరెక్టర్, న్యాక్ సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. విదేశాల్లో ఉన్న నిర్మాణరంగ కార్మికులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందించాలని సూచించారు.

### ఆయుష్ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

**ఈనెల 23, 24 తేదీల్లో వెబ్ ఆప్షన్లు**

**సాక్షి, హైదరాబాద్:** ఆయుష్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీట్ల భర్తీకి ఈ నెల 23, 24 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు, అడిషనల్ మాప్ అప్ కౌన్సెలింగ్‌కు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయుష్ కాలేజీల్లో బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైసీ కోర్సుల్లో మిగిలిపోయిన కేటగిరీ–ఏ సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. సీట్ల ఖాళీలు, పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.inను సందర్శించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

### మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పోస్టులు

**సాక్షి, హైదరాబాద్:** మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ పుట్టా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటికి సంబంధించి ఇంటర్వ్యూలను ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో 5 ప్రొఫెసర్ పోస్టులు, 10 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 5 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఈ నెల 30న కాలేజీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు http://dme.telangana.gov. in, http://gmcmbnrts.org,https://mahabubnagar.nic.in వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు.

### సిద్దిపేట జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో ఐటీ తనిఖీలు

**సిద్దిపేట కమాన్:** సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో ఉండే టీడీఎస్‌ను సక్రమంగా చెల్లించక పోవడంతో సంబంధిత అధికారులకు పలుమార్లు నోటీసులిచ్చినప్పటికీ స్పందించకపోవడంతో తనిఖీలు చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని 12 ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారుల వేతన వివరాలు, పే స్లిప్పులు, ఇతర కటింగ్‌లు, ప్రభుత్వానికి చెల్లిస్తున్న ఇన్‌కంటాక్స్, తదితర విషయాలపై ఆరా తీశారు. జిల్లాలో 8 బృందాలు తనిఖీలు చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం, వైద్యారోగ్య శాఖ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, పంచాయతీరాజ్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారుల వేతన ఖాతా వివరాలు, సంవత్సరానికి చెల్లిస్తున్న పన్నుల వివరాలను ఆరా తీసినట్లు తెలిసింది.

### 'పెంచిన వేతనాలను సర్కారే చెల్లించాలి'

**సాక్షి, హైదరాబాద్:** పంచాయతీ కార్మికులకు పెంచిన వేతనాలను వచ్చే నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని తెలంగాణ పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది నుంచి బడ్జెట్‌లో ఈ జీతాలకు సంబంధించి నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

## కృష్ణాకు పోటెత్తుతున్న వరద

▶ మొదటి పేజీ తరువాయి

వరదను కాలువలకు విడుదల చేయగా మిగులుగా ఉన్న ప్రవాహాన్ని దిగువకు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆల్మట్టి నుంచి 2.50 లక్షల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 2.57 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దాంతో తుంగభద్ర ఉరకలెత్తుతోంది. తుంగభద్ర జలాశయంలోకి 1.48 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. గేట్లన్నీ ఎత్తేసి 1.55 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా, తుంగభద్ర నుంచి బుధవారం శ్రీశైలంలోకి 4 నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# అద్దె బస్సుల టెండర్‌పై స్టేకు హైకోర్టు నో

**సీజే ధర్మాసనానికి రిట్ నివేదన**



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సంస్థ 1,035 అద్దె బస్సుల్ని ఏడాది పాటు తీసుకునేందుకు పిలిచిన టెండర్ల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ వేసిన రిట్‌పిటిషన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆర్టీసీ సమ్మె పరిష్కారమైతే అంత పెద్ద సంఖ్యలో ప్రైవేటు బస్సుల్ని అద్దెకు తీసుకోవాల్సిన అవసరం లేదని, కాబట్టి మధ్యంతర స్టే ఆదేశాలు ఇవ్వాలంటూ టీఎస్ ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమేశ్ కుమార్ దాఖలు చేసిన రిట్‌ను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారించారు. సమ్మె కాలానికి అద్దె బస్సులు తీసుకోవడం సబబేనని, ఏడాది కాలానికి అద్దెకు తీసుకోవడం వల్ల ఆర్టీసీకి ఆర్థికంగా నష్టమని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సూర్యకిరణ్‌రెడ్డి వాదించారు. ఆర్టీసీ సమ్మెపై వ్యాజ్యాలు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం వద్ద ఉన్నాయని అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు చెప్పారు. దీంతో ఈ రిట్‌ను కూడా ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి నివేదించాలని న్యాయమూర్తి నిర్ణయించారు.

**ఆ అధికారం ఎండీకి లేదు**

తొలుత సూర్యకిరణ్‌రెడ్డి వాదిస్తూ, ఆర్టీసీకి బోర్డు లేదని, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇన్‌చార్జ్ ఎండీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, బోర్డు లేకుండా అద్దె బస్సుల టెండర్‌ను పిలిచే అధికారం ఎండీకి లేదన్నారు. సమ్మెకు తెరపడితే 1,035 అద్దె బస్సుల్ని ఏవిధంగా వినియోగిస్తారని, ఇప్పటికే ఆర్టీసీ నష్టాల్లో ఉన్నప్పుడు వెయ్యికిపైగా అద్దె బస్సుల్ని ఏడాదికి తీసుకోవడం సరికాదన్నారు. ఆర్టీసీలో 25% అద్దె బస్సులు ఉండేలా చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో సంస్థకు గుదిబండగా మారేలా ఉన్న టెండర్ అమలును రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో 2,103 అద్దె బస్సులున్నాయని, ఆర్టీసీలో జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఉన్నాయని, ఆర్థికంగా మరింత సమస్యగా మారుతుందన్నారు. తొలగింపునకు గురైన సిబ్బంది అద్దె బస్సుల్లో పనిచేసేందుకు అనర్హులనే షరతు నోటిఫికేషన్‌లో ఉండటాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తొలగింపునకు గురైన సిబ్బంది మళ్లీ ఉద్యోగం చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదని, ఉపాధి పొందే హక్కు అందరికీ ఉంటుందని సూర్యకిరణ్‌రెడ్డి చెప్పారు.

**ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదనే..**

ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదిస్తూ.. ఆర్టీసీ సమ్మె జరుగుతున్నందున ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదనే ప్రభుత్వం అద్దె బస్సుల్ని తీసుకోవాలని నిర్ణయించిందని చెప్పారు. వీలైనంత ఎక్కువగా బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రధాన న్యాయమూర్తి ఇప్పటికే ఆదేశించారని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ రిట్‌ను ఆదిలోనే కొట్టివేయాలన్నారు. సోమవారమే టెండర్‌ను ఓపెన్ చేశారని, టెండర్ ఖరారు చేసుంటారని, ఈ దశలో రిట్ దాఖలు చేయడం చెల్లదన్నారు. టెండర్‌ను ఆర్టీసీ బోర్డు పిలవలేదని, ఆర్టీసీ చట్టంలోని సెక్షన్ 34 ప్రకారం ప్రభుత్వానికి ఉన్న అధికారాల మేరకు అద్దె బస్సుల్ని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సమ్మె చట్ట విరుద్ధమని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఆర్టీసీలోని బస్సుల్ని నడపలేని పరిస్థితులు ఉన్నందున ప్రైవేటు బస్సుల్ని తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. సమ్మె సమయంలో బస్సుల్ని నడుపుతుంటే అడ్డుకోవడం, అద్దె బస్సుల్ని తీసుకుని ప్రయాణికులకు రవాణా సౌకర్యాలు కల్పిస్తామంటే వద్దనడం సరికాదన్నారు. పిటిషనర్ టెండర్‌లో పాల్గొనడంగానీ, దరఖాస్తు చేయడంగానీ చేయలేదని, టెండర్‌తో సంబంధం లేని వ్యక్తి అద్దె బస్సుల్ని తీసుకోవద్దనడం చెల్లదని, రిట్‌ను ఆదిలోనే కొట్టేయాలని కోరారు. వాదనల అనంతరం హైకోర్టు.. ప్రధాన న్యాయమూర్తి వద్ద 28న రిట్లపై విచారణ జరిగే వాటితో కలిపి ఈ రిట్‌ను కూడా జత చేయాలని ఆదేశించింది. ఈ దశలో పిటిషనర్ న్యాయవాది కల్పించుకుని, ఏడాదిపాటు అద్దెకు తీసుకోకుండా తాత్కాలిక ప్రాతిపదికపై తీసుకునేలా మధ్యంతర ఆదేశాలివ్వాలని కోరగా, ఈ విషయాన్ని కూడా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనానికి తెలియజేయాలని సూచించారు.

# పుప్పాల్‌గూడ భూములు సర్కారువే

▶ మొదటి పేజీ తరువాయి

క్రితం కేటాయించారు. బాటసింగారంలో 262.11 ఎకరాలు, బోయిన్‌పల్లిలో 60.39 ఎకరాలిచ్చారు. పాక్‌లో ఆయనకున్న 83.11 ఎకరాలను విడిచిపెట్టి వచ్చినందుకు బదులుగా హైదరాబాద్‌లో 200 ఎకరాలు ఇవ్వాలని కోరగా సదరు భూమిని పంపిణీ చేశారు. కొద్దికాలం తర్వాత సదరు భూమిని ఇతరులకు విక్రయించిన రాంచంద్... 1988 ఆగస్టులో మరణించారు. ఆయన బతికినన్ని రోజులు సదరు భూమిపై ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం చేయలేదు. ఆ తర్వాత 13 ఏళ్లకు అంటే 2001లో అసలు కథ మొదలైంది. పాక్‌లో తాము విడిచిపెట్టి వచ్చిన 83.11 ఎకరాల్లో.. 40.4 ఎకరాలకు సమానమైన ఆస్తిని మాత్రమే తమకు కేటాయించారని రాంచంద్ వారసులైన రమేష్ పరశరాం మిలాని, మరికొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన 43.7 ఎకరాలకు సమానమైన ఆస్తిని కేటాయించలేదని, ఆ మేరకు భూమిని పంపిణీ చేయాలని 2001 మార్చిలో విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి సీసీఎల్‌ఏ తీసుకెళ్లగా స్పందన రాలేదు. మరోసారి పిటిషనర్ సీసీఎల్‌ఏకు దరఖాస్తు చేయగా పుప్పాల్‌గూడలో 301 నుంచి 308, 325 నుంచి 328, 331 సర్వే నంబర్లలో 2003 ఫిబ్రవరి 26న 148.3 ఎకరాలు, ఇతరులకు మరో 50 ఎకరాలను కేటాయించింది. అయితే ఈ కేటాయింపులను అదే సంవత్సరం మార్చి 20న ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఇదే సమయంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి పిటిషనర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన స్టే, షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ పిటిషనర్ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా రివిజినల్ విభాగాన్ని సంప్రదించాలని కోర్టు సూచించింది. దీంతో అక్కడికి వెళ్లిన పిటిషనర్‌కు అనుకూలంగా సదరు విభాగం వ్యవహరించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శేషాద్రి హైకోర్టులో 2016 ఫిబ్రవరి 16న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు చెప్పడంతో భూ కేటాయింపులను రద్దు చేసింది. అలాగే 50 ఎకరాలు పొందిన ఇతరులు కేసు ఉపసంహరించుకున్నారు. ఇంతలో సదరు భూములను ప్రభుత్వం వేలం వేసేందుకు సిద్ధమవుతుండగా దీన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలు చేశారు. అయితే కేసు తేలే వరకు భూములను విక్రయించకూడదని, యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు సూచించింది. తాజాగా ఈ కేసుపై వాదనలు జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. పిటిషనర్ దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీని కొట్టేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు తుది తీర్పును మంగళవారం వెలువరించింది. దీంతో ప్రభుత్వానికి ఊరట కలిగింది. ప్రస్తుతం ఈ భూమిలో 150 ఎకరాలు ఖాళీగా ఉండగా దీని చుట్టూ యంత్రాంగం ఫెన్సింగ్ వేసింది. మరో 40కి పైగా ఎకరాలను వివిధ అవసరాలకు వినియోగించింది. ఈ భూమిని 2006లోనే అప్పటి హుడా (ప్రస్తుత హెచ్‌ఎండీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం బదలాయించింది.

## 'కాటన్ ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరించాలి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కాటన్ ఇండస్ట్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే దీపావళి తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హెచ్చరించింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 350 వరకు కాటన్ పరిశ్రమలు ఉన్నాయని ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకాలు లేక, సబ్సిడీ బకాయిలు విడుదల చేయక పోవడం వల్ల 30 పరిశ్రమల వరకు మూతపడ్డాయన్నారు. తమకు రావాల్సిన రూ.400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# 'ఆర్టీసీ'పై కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ నెరవేరితే తప్ప చర్చలకు కార్మికులు రారని ఎప్పుడూ చెప్పలేదు. విలీన డిమాండ్ ఒక్కటే ప్రధానం కాదని వారి న్యాయవాది చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జారీ చేసిన ఉత్తర్వుల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కార్మికులు విలీనం డిమాండ్ వదులుకున్నట్లయింది. కార్మికులు లేవనెత్తిన డిమాండ్లలో 21 అంశాలను పరిశీలించాలని కోర్టు కోరింది. కోర్టు ఆదేశాల మేరకు వాటిని పరిశీలించాలి''అని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బాధ్యతను ఆర్టీసీ ఇన్‌ఛార్జి ఎండీ సునీల్‌శర్మకు అప్పగించారు. దీంతో ఆయన ఆరుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు.

**నివేదిక పరిశీలించాకే చర్చలపై నిర్ణయం...**

కార్మిక సంఘాలు చేసిన డిమాండ్లలో 21 అంశాలను కొత్తగా ఏర్పాటైన కమిటీ పరిశీలిస్తుంది. వాటి అమలు సాధ్యాసాధ్యాలపై పూర్తి వివరాలతో నివేదికను ఎండీకి అందజేస్తుంది. దాన్ని ఆయన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళతారు. ఆ నివేదికను పరిశీలించిన తర్వాతనే కార్మిక సంఘాలతో చర్చలపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇదంతా కోర్టు తదుపరి వాయిదా (ఈనెల 28)లోపు జరగాల్సి ఉంది.

**ఇటు కమిటీ.. అటు అద్దె బస్సులు..**

కార్మికుల డిమాండ్ల పరిశీలనకు కమిటీ వేయాలని ఆదేశించిన సీఎం కేసీఆర్.. అదే సమయంలో వెయ్యి అద్దె బస్సులను సమకూర్చుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే అద్దె బస్సుల కోసం అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా.. దానికి సంబంధించి దాఖలైన టెండర్లను అధికారులు సోమవారం రాత్రి పరిశీలించారు. జిల్లాల్లో 250 బస్సులకు 9,700 దరఖాస్తులు రాగా, హైదరాబాద్‌లో మాత్రం 750 బస్సులకు కేవలం 18 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయి. తాజాగా మరో వెయ్యి బస్సులకు నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు.

**కమిటీలో సభ్యులు వీరే...**

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిశీలించేందుకు ఆర్టీసీ ఇన్‌చార్జీ ఎండీ సునీల్‌శర్మ ఆరుగురు అధికారులతో కమిటీ వేశారు. ఆర్టీసీ ఈడీ టి.వెంకటేశ్వర్‌రావు అధ్యక్షుడిగా ఈడీలు ఎ.పురుషోత్తం, సి.వినోద్ కుమార్, ఇ.యాదగిరి, వి.వెంకటేశ్వర్లు, ఆర్థిక సలహాదారు ఎస్.రమేష్‌లు సభ్యులుగా ఈ కమిటీ ఏర్పడింది. హైకోర్టు సూచించిన 21 అంశాలను పరిశీలించి, ఒకటి రెండు రోజుల్లో కమిటీ తన నివేదికను ఆర్టీసీ ఎండికి అందిస్తుందని సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

### విలీనం డిమాండ్‌ను వదులుకోలేదు: అశ్వత్థామరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తమ డిమాండ్‌కు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టంచేశారు. ఆ డిమాండ్‌ను తాము వదులుకోలేదని, అది లేకుండా చర్చలకు ఒప్పుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. మంగళవారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ''కోర్టులో వాదనల సందర్భంగా చర్చలపై పట్టుబట్టాం. ముందు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి. వేటిని చర్చించాలి, వేటిని వద్దు అన్నది తర్వాత చూద్దామని మాత్రమే చెప్పాం తప్ప.. ఆ డిమాండ్‌ను వదులుకుంటున్నట్టు ఎక్కడా చెప్పలేదు''అని వివరించారు.

**మోదీ ప్రభుత్వ చట్టప్రకారమే చేస్తున్నాం...**

ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రోద్బలంతో చట్టవ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెకు కాంగ్రెస్, బీజేపీలు మద్దతు పలకడం అనైతికమని ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. తెలంగాణలో కార్మికులు చేస్తున్న డిమాండ్లను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ''కాంగ్రెస్, బీజేపీలు ఆర్టీసీ విషయంలో చేస్తున్న వాదనలు విచిత్రంగా ఉన్నాయి. ఆర్టీసీని, రూట్లను ప్రైవేటుపరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం, అవకాశం కల్పిస్తూ మోదీ ప్రభుత్వం చట్టం చేసింది. దానికి వ్యతిరేకంగా ఇక్కడి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని మూసేసింది. కానీ ఆ పార్టీ నేతలు తెలంగాణ విషయంలో మాత్రం విభిన్నంగా మాట్లాడుతున్నారు'' అని కేసీఆర్ దుయ్యబట్టారు. ''1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు మోటారు వాహనాల చట్టాన్ని రూపొందించారు. దాని ప్రకారమే రాష్ట్రాల్లో ఆర్టీసీలు ఏర్పడ్డాయి. ఆ చట్టంలోని 3వ సెక్షన్‌లో సవరణలు చేస్తూ మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019 బడ్జెట్ సమావేశాల్లో సవరణ బిల్లు ఆమోదించి, చట్టం చేసింది. ఆర్టీసీలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని అందులో పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యం అందించడానికి, తక్కువ ధరల్లో ప్రయాణం సాగించడానికి పోటీ అనివార్యమని కూడా కేంద్రం అభిప్రాయపడింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించుకోవడం ద్వారా నిధులు సమకూర్చుకుంటామని కేంద్ర బడ్జెట్లోనే చెప్పారు. అలాంటిది బీజేపీ నాయకులు తెలంగాణలో మాత్రం ఆర్టీసీ విషయంలో విచిత్రమైన ఆరోపణలు చేస్తున్నారు''అని కేసీఆర్ విమర్శించారు. కేంద్రం తెచ్చిన చట్టాన్నే అమలు చేయడానికి తాము ప్రయత్నిస్తుంటే, స్థానిక బీజేపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్న విషయంపై ప్రధానికి, కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రికి లేఖ రాయాలనే అభిప్రాయపడ్డారు. సీఎంతో జరిగిన సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, రవాణాశాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్టీసీ ఈడీలు పాల్గొన్నారు.

# ఒడ్డుకు 'వశిష్ట'



ధర్మాడి సత్యాన్ని పైకెత్తి సంతోషం వ్యక్తం చేస్తున్న ఆయన బృందం

**సాక్షి, కాకినాడ/దేవీపట్నం/రంపచోడవరం:** నిండు గోదావరిలో 38 రోజులుగా సాగుతున్న అన్వేషణకు తెరదించుతూ రాయల్ వశిష్ట బోటు మంగళవారం ఒడ్డుకు చేరుకుంది. తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచ్చులూరు మందం వద్ద సెప్టెంబర్ 15వ తేదీన గోదావరిలో మునిగిన రాయల్ వశిష్ట బోటును ధర్మాడి సత్యం బృందం ఎంతో శ్రమించి మధ్యాహ్నం సమయంలో ఒడ్డుకు తరలించింది. విశాఖకు చెందిన ఓం శివ శక్తి సాయి అండర్ వాటర్ సర్వీస్‌కు చెందిన పది మంది డీప్ డైవర్స్ కూడా ధర్మాడి బృందంతో కలసి పనిచేశారు. నీట మునిగిన రాయల్ వశిష్ట బోటులో 8 మృతదేహాలు లభ్యమయ్యాయి.

**ఆపరేషన్ ఇలా ..**

బోటు ప్రమాదం జరిగినప్పటి నుంచి వెలికి తీసేందుకు నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు తీవ్రంగా శ్రమించినా ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు. చివరకు కాకినాడకు చెందిన బాలాజీ మెరైన్స్ నిర్వాహకుడు ధర్మాడి సత్యానికి రాయల్ వశిష్ట వెలికితీత పనులను రూ. 22.70 లక్షలకు అప్పగించారు. ప్రమాదానికి గురైన సమయంలో గోదావరిలో ఐదు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కచ్చులూరు మందం వద్ద ఆ సమయంలో గోదావరి 300 అడుగుల లోతు ఉంది. ధర్మాడి బృందం 25 మంది సభ్యులతో సంప్రదాయ పద్ధతిలో బోటు వెలికితీత పనులు ప్రారంభించింది. బోటు లంగరుకు చిక్కినట్టే చిక్కి జారిపోయినా పట్టు వీడలేదు. పలు దఫాలు విఫలమైనా ప్రయత్నాలు కొనసాగించింది.

**ధ్వంసమైన బోటు...**

మట్టి, ఒండ్రులో చిక్కుకుపోవడంతో సోమవారం బోటు పైకప్పు మాత్రమే ఊడి వచ్చింది. దీంతో మంగళవారం మరోసారి ప్రయత్నించారు. బోటు పంటుకు ఇనుప తాడు కట్టారు. ఆరుగురు గజ ఈతగాళ్లు బోటు చుట్టూ తిరిగి వెనుక భాగంలో ఉన్న ఫ్యాన్‌కు లంగరు వేశారు. అనంతరం పొక్లెయిన్ సాయంతో భారీ ఇనుప తాడు ద్వారా రాయల్ వశిష్ట బోటును గోదావరి నుంచి గట్టుకు తీసుకురాగలిగారు. అయితే ప్రమాదానికి గురైన బోటు పూర్తిగా ధ్వంసమైంది. అందులో ఉన్న మృతదేహాలు పూర్తిగా పాడైపోవడంతో దుర్వాసన వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ధర్మాడి సత్యంతోపాటు కాకినాడ పోర్టు అధికారి కెప్టెన్ ఆదినారాయణ కచ్చులూరు వద్దే ఉండి బోటు వెలికితీత పనులను పర్యవేక్షించారు.

**ఇప్పటిదాకా 46 మృతదేహాలు లభ్యం**

బోటులో 77 మంది ప్రయాణించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో 26 మంది సురక్షితంగా బయటపడ్డారు. 51 మంది గల్లంతయ్యారు. అందులో 39 మృతదేహాలు ఇప్పటికే లభ్యమయ్యాయి. తాజాగా బోటు వెలికితీత సమయంలో 7 మృతదేహాలు లభించాయి. మరో ఐదు మృతదేహాల ఆచూకీ తెలియాల్సి ఉంది.

**దారి కూడా లేని ప్రాంతానికి భారీ యంత్రాలు..**

బోటు ప్రమాదం జరిగినప్పటి నుంచి వెలికితీత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సంప్రదాయ పద్ధతులను వినియోగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రతి రోజూ సహాయక చర్యలపై ఆరా తీస్తూ వచ్చారు. మంత్రులను పంపి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. దారి కూడా లేని కచ్చులూరు మందానికి భారీ క్రేన్ తరలించే ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మృతులకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.3 లక్షలు, ప్రమాదం నుంచి బయటపడిన వారికి రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించారు. చివరి మృతదేహం లభ్యమయ్యే వరకు సహాయక చర్యలు జరిగే వరకు కొనసాగించాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులను సైతం వెంటనే సమకూర్చారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యులను పలకరించి కొండంత ధైర్యాన్నిచ్చారు.

# ఆర్టిజన్లకు వేతన సవరణ!

**అన్ని రకాల అలవెన్సులతో కొత్త పే స్కేల్ ● అమల్లోకి తెస్తూ ట్రాన్స్‌కో ఉత్తర్వులు**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టిజన్ల వేతన స్థిరీకరణలో భాగంగా వేతన సవరణ అమలుచేస్తూ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ (టీటఫ్) గత శనివారం విద్యుత్ సౌధలో చేసుకున్న ఒప్పందం మేరకు కొత్త పే స్కేల్ వర్తింపుతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ వంటి ఇతర సదుపాయాలను ఆర్టిజన్లకు వర్తింపజేస్తూ కొత్త పే స్కేల్‌ను అమలుచేశారు. ప్రస్తుతం అందుకుంటున్న కన్సాలిడేటెడ్ వేతనాల మొత్తాన్ని వేతన స్థిరీకరణలో భాగంగా పే స్కేల్ రూపంలో విభజించడంతో వేతనాల్లో ఎలాంటి మార్పు రాలేదు. అయితే, ఒప్పందం ప్రకారం తదుపరి పీఆర్సీ అమలు చేస్తే భవిష్యత్తులో ప్రయోజనం పొందే అవకాశాలున్నాయి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేలమంది ఆర్టిజన్లకు ఈ ఉత్తర్వులు ఊరట కల్పించనున్నాయి.

**ఈ ఉత్తర్వులతో అమల్లోకి వచ్చిన ఆదేశాలు**

- స్టాండింగ్ ఆర్డర్స్ పేరును ఆర్టిజన్ల సర్వీసు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌గా మార్చారు
- వేతన స్థిరీకరణలో భాగంగా వేతన సవరణ
- డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, వైద్య ఖర్చులు, రవాణా భత్యం, కార్పొరేట్ అలవెన్సుల వర్తింపు
- ఆర్టిజన్లందరికీ సర్వీసు రిజిస్టర్‌లో వేతన స్థిరీకరణ ఎంట్రీలు నమోదు
- 2019 అక్టోబర్ 1 నుంచి పే స్లిప్పుల జారీ
- 2017 జూలై 29 నుంచి పెయిడ్ హాలిడేలు
- తదుపరి వేతన సవరణ కాలం నుంచి ఆర్టిజన్లకు సైతం వేతన సవరణ అమలు
- 2016 డిసెంబర్ 4 తర్వాత మరణించిన ఆర్టిజన్ల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల కల్పన
- ఆర్టిజన్లపై క్రమశిక్షణ చర్యలను అధీకృత అధికారి మాత్రమే పరిశీలిస్తారు
- ఆర్టిజన్లకు వర్తింపజేసిన సదుపాయాలను రెస్కో ఉద్యోగులకు వర్తింపు
- ఆర్టిజన్లకు అంత్యక్రియల చార్జీలు రూ.20 వేలు
- చట్టబద్ధంగా యాజమాన్యాలు చెల్లించాల్సిన చెల్లింపులు. ఇంకా ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రొఫెషన్ ట్యాక్స్ వంటి కోతలు అమలు

# మున్సి'పోల్స్'కు ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానాలు జోక్యం చేసుకునేందుకు వీల్లేదు. అందుకే పిల్స్‌ను కొట్టేస్తున్నాం. ఈ దశలో ఎన్నికలకు అత్యంత కీలకమైన ఓటర్ల జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయని ఆధారాలు లేకుండా పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జి మున్సిపల్ ఎన్నికలపై వెలువరించిన తీర్పులో ఎన్నికలకు గరిష్టంగా అవసరమైన రోజులు ఉండాలనే అంశాన్ని మాత్రమే తెలిపింది. ఆ ప్రక్రియ పూర్తికి కనీస సమయం ఎంత ఉండాలో ఎక్కడా లేదు. ఈ విషయంలో సందేహాలు అవసరం లేదు. అసెంబ్లీ ఓటర్ల జాబితా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గణన చేయడం సులభం. ఇప్పుడున్న సాంకేతికత ఆధారంగా చేయడం మరింత సులభం. ఆ కేటగిరీల ఓటర్ల గణనలో తప్పులు జరిగాయని పిటిషనర్లు ఎలాంటి ఆధారాల్ని చూపలేకపోయారు. ఆరోపణల ఆధారంగానే కోర్టుకు వచ్చారు. ఓటరు గణన తప్పుగా జరిగిందంటూ ఒక్క ఓటరు కూడా కోర్టుకు రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పిటిషనర్లు చేసిన ఆరోపణల్ని పరిగణనలోకి తీసుకోలేం. ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘానికి సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది జూలై 3న ఓటర్ల జాబితా సిద్ధం కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేయడం చెల్లదు. రాజ్యాంగంలోని 243–జెడ్ ప్రకారం ఐదేళ్ల గడువులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి''అని హైకోర్టు తీర్పులో పేర్కొంది.

# కానిస్టేబుల్ ఫలితాలపై విచారణ జరపండి

**హోం మంత్రికి బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి**

**సాక్షి, హైదరాబాద్:** పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన 16,025 కానిస్టేబుల్ పోస్టుల నియామక పరీక్షా ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని, ఆ ఫలితాలపై విచారణ జరపాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు హోం మంత్రి మహమూద్ అలీని మంగళవారం ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్. కృష్ణయ్య కలసి వినతిపత్రం సమర్పించారు. నార్మలైజేషన్ ప్రక్రియను అడ్డం పెట్టుకుని ఎక్కువ, తక్కువ మార్కులు వేశారని ఆరోపించారు. ఫలితాల్లో జరిగిన తప్పులను సరిదిద్దాలని, అన్యా యం జరిగిన వారికి న్యాయం చేయాలని కోరారు. లాస్ట్ కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఉద్యోగం రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నార్మలైజేషన్ విధానాన్ని ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు. నార్మలైజేషన్ ఎలా చేశారో విద్యార్థులకు చెప్పకుండా రహస్యంగా ఉంచడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. జిల్లాల వారీగా, రిజర్వేషన్ కేటగిరీ గ్రూపుల వారీగా వివరాలివ్వడం లేద న్నారు. మొత్తం 16,925కు 16,025 అభ్యర్థులకు మాత్రమే పోస్టింగ్ ఇచ్చారని, ఇంకా 1,100 మంది పోస్టుల సెలక్షన్ జాబితా ప్రకటించలేదన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తానని మంత్రి హామీనిచ్చారని కృష్ణయ్య తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్, దాసు సురేశ్ ఉన్నారు.



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సంఘం నేతలు









# ఇద్దరే ముద్దు.. లేదంటే అన్నీ కట్

- ప్రభుత్వ ఉద్యోగాలుండవ్, పథకాలు వర్తించవు
- అస్సాం సర్కార్ సంచలన నిర్ణయం



**గువాహటి:** మీరు అస్సాంలో నివసిస్తున్నారా? బోల్డంత మంది పిల్లల్ని కనాలనే కోరిక మీకుందా? అయితే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వం ఇచ్చే పథకాలపై ఆశలు వదులుకోవాలి. లేదంటే మీ కోరికనైనా చంపుకోవాలి. ఎందుకంటే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మందిని కంటే ఇకపై ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకూడదని అస్సాం సర్కార్ సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. అస్సాం ముఖ్యమంత్రి సర్బానందా సోనోవాల్ నేతృత్వంలో సమావేశమైన మంత్రి మండలి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకూడదన్న కొత్త నిబంధనకు ఆమోద ముద్ర వేసింది. ఈ నిబంధన 2021 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఎవరైనా అతి తెలివికి పోయి ఉద్యోగం వచ్చాక నచ్చినంత మంది పిల్లల్ని కంటామన్నా కూడా కుదరదు. ఉద్యోగంలో చేరిన తర్వాత మూడో బిడ్డను కన్నారని తెలిసిన మరు క్షణం వారిని ఇంటికి సాగనంపేలా కఠినమైన నిబంధనల్ని రూపొందించింది. ఈ కొత్త విధానం ప్రకారం ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక వారికి వర్తించవు. గృహ, వాహన రుణాలు, ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరే ఇతర పథకాలు కూడా ఎక్కువ మంది పిల్లల్ని కనేవారికి వర్తించవు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఎవరి పిల్లలు వాళ్లిష్టం కదా ఇదెక్కడి రూల్స్ అని విమర్శించేవారికి చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న నినాదాన్ని ప్రోత్సహించడానికి అస్సాం సర్కార్ ఈ నిర్ణయం తీసుకుందని పబ్లిక్ రిలేషన్ సెల్ సమర్థించుకుంటోంది.

## లైసెన్స్ కోసం 'పద్ధతి'గా రండి!

**చెన్నై:** డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రత్యేకంగా ఎలాంటి డ్రెస్ కోడ్ లేనప్పటికీ లైసెన్స్ కోసం ప్రత్యేక డ్రెస్‌కోడ్‌లోనే రావాలంటున్నారు. మహిళలైనా, పురుషులైనా దీన్ని పాటించాలని చెన్నై రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (ఆర్టీఓ) అధికారి ఒకరు సూచించారు. 'ఆర్టీఓ కార్యాలయానికి రోజూ పలు రకాల వ్యక్తులు వస్తుంటారు. అందుకే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదనే ఉద్దేశంతోనే అభ్యర్థులు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌లో రావాలని సూచిస్తున్నాం'అని ఆయన తెలిపారు. 'సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న ఓ యువతి రోజువారీ ఆఫీస్‌కు జీన్స్ ప్యాంట్, స్లీవ్‌లెస్ టాప్స్ వేసుకుని వెళ్తుంది. అయితే ఆమెను డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చినప్పుడు పద్ధతి ప్రకారం డ్రెస్ వేసుకుని రమ్మని చెప్పాం'అని వెల్లడించారు.

## 'భారత్‌కీ లక్ష్మి' రాయబారులు సింధు, దీపిక





**ముంబై:** సినీ నటి దీపికా పదుకొనే, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధులను 'భారత్ కీ లక్ష్మి'రాయబారులుగా ప్రధాని మోదీ ప్రకటించారు. వేర్వేరు రంగాల్లో మహిళా సాధికారతకు తోడ్పడిన స్త్రీ మూర్తులను ఈ దీపావళి సందర్భంగా 'భారత్‌కీ లక్ష్మి' పేరుతో గౌరవించుకుందామంటూ ఇటీవలి 'మన్‌కీ బాత్'లో ప్రధాని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ప్రధాని ఉద్యమానికి మంగళవారం ట్విట్టర్‌లో వీరిద్దరూ మద్దతు ప్రకటించారు. 'ఈ దీపావళి సందర్భంగా మన దేశ మహిళలు సాధించిన విజయాలను, అందిస్తున్న సేవలకు గుర్తుగా వేడుక జరుపుకుందాం'అంటూ దీపిక ట్విట్టర్‌లో ఒక వీడియో షేర్ చేశారు. 'ప్రధాని మోదీ జీ 'భారత్ కీ లక్ష్మి'ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్నా. దీని ద్వారా అసాధారణ భారత మహిళలు సాధించిన అసాధారణ విజయాల వేడుక చేసుకుందాం. మహిళలకు సాధికారత, వారు సాధించిన విజయాలను సగర్వంగా చాటినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యం'అని సింధు ట్విట్టర్‌లో అన్నారు. వీరిద్దరి మద్దతుపై ప్రధాని మోదీ స్పందిస్తూ ట్విట్టర్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. 'అంకితభావానికి భారత మహిళా శక్తి ప్రతీకలు. మహిళా సాధికారితకు పాటుపడటం మన సంస్కృతిలోనే ఉంది' అని పేర్కొన్నారు.

## క్లుప్తంగా...

### వారికి చదువులు.. ఇతరులకు చావులు



**జమ్మూ:** ప్రాణ త్యాగాలు చేయాలని చెప్పే హురియత్ నాయకులు, మత పెద్దల పిల్లలు విదేశాల్లో చదువుతుంటే పేద పిల్లలు మాత్రం జిహాద్‌లో బలవుతున్నారని కశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్పారు. మంగళవారం కత్రాలోని మాతా వైష్ణోదేవి యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యువత జన్నత్ (స్వర్గం)లో మాత్రమే కాదని భూమ్మీద కూడా జీవించాలని పిలుపునిచ్చారు. మత విశ్వాసం కోసం ప్రాణత్యాగం చేస్తేనే (ఆత్మాహుతి దాడులు) స్వర్గంలో ప్రవేశిస్తారని మత పెద్దలు చెబుతున్న మాటలు అవాస్తవమని చెప్పారు. పేద పిల్లలు మాత్రం జిహాద్‌లో బలయ్యేలా మత పెద్దలు బోధలు చేస్తున్నారన్నారు. యువత కలలను జమ్మూకశ్మీర్ నాయకులు, బోధకులు ఛిద్రం చేశారని విమర్శించారు.

### ఎల్‌పీయూ విద్యార్థినికి రూ.42 లక్షల వేతనం



**జలంధర్:** లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం(ఎల్‌పీయూ)లో చదువుతున్న ఓ విద్యార్థినికి మైక్రోసాఫ్ట్ నుంచి ఆకర్షణీయమైన వేతన ఆఫర్ వచ్చింది. ఎల్‌పీయూలో 2019 ఏడాదికి గాను బీ.టెక్ (కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్) చివరి సంవత్సరం చదువుతున్న తాన్య అరోరాకు మైక్రోసాఫ్ట్ ఏడాదికి రూ.42 లక్షల వేతన ప్యాకేజీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఉద్యోగంలో చేరాక తాన్యా.. హైదరాబాద్‌లోని మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్ డీ సెంటర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేయనుంది. తాన్యాను చూసి గర్విస్తున్నట్లు వర్సిటీ చాన్స్‌లర్ అశోక్ మిట్టల్ వ్యాఖ్యానించారు. మూడేళ్లుగా ఎల్‌పీయూ విద్యార్థులు రికార్డుస్థాయిలో ఉద్యోగాలు సాధించారు.

### మైనారిటీలపై దాడులు సమర్థనీయం కాదు

**వాషింగ్టన్:** మైనారిటీలపై వివక్ష, దాడులు, దళితులు, ముస్లింలపై గో రక్షకుల పేరుతో దాడులు, 9 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న మతమార్పిడి వ్యతిరేక చట్టాలు.. మొదలైనవి భారత్‌లోని మైనారిటీలకు ఉన్న చట్టబద్ధమైన రక్షణలను సమర్థిస్తున్నట్లుగా లేవని అమెరికా ఆక్షేపించింది. ఈ మేరకు ఒక నివేదికను అమెరికా విదేశాంగ శాఖలో సౌత్ అండ్ సెంట్రల్ ఏసియా ప్రాంత వ్యవహారాలు చూసే అసిస్టెంట్ సెక్రటరీ ఎలిస్ జీ వెల్స్ మంగళవారం విదేశీ వ్యవహారాల సబ్ కమిటీకి సమర్పించారు.

### రేపు వైట్‌హౌజ్‌లో దీపావళి

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సంవత్సరం దీపావళి వేడుకలను వైట్‌హౌజ్‌లో రేపు జరుపుకోనున్నారు. దీపావళికి మూడు రోజుల ముందే వైట్‌హౌజ్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. గురువారం సంప్రదాయబద్ధంగా దీపాన్ని వెలిగించి ట్రంప్ దీపావళి వేడుకలను ప్రారంభిస్తారని వైట్ హౌజ్ మంగళవారం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ దీపావళి వేడుకలను జరుపుకోవడం ఇది వరుసగా మూడోసారి. వైట్ హౌజ్‌లో దీపావళి జరపడం 2009లో మాజీ అధ్యక్షుడు ఒబామాతో ప్రారంభమైంది.

### కథువా కేసులో కొత్త ట్విస్ట్

**జమ్మూ:** కథువా హత్యాచార ఘటనపై విచారణ కొత్త మలుపు తిరిగింది. ఈ ఘటనపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)సభ్యులపైనే కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. పరస్పర విరుద్ధ సాక్ష్యాలు చెప్పాలంటూ సాక్షులను చిత్రహింసలకు గురిచేశారంటూ వీరిపై ఆరోపణలు రావడంతో ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. 2018లో కశ్మీర్‌లోని కథువా గ్రామానికి చెందిన సంచార జాతి బాలిక(8)పై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నాలుగు నెలల క్రితం న్యాయస్థానం ఆరుగురిని నిందితులుగా తేల్చింది. మంగళవారం విచారణ సందర్భంగా ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు సిట్ సభ్యులపై తీవ్ర ఆరోపణలు చేశారు. పరస్పర విరుద్ధ, తప్పుడు సాక్ష్యాలు చెప్పాలంటూ తమను చిత్రహింసలు పెట్టారంటూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రేమ్ సాగర్‌కు ఫిర్యాదు చేశారు.

# ఆ హక్కు ప్రభుత్వానికి ఉందా?



- సామాజిక మాధ్యమాల్లోని సమాచారం వెల్లడించడంపై విచారించనున్న సుప్రీం
- 'సోషల్ మీడియా ప్రొఫైల్స్‌కు ఆధార్ లింక్' పిటిషన్లన్నీ ఇక సుప్రీంకోర్టుకే

**న్యూఢిల్లీ:** ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లోని పౌరుల సమాచారాన్ని తెలుసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందా అనే కీలక అంశంపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. అదేవిధంగా, సామాజిక మాధ్యమాలకు ఆధార్ నంబర్‌ను అనుసంధానించడంపైనా విచారణ జరపనుంది. ఇందుకు సంబంధించి వేర్వేరు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టు తనకు తానుగా బదిలీ చేసుకుంది. ఈ అంశంపై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం.. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అడ్డుకట్టవేసేందుకు, మెసేజీలను డీక్రిప్ట్ చేసే బాధ్యతను ఇంటర్మీడియరీస్ (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, సెర్చ్ ఇంజిన్లు, సామాజిక మాధ్యమాల వేదికలు)దే అనడంలో విశ్వసనీయతపై జనవరి 15వ తేదీలోగా నివేదిక సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్మీడియరీస్ గైడ్‌లైన్స్(సవరణ) చట్టం–2018 రూపకల్పనకు 90 రోజుల గడువు కావాలంటూ కేంద్రం చేసిన వినతిపై ఈ మేరకు సానుకూలత వ్యక్తం చేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. ఇది జాతి సమగ్రత, దేశ భద్రత పరిరక్షణకు మాత్రమే ఈ వెసులుబాటు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిందంటూ ఒక ఉగ్రవాది వాదించలేడని ఈ సందర్భంగా అటార్నీ జనరల్ పేర్కొన్నారు. ఒక మెసేజి గానీ, సమాచారం గానీ వాస్తవంగా ఎక్కడి నుంచి వచ్చిందో ఇంటర్మీడియరీస్ బహిర్గతం చేయడం తప్పనిసరి చేసేందుకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్న వాదనను సొలిసిటర్ జనరల్ తోసిపుచ్చారు. తమిళనాడు తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ హాజరై..వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లోని అధికారులు కోరిన ఏదైనా సమాచారాన్ని వెల్లడించాల్సిందేనంటూ ఐటీ చట్టంలోని సెక్షన్–69 చెబుతోందని, ఇందుకు విరుద్ధంగా చేస్తున్న వాదనలు భారతీయ చట్టాల ప్రకారం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు. 'అయితే, ఈ విషయంలో వారిని బలవంతం చేయగలమా? ఆ సమాచారాన్ని డీక్రిప్ట్ చేసి ఇవ్వడం లేదా అందుకు అవసరమైన సాంకేతికతను మీకు అందించడం ఇంటర్మీడియరీస్‌ది బాధ్యత అయి ఉండాలి'అంటూ ధర్మాసనం స్పందించింది. అదే సమయంలో తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు.. సుప్రీంకోర్టుకు పెండింగ్ పిటిషన్ల బదిలీని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు వేణుగోపాల్ తెలిపారు. దీంతో దాదాపు ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టులో రెండు, బోంబే, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో ఒక్కోటి చొప్పున పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సుప్రీంకు బదిలీ చేయాలంటూ ఫేస్‌బుక్ చేసిన వినతిని కోర్టు అంగీకరించింది. ఈ పిటిషన్లను 2020 జనవరి చివర్లో తగు ధర్మాసనం విచారణ చేపట్టేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఏదైనా నేర విచారణకు సంబంధించి అధికారులు కోరిన సమాచారాన్ని సర్వీస్ ప్రొవైడర్లు అందించాలా వద్దా అనేది సుప్రీంకోర్టు మాత్రమే నిర్ణయించాలని ఫేస్‌బుక్ తన పిటిషన్‌లో కోరింది.

## కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

- ఎదురుకాల్పుల్లో అమరుడైన ఆర్మీ అధికారి
- పాక్ కాల్పుల్లో పౌరులకు గాయాలు

**జమ్మూ:** భారత సైన్యం రెండు రోజుల క్రితం భారీ కాల్పులతో పీవోకేలో ఉన్న ఉగ్రవాదుల శిబిరాలను, సైనిక పోస్టులను ధ్వంసం చేసినా పాకిస్తాన్ బుద్ధి మారలేదు. సరిహద్దుల గుండా ఉగ్రమూకలను పంపడం, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం మారలేదు. తాజాగా జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణ. జమ్మూకశ్మీర్‌లో మంగళవారం చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ముష్కరులు హతం కాగా, ఒక సైన్యాధికారి నేలకొరిగాడు. ఎల్‌వోసీ వెంట పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో జైషే మొహమ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆగస్టులో గుజ్జర్ వర్గానికి చెందిన ఇద్దరు సోదరులను చంపడంలో వీరి ప్రమేయం ఉందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రాజౌరి జిల్లా నౌషెరా సెక్టార్‌లో గస్తీ తిరుగుతున్న బలగాలపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ నేలకొరిగారు. అదే సమయంలో ఎల్‌వోసీ ఆవలి వైపు నుంచి పాక్ సైన్యం కూడా కాల్పులు జరపగా దీటుగా బదులిచ్చామని సైన్యం పేర్కొంది. అంతకుముందు పూంచ్ జిల్లాలో ఎల్‌వోసీ వెంట పాక్ బలగాలు మోర్టార్లతో జరిపిన కాల్పుల్లో మహిళ సహా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఈ కాల్పులు మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగాయి. ప్రతిగా భారత సైన్యం కూడా కాల్పులు జరిపింది. కాల్పుల నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ప్రజలు భూగర్భ బంకర్‌లలో తలదాచుకున్నారు. పాఠశాలల్లోని చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని సైన్యం ప్రకటించింది.

## చదువు'కొందాం'.. చలో ఫారిన్!!

**వి**దేశాల్లో చదువు ఇంకా ప్రియమవుతోందా? లేక ఫారిన్లో చదువుకునే భారతీయులు పెరుగుతున్నారా? చూస్తుంటే రెండూ నిజమేనని పిస్తోంది. ఎందుకంటే పిల్లల చదువుల కోసం మనవాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు పంపే డబ్బులు మాత్రం ఏ నెలకానెల భారీగా పెరుగుతూనే వస్తున్నాయి. గడిచిన ఏడాది కాలంలో ఇది ఏకంగా 23 శాతానికి పైగా పెరిగిపోయింది. గతేడాది ఇదే నెలలో విదేశాలకు మనవాళ్ల పిల్లల చదువుల నిమిత్తం పంపిన సొమ్ము దాదాపు రూ.2,933 కోట్లు (419.1 మిలియన్ డాలర్లు) కాగా... ఈ ఆగస్టులో అది ఏకంగా రూ.3,718 కోట్ల (531.2 మిలియన్ డాలర్ల)కు చేరింది. మధ్యలో సెలవుల వంటి అంశాల వల్ల ఏప్రిల్ వంటి నెలల్లో ఇది తగ్గినా అప్పటి నుంచి పెరుగుతూనే వస్తోంది. ఆ వివరాలే ఇవి..






ఇది డ్రోన్ విమానం కాదు. ఐదుగురు ప్రయాణించగల ఫ్లైయింగ్ ట్యాక్సీ. జర్మనీకి చెందిన లిలియం అనే స్టార్టప్ సంస్థ దీన్ని తయారుచేసింది. మిగతా డ్రోన్‌లలాగా మెల్లగా కాకుండా గంటకు 100 కి.మీ.ల వేగంతో దూసుకెళ్లడం దీని ప్రత్యేకత.

## ఏ మీట నొక్కినా బీజేపీకే..

**పుణే:** మహారాష్ట్రలోని కోరెగావ్ అసెంబ్లీ స్థానంలోని ఓ గ్రామంలో ఈవీఎం గురించి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఎవరికి ఓటు వేసినా అది బీజేపీకి పడుతోందంటూ కొందరు గ్రామస్తులు అభ్యంతరాలు లేవనెత్తారు. అయితే వారి ఆరోపణలో నిజం లేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కీర్తి నలవాడె స్పష్టంచేశారు. గ్రామంలో ఎన్నికల సమయంలో ఈవీఎం మార్చిన మాట వాస్తవమని, అయితే అందులో ఓటు వేరే పార్టీకి పడుతోందన్నది అవాస్తవమన్నారు. ఎన్సీపీ అభ్యర్థి శ్రీనివాస్ పాటిల్‌కు వేసే ఓటు బీజేపీ అభ్యర్థి ఉదయన్ రాజే భోసలేకి పడుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయాన్ని గ్రామ మాజీ డిప్యూటీ సర్పంచ్ సమర్థించడంతో రభస ప్రారంభమైంది. దీనికి తాను కూడా సాక్ష్యం అంటూ ఎన్సీపీ ఎమ్మెల్యే శశికాంత్ షిండే అన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్సీపీకి ఓటేయాలని వచ్చిన దీపక్ రఘునాథ్ పవార్ తాను బటన్ నొక్కక ముందే బీజేపీకి చెందిన బటన్ పక్కనే ఉన్న రెడ్ లైట్ వెలిగిందని ఎన్నికల అధికారులతో అన్నారు. దీంతో అధికారి మాటపూర్వకంగా ఒప్పుకొని, బటన్ సరిగా పని చేయకపోతుండటం కారణమని భావించి ఈవీఎం మార్పించాడు. కాగా, హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 68.46 శాతంగా నమోదైనట్లు ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు.

# మోదీతో నోబెల్ విజేత అభిజిత్ భేటీ

**న్యూఢిల్లీ:** ప్రవాస భారతీయుడు, ఈ ఏడాది ఆర్థిక నోబెల్ పురస్కార విజేత అభిజిత్ బెనర్జీ మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వివిధ రంగాలకు సంబంధించి ఇరువురి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చర్చలు జరిగాయి. ఈ విషయాన్ని మోదీ తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా వెల్లడించారు. అభిజిత్ తనతో భేటీ అయిన ఫొటోని కూడా మోదీ ట్విట్టర్‌లో ఉంచారు. 'నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీతో సమావేశం అద్భుతంగా సాగింది. మానవ సాధికారతపై ఆయనకున్న తపన స్పష్టంగా కనిపిస్తుంది. వివిధ అంశాలపై ఆలోచనల్ని పంచుకున్నాం. ఆయన సాధించిన విజయాలను చూసి భారత్ గర్విస్తోంది' అని మోదీ ట్వీట్ చేశారు. కోల్‌కతాకు చెందిన అభిజిత్ బెనర్జీ ప్రస్తుతం అమెరికాలో మసాచూసెట్స్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు.



మోదీతో మాట్లాడుతున్న అభిజిత్

**మోదీ ఆలోచనలు వినూత్నం: అభిజిత్**

ప్రధానమంత్రిని కలిసి వచ్చిన తర్వాత అభిజిత్ బెనర్జీ మీడియాతో మాట్లాడారు. భారత్‌లో పాలనను గాడిలో పెట్టడానికి మోదీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. 'ఎన్డీయే పరిపాలనపై క్షేత్రస్థాయిలో కొందరిలో నెలకొన్ని ఉన్న అపోహలను తొలగించాలంటే పరిపాలనకు సంబంధించి ప్రజల సలహాలు కూడా స్వీకరించాలని, అధికార వ్యవస్థని ప్రక్షాళన చేసి ప్రజలకు జవాబుదారీతనాన్ని పెంచాలని మోదీ చెప్పారు. భారత్ అభివృద్ధి కోసం మోదీ ఆలోచనలు వినూత్నంగా ఉన్నాయి''అంటూ అభిజిత్ ఆకాశానికెత్తేశారు.

**మీడియాపై మోదీ జోకులు**

ప్రధానమంత్రిని తాను కలుసుకోగానే ఆయన బోల్డన్ని జోకులు వేశారని, ముఖ్యంగా మీడియా గురించి ఛలోక్తులు విసిరారని అభిజిత్ చెప్పారు. మోదీకి వ్యతిరేకంగా మీరేమైనా చెబుతారేమోనని బయట మీడియా కాచుకొని కూర్చుంది. మీ నుంచి అలాంటి వ్యాఖ్యలు రాబట్టాలని ప్రయత్నిస్తుంది అంటూ మోదీ తనతో నవ్వుతూ చెప్పారని వెల్లడించారు. ''మోదీ టీవీ చూస్తూ ఉంటారు, మీడియా ప్రతినిధులు ఏం చేస్తారో గమనిస్తూ ఉంటారు. మీడియా ఏం చేస్తుందో ఆయనకు బాగా తెలుసు'అని అభిజత్ చెప్పారు.

## బెయిలు.. అయినా తప్పదు జైలు

- ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరంకి సుప్రీంకోర్టు బెయిల్
- అయినా, మనీల్యాండరింగ్ కేసులో ఈడీ అదుపులోనే చిదంబరం



**న్యూఢిల్లీ:** ఎట్టకేలకు సీబీఐ దాఖలు చేసిన ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరానికి సుప్రీంకోర్టు మంగళవారం బెయిలు మంజూరు చేసింది. చిదంబరం సాక్షులను ప్రభావితం చేసే అవకాశంగానీ, విదేశాలకు పారిపోయే ప్రమాదం గానీలేదని కోర్టు అభిప్రాయపడింది. రూ.1లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై సుప్రీంకోర్టు చిదంబరానికి బెయిల్ మంజూరు చేసింది. అయితే సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసినప్పటికీ చిదంబరం పూర్తిగా జైలునుంచి విముక్తి అయ్యే అవకాశం లేదు. ఎందుకంటే ఐఎన్ఎక్స్ మీడియా స్కాంకి సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసులో చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇప్పటికే అదుపులోకి తీసుకుంది. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 2007లో విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి.. ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ నిధులు(రూ.305 కోట్లు) సమకూర్చిపెట్టేందుకు చిదంబరం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై 2017 మే 15న సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత 2017లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చిదంబరంపై మనీలాండరింగ్ కేసు నమోదుచేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అవినీతి నిరోధక చట్టం కింద ఆగస్టు 21న చిదంబరంను ఢిల్లీలోని ఆయన నివాసంలోనే సీబీఐ అరెస్టు చేయడం తెల్సిందే. అక్టోబర్ 18న చిదంబరంని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలోకి తీసుకుంది.

# కెనడా పీఠంపై మళ్లీ ట్రూడో!

- మెజారిటీకి కొద్ది దూరంలో లిబరల్ పార్టీ
- ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న ట్రూడో
- కింగ్‌మేకర్‌గా భారతీయుడైన జగ్మీత్

**ఒటావా:** కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో అతి కష్టం మీద పదవిని నిలుపుకునే పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని లిబరల్ పార్టీ మొత్తం 338 ఎలక్టోరల్ డిస్ట్రిక్స్‌కుగానూ 157 డిస్ట్రిక్ట్స్‌లో విజయం సాధించగా, ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ 121 డిస్ట్రిక్ట్స్‌లో గెలిచింది. దాంతో ఇతరుల మద్దతుతో లిబరల్ పార్టీ మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. కాగా, ఈ ప్రభుత్వ ఏర్పాటులో ఇండియన్ కెనడియన్ అయిన జగ్మీత్ సింగ్ కీలక పాత్ర పోషించనున్నారు. ఆయన నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ(ఎన్‌డీపీ) 24 సీట్లు గెలుచుకుని 'కింగ్ మేకర్'గా అవతరించింది. అయితే, 2015 నాటి ఎన్నికల కన్నా ఈ సారి ఆ పార్టీ గెలిచిన స్థానాల సంఖ్య తగ్గింది. ఆ ఎన్నికల్లో ఎన్‌డీపీ 44 సీట్లు గెల్చుకుంది. బ్లాక్ క్యూబెకాయిస్ 32, గ్రీన్ పార్టీ 3 సీట్లు గెలుపొందాయి. బ్లాక్ క్యూబెకాయిస్, గ్రీన్ పార్టీ ట్రూడో ప్రభుత్వంలో చేరబోమని ఇప్పటికే సంకేతాలు ఇచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ట్రూడోకు మరో 13 మంది సభ్యుల మద్దతు అవసరం. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని, కెనడియన్ల హక్కుల కోసం పోరాడుతామని ఈ ఎన్నికల ఫలితాల అనంతరం జగ్మీత్ సింగ్ వ్యాఖ్యానించారు. కెనడాలోని ఒక రాజకీయ పార్టీకి నేతృత్వం వహిస్తున్న తొలి శ్వేతజాతీయేతర నేత 40 ఏళ్ల జగ్మీత్ సింగ్‌నే కావడం విశేషం. ఈ ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీపీ తరఫున ప్రధాని అభ్యర్థిగా నిలిచిన జగ్మీత్ సింగ్ గతంలో క్రిమినల్ డిఫెన్స్ లాయర్‌గా పనిచేశారు.



మాంట్రియెల్‌లో ఆనందంలో ట్రూడో దంపతులు




బర్నబేలో అభివాదం చేస్తున్న జగ్మీత్ దంపతులు

ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ట్రూడో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. కెనడా ప్రజలు ప్రగతిశీల అజెండాకు ఓటేశారని ఫలితాల అనంతరం ట్రూడో వ్యాఖ్యానించారు. గత నాలుగేళ్లుగా ప్రధానిగా ఉన్న ట్రూడో ఈ ఎన్నికల ప్రచారంలో పెద్ద ఎత్తున వ్యతిరేకతను చవిచూడాల్సి వచ్చింది. ఒక ఎన్నికల ర్యాలీలో ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌తో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూబెక్, అల్బెర్టా తదితర ప్రావిన్స్‌ల్లో ఆయన నేతృత్వంలోని లిబరల్ పార్టీ భారీగా దెబ్బ తిన్నది. ట్రూడో ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగదని కన్సర్వేటివ్ పార్టీ నేత షీర్ వ్యాఖ్యానించారు. మరోసారి ఎన్నికలు వస్తే తమదే విజయమన్నారు. 2.74 కోట్ల ఓటర్లను కెనడాలో ఈ ఎన్నికల్లో 65% పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 97 మంది మహిళలు గెలిచారు.

**మోదీ శుభాకాంక్షలు:** కెనడా ఎన్నికల్లో విజయం సాధించిన జస్టిన్ ట్రూడోకు భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య, బహుళత్వ విలువల విషయంలో భారత్, కెనడాలు ఒకటేనన్న మోదీ.. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ట్రూడోతో కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నా' అని మంగళవారం ట్వీట్ చేశారు.

## ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపండి

### సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



**సాక్షి, న్యూఢిల్లీ:** సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వారితో చర్చలు జరపాలని టీఆర్ఎస్ ప్రభుత్వానికి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సూచించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ అని చెప్పుకొనే టీఆర్ఎస్ కార్మికుల పోరాటాలను అణచాలని చూడటం సరికాదని విమర్శించారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం కనీస బాధ్యత అని గుర్తు చేశారు. చర్చలు జరపకుండా 48 వేల మంది కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారంటూ ప్రభుత్వం అనుచిత ప్రకటనలు చేయడం సరికాదన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా జాక్టో, యూఎస్‌పీసీ కార్యాచరణ

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 18 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా టీచర్ల ఐక్య కార్యాచరణ కమిటీ (జాక్టో), ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాయి. హైకోర్టు సూచనల మేరకు ముఖ్యమంత్రి వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని కోరాయి. ఇప్పటికే సమ్మెకు మద్దతుగా పలు కార్యక్రమాలు చేపట్టామని, ఈ నెల 23 నుంచి 25 వరకు సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపాయి. 23న ఇటీవల చనిపోయిన ఆర్టీసీ కార్మికులకు డిపోల వద్ద నివాళులర్పిస్తూ క్యాండిల్ ర్యాలీలు నిర్వహిస్తామని, 24న పట్టణ ప్రాంతాల్లో జరిగే మహిళా కార్మికుల దీక్షల్లో పాల్గొంటామని, 25న తాలూకా/డివిజన్ స్థాయిల్లో ర్యాలీలు చేస్తామని వెల్లడించాయి.

## టీఈఏ అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా భరత్ సత్యనారాయణ నియమితులయ్యారు. సంగారెడ్డి జిల్లాలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయన ఇప్పటివరకు వివిధ ఉద్యోగ సంఘాల్లో సేవలందించారు. టీఈఏ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయనకు టీఈఏ అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమారస్వామి నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని వెల్లడించారు. ఈ సందర్భంగా భరత్ సత్యనారాయణ మాట్లాడుతూ.. టీఈఏ ద్వారా రాష్ట్రంలోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం బాలస్వామి, రాష్ట్ర కన్వీనర్ బత్తిని సుదర్శన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జి. నిర్మల, రిటైర్డ్ ఫోరం కె. అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలకు సెల్ టవర్ల టోకరా

### ఖజానాకు గండిపడుతుందని తేల్చిన నిఘా విభాగం

**సాక్షి, హైదరాబాద్:** టెలికం కంపెనీలు మున్సిపాలిటీల ఆదాయానికి భారీగా గండికొడుతున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించింది. సెల్‌టవర్ల యాజమాన్యాల నుంచి ఫీజులు వసూలు చేయకుండా స్థానిక పట్టణ సంస్థలు చోద్యం చూస్తున్నాయని తేల్చింది. దీంతో ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతోందని అభిప్రాయపడింది. ఖమ్మం జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన మొబైల్ టవర్ల నుంచి నిర్దేశిత మొత్తం రూ.15.20 లక్షలను రాబట్టడంలో విఫలమైనట్లు విజిలెన్స్ శాఖ తేల్చింది. ఇలా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో వేర్వేరు సంస్థల సెల్‌టవర్ల నుంచి రావాల్సిన ఫీజులు భారీగా పెండింగ్‌లో ఉన్నట్లు అభిప్రాయపడింది. ఈ మేరకు విజిలెన్స్‌శాఖ సమర్పించిన నివేదికతో అప్రమత్తమైన పురపాలక శాఖ.. తక్షణమే మున్సిపాలిటీల్లోని మొబైల్ టవర్ల యాజమాన్యాల నుంచి ఇన్‌స్టలేషన్, రెన్యువల్ ఫీజులను సేకరించాలని ఆ శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

## ఏసీబీ కస్టడీలో ఈఎస్ఐ స్కాం నిందితుడు రాజేశ్వర్‌రెడ్డి

### మూడు రోజుల పాటు విచారించనున్న ఏసీబీ

**సాక్షి, హైదరాబాద్:** ఈఎస్ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) విభాగంలో వెలుగుచూసిన మందుల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న తేజ ఫార్మా ఎండీ పి.రాజేశ్వర్‌రెడ్డిని ఏసీబీ మంగళవారం తన కస్టడీలోకి తీసుకుంది. ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ దేవికారాణితో కలసి మందుల కొనుగోళ్లలో పలు అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఇతనిపై అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రాజేశ్వర్‌రెడ్డిని మంగళవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లలో ఎలా అక్రమాలకు పాల్పడ్డారన్న విధానంపై ఏసీబీ అధికారులు పలు కీలక విషయాలు రాబట్టినట్లు సమాచారం. సాయంత్రం తిరిగి అతన్ని చంచల్‌గూడ జైలుకి తరలించారు. మరో మూడురోజులపాటు అతడిని ఏసీబీ విచారించనుంది.

## రవిప్రకాశ్ నకిలీ మెయిల్ కేసులో స్టే



**సాక్షి, హైదరాబాద్:** నకిలీ ఈ–మెయిల్ ఐడీ సృష్టించారనే అభియోగాలపై బంజారాహిల్స్ పోలీసులు టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌పై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యల్ని నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని, తుది విచారణ గురువారం జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఒక కేసులో బెయిల్ లభించిన వెంటనే పోలీసులు మరో కేసులో అరెస్ట్ చూపుతున్నారని ఆయన న్యాయవాది వాదించారు. చిన్న కేసుల్లో నిందితుల్ని ఈ విధంగా వేధింపులకు గురి చేసి జైల్లో ఉంచేలా చేయడం చెల్లదని కోర్టు అభిప్రాయపడింది.

## బ్యాంకుల విలీనాన్ని ఆపేయాలి

### ఏపీటీబీఈఎఫ్ గౌరవాధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని మన్నించి బ్యాంకుల విలీనాన్ని ఆపేయాలని, ప్రస్తుతం ఉన్న బ్యాంకులను యథాతథంగా కొనసాగించాలని సీపీఐ సీనియర్ నేత, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) గౌరవాధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఏపీటీబీఈఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమ్మె విజయవంతమైందన్నారు. సమ్మెను విజయవంతం చేసిన బ్యాంకు ఉద్యోగులను సురవరం ఓ ప్రకటనలో అభినందించారు.



మంగళవారం జేబీఎస్ వద్ద నిర్వహించిన సభలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి, చిత్రంలో వివిధ పార్టీల నేతలు



జగిత్యాల బస్ డిపో వద్ద తమ పొట్ట కొట్టొద్దంటూ తాత్కాలిక సిబ్బందిని వేడుకుంటున్న ఆర్టీసీ మహిళా కండక్టర్లు

# మా పొట్ట కొట్టకండి..

- ప్రజల ప్రాణాలు తీయకండి
- తాత్కాలిక డ్రైవర్లకు ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తి
- గులాబీ పూలు ఇచ్చి నిరసన
- బస్సుల అడ్డగింత.. 18వ రోజు ఉధృతంగా ఆందోళనలు
- డిపోల ఎదుట వంటావార్పు
- జేబీఎస్ ఎదుట సభకు అఖిలపక్ష నేతల సంఘీభావం

**సాక్షి, హైదరాబాద్:** 'మా పొట్టలు కొట్టకండి.. ప్రజల ప్రాణాలు తీయకండి'అంటూ ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబసభ్యులు తాత్కాలిక డ్రైవర్ల చేతికి గులాబీ పూలు ఇచ్చి మరీ వేడుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద మంగళవారం ఉదయం కార్మికులు, వారి కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో చేరుకుని డిపోల నుంచి బస్సులు తీస్తున్న తాత్కాలిక బస్సు డ్రైవర్లను అడ్డుకున్నారు. కొన్నిచోట్ల వారి కాళ్లకు దండం పెట్టి మరీ వేడుకోవటం కనిపించింది. రాష్ట్ర బంద్ తర్వాత మలిదశ సమ్మె కార్యాచరణలో భాగంగా.. తాత్కాలిక సిబ్బందిని కుటుంబ సభ్యులతో కలసి విన్నవించే కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. సమ్మె మొదలైనప్పటి నుంచి నిత్యం చాలా ప్రాంతాల్లో తాత్కాలిక డ్రైవర్లు నిర్లక్ష్యంగా బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సులను చూస్తేనే ప్రజలు వణుకుతున్న పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు రూ.1,500 వస్తాయని ఆశపడి, బస్సు స్టీరింగ్ చేతపట్టి అమాయకుల ప్రాణాలు హరించటం మంచిది కాదని హితవు పలికారు. సమ్మెను నిర్వీర్యం చేసే క్రమంలో ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణమవుతోందని మండిపడ్డారు. తాత్కాలిక పేమెంట్లకు ఆశపడి ఆర్టీసీ కార్మికుల పొట్ట కొట్టొద్దని, తాత్కాలిక డ్రైవర్లు విధులు నిర్వర్తించకుంటే వెంటనే ప్రభుత్వం దిగొచ్చి చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తుందని, 49 వేల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటుందని పేర్కొన్నారు. వెంటనే తాత్కాలిక డ్రైవర్లు సమ్మెకు మద్దతు తెలిపి విధులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె పరిష్కారమైన తర్వాత తాత్కాలిక డ్రైవర్లకు ఎలాగూ ఉద్యోగం ఉండదని, దీన్ని గుర్తించి వెంటనే వారు వెనక్కి వెళ్లాలని సూచించారు.

**ఉధృతంగా 18వ రోజు సమ్మె**

18వ రోజు కూడా ఆర్టీసీ కార్మికులు ఉధృతంగా సమ్మెలో ముందుకు సాగారు. జూబ్లీబస్టాండ్ వద్ద రోడ్డుపై భారీ ఎత్తున వంటావార్పు నిర్వహించారు. దాదాపు 2 వేల మంది కార్మికులు ఇందులో పాల్గొన్నారు. రోడ్డుమీదనే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు భోజనాలు చేశారు. అనంతరం సభ నిర్వహించారు. ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, కోదండరాం, కాంగ్రెస్ నేతలు మధు యాష్కీ, వీహెచ్, టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, మోత్కుపల్లి నర్సింహులు, బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, సీపీఎం నేత నరసింహారావు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షణకు సాగుతున్న ఈ సమ్మెకు ప్రజలు కూడా మద్దతు తెలపాలని కోరారు. సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తప్పుడు నివేదిక ఇవ్వడం సిగ్గుచేటని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి విమర్శించారు. వంద శాతం బస్సులు నడుపుతున్నామని ప్రభుత్వం చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం కేసీఆర్ నిరంకుశ పాలనకు అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

**వర్షాన్ని సైతం లెక్క చేయకుండా..**

ఖమ్మం డిపో ఎదుట కార్మికులు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ఆందోళనల్లో పాల్గొన్నారు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా రోడ్డుపై పడుకుని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో డిపో ఎదుట వంటావార్పు నిర్వహించారు. నల్లగొండ డిపో వద్ద కార్మికులు చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఉదయం వేళ బస్సులు బయటకు రాకుండా కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు ఎస్కార్ట్ వాహనాలు ఏర్పాటు చేసి కొన్ని బస్సులు నడిపించారు. సూర్యాపేట డిపో ఎదుట వంటావార్పు నిర్వహించారు. సమ్మెకు మద్దతుగా అద్దె బస్సు డ్రైవర్లు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి ఆందోళనల్లో పాల్గొన్నారు. దీంతో ఈ డిపో పరిధిలో మంగళవారం 45 అద్దె బస్సులు రోడ్డెక్కలేదు. సిద్దిపేటలో 40 అద్దె బస్సులకు మంగళవారం ఒకే బస్సు నడిచింది. మెదక్‌లో కార్మికులు మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. సంగారెడ్డిలో అద్దె బస్సుల డ్రైవర్లు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. మహబూబ్‌నగర్‌లో కార్మికులు నిర్వహించిన ఆందోళనల్లో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని మద్దతు తెలిపారు.

## నిలకడగా చిన్నారుల ఆరోగ్యం

**పరారీలో ఆస్పత్రి యాజమాన్యం**

**సాక్షి, హైదరాబాద్:** షైన్ ఆస్పత్రి అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆయా ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. అగ్ని ప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన చిన్నారుల వైద్య ఖర్చులు భరిస్తామని ప్రకటించిన షైన్ ఆస్పత్రి యాజమాన్యం ఇప్పుడు ముఖం చాటేసింది. ఆస్పత్రి ఘటనపై ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసింది. పోలీసులకు సైతం ఆస్పత్రి యాజమాన్యం అందుబాటులోకి రానట్లు తెలుస్తోంది. ఆస్పత్రి ఎండీ సునీల్ కుమార్ రెడ్డి కూడా పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

**వివిధ ఆస్పత్రుల్లో చిన్నారులకు చికిత్స**

ప్రమాద సమయంలో జ్వరం, ఇతర సాధారణ సమస్యలతో బాధపడుతూ 42 మంది చిన్నారులు షైన్ ఆస్పత్రి జనరల్ వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. వీరందరినీ ఒకే ఆస్పత్రికి తరలిస్తే..సమస్య మరింత పెద్దగా మారుతుందని భావించి గుట్టుచప్పుడు కాకుండా ఒక్కొక్కరిని ఒక్కో ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. రెయిన్‌బో, లోటస్..సిద్దేశ్వర్ ఆస్పత్రుల్లో కొంతమంది పిల్లల్ని చేర్పించినట్లు తెలుస్తోంది. అయితే వీరంతా క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన గిరి, మమతల కుమారుడు అవినాష్ (రెండున్నర నెలలు) ఉప్పల్‌లోని శ్రీధ ఆస్పత్రికి, చంపాపేటకు చెందిన ముత్యాలు, సరిత దంపతుల 36 రోజుల శిశువును బంజారాహిల్స్‌లోని ఏవీఎస్ అంకుర ఆస్పత్రికి తరలించారు. అవినాష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నల్లగొండ జిల్లా ఉరుమడ్లకు చెందిన నాగరాజు, సుగుణ దంపతుల 13 నెలల శిశువును ఎల్బీనగర్‌లోని దిశ ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారులు మలక్‌పేట మూసారం బాగ్ చౌరస్తాలోని సేఫ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో మాజీద్ ఇమ్రాన్ కుమారుడు మహ్మద్ అజ్లాన్ ఆరీష్( 6 నెలలు) ఆరోగ్యం మెరుగు పడినట్లు వైద్యులు వెల్లడించారు. మహ్మద్ ఖాలేద్ అక్రమ్ కుమారుడు అబ్దుల్లా (45 రోజులు) పెడియాట్రిక్ ఇన్టెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉందని వైద్యులు చెబుతున్నారు.

**బాలల హక్కుల కమిషన్ విచారణ**

అగ్నిప్రమాద ఘటనలో చిన్నారి మృతిచెందడాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. కమిషన్ సభ్యులు పానుగోటి అంజన్‌రావ్,అపర్ణ, బృందాకర్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం మంగళవారం ఆస్పత్రిని సందర్శించి విచారించారు. అన్ని విభాగాల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని సభ్యులు తెలిపారు.

**వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ సందర్శన**

వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ రవీంద్ర నాయక్ మంగళవారం షైన్ ఆస్పత్రిని సందర్శించారు. దుర్ఘటనపై ఆస్పత్రి వర్గాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షైన్ ఆస్పత్రి ఘటనపై ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు.

## తుంగభద్ర బోర్డు పరిధిలోకి ఆర్డీఎస్

- అంగీకరించిన ఏపీ, కర్ణాటక
- సత్వర పనులకు తెలంగాణ వినతి

**సాక్షి, హైదరాబాద్:** రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్)కు నీటిని సరఫరా చేసే ప్రధాన కాల్వను తుంగభద్ర బోర్డు పరిధిలోకి తేవాలన్న వినతికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు అంగీకరించినట్లు తెలిసింది. ఆర్డీఎస్‌ను బోర్డు పరిధిలోకి తెస్తేనే ప్రధాన కాల్వల పనులు వేగిరం చేయొచ్చన్న తెలంగాణ వినతికి ఈ రాష్ట్రాలు మద్దతు ఇచ్చినట్లు సమాచారం. కేంద్ర జల సంఘం కార్యాలయంలో తుంగభద్ర బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తుంగభద్ర బోర్డు చైర్మన్ రంగారెడ్డితో పాటు తెలంగాణ చీఫ్ ఇంజనీర్ విజయ్‌కరణ్‌రెడ్డి, ఎస్ఈ అంజయ్య, ఈఈ శ్రీనివాస్‌లతో పాటు ఏపీ, కర్ణాటక ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇంజనీర్లు ఆధునీకరణ అంశాన్ని ప్రస్తావించి నీటి కేటాయింపులు, గడిచిన పదేళ్లుగా తెలంగాణకు దక్కుతున్న వాటాలపై వివరించారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు 15.9 టీఎంసీల కేటాయింపులున్నా అందులో 4 నుంచి 5 టీఎంసీలకు మించి దక్కట్లేదని, కర్ణాటక నుంచి ఆర్డీఎస్‌కు నీటిని తరలించే కాల్వ పూడికతో నిండినందున 850 క్యూసెక్కులుగా ఉండాల్సిన ప్రవాహం 100కి పడిపోయిందని వివరించారు. ఈ దృష్ట్యా ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు మరో 5 అంగుళాల మేర పెంచాలని నిర్ణయించి, అందుకు రూ.72 కోట్లు కర్ణాటక వద్ద జమ చేసినా పనులు మాత్రం జరగట్లేదని తెలిపారు. దీనిపై స్పందించిన బోర్డు పనుల పూర్తికి సహకరించాలని ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు సూచించింది.

## కీచకులు పెరిగారు!

- మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాల్లో తెలంగాణ టాప్
- ఎన్‌సీఆర్‌బీ–2017 రిపోర్టులో వెల్లడి..



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ పోలీసుశాఖ నేరాల నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు మాత్రం పెరుగుతున్నాయి. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)–2017 నివేదికలో ఈ చేదు విషయాలు వెల్లడయ్యాయి. 2015 నుంచి 2017 మధ్యకాలంలో మిగిలిన అన్ని రకాల నేరాలు తెలంగాణలో తక్కువగానే నమోదైనప్పటికీ.. మహిళలు, చిన్నారులపై నేరాల్లో మాత్రం పెరుగుదల నమోదవడం పరిస్థితికి అద్దం పడుతోంది. 2015 నుంచి 2017 వరకు దేశవ్యాప్తంగా చిన్నారులపై వేధింపులకు సంబంధించి పోస్కో చట్టం కింద 10 రాష్ట్రాలు ముందుండగా.. అందులో 1,632 పోస్కో కేసులతో తెలంగాణ ఐదోస్థానంలో నిలిచింది. మొత్తంగా ఈ మూడేళ్లలో చిన్నారులపై లైంగిక దాడి, హత్య ఘటనల్లో 10 కేసులతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తమ్మీద చిన్నారులపై జరిగిన నేరాల్లో 2015–2017 వరకు 3,580 కేసులతో దక్షిణభారతంలోనే అగ్రభాగాన నిలిచింది. ఈ నేరాల్లో దేశం వాటా 3.8 శాతంగా ఉంది. మహిళలపై నమోదైన నేరాలు 2016లో 15,374, 2015లో 15,374, 2017లో 17,521 కేసులు నమోదయ్యాయి. వీటిలో వరకట్నం, అత్యాచారం, హత్య కేసులున్నాయి. తెలంగాణ వాటా 4.9 శాతంగా ఉంది.

**చిన్నారులపై పెరిగిన లైంగిక దాడులు..**

1.దేశవ్యాప్తంగా చిన్నారులపై లైంగిక దాడులు 93.4 శాతం పెరగ్గా.. నేరాలకు పాల్పడిన వారిలో అధిక శాతం మంది కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులే.

2.చిన్నారులపై లైంగిక వేధింపులు పెరగడానికి పోర్న్‌సైట్లతో పాటు ఫేస్‌బుక్, టిక్‌టాక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు కూడా కారణమయ్యాయి.

3.భ్రూణహత్యల విషయంలో హైదరాబాద్‌లో ఒక్కటి కూడా నమోదు కాకపోవడం విశేషం.

4.మహిళలపై ఒక యాసిడ్ దాడి కేసు నమోదైంది.

**ఇతర నేరాలు..**

1.మానవ అక్రమ రవాణాకు సంబంధించి తెలంగాణలో 329 నమోదయ్యాయి.

2.రాష్ట్రంలో 1,280 సైబర్‌నేరాలు నమోదయ్యాయి. వీటిలో 2016లో 593, 2015లో 687 నేరాలు నమోదయ్యాయి. దేశంలో తెలంగాణ వాటా 5.5 శాతం.

3.తెలంగాణలో కిడ్నాప్ కేసులు 1,450 నమోదయ్యాయి. తెలంగాణ వాటా 4.2 శాతం.

4.రాష్ట్రంలో 2015 నుంచి 2017 వరకు నమోదైన ఐపీసీ కేసులు 1,19,858. రాష్ట్రం వాటా 3.9 శాతం.


## తెలంగాణలో మహీంద్రా ట్రాక్టర్లు ఎందుకని రైతులకి మొదటి ఎంపికగా అయ్యాయి?

వ్యవసాయానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు మరియు పండుగల సీజన్ ప్రారంభం అవ్వడం ట్రాక్టర్ పరిశ్రమకి చాలా ముఖ్యమైనవి. అప్పుడే రైతులు కొత్త ట్రాక్టర్లలో పెట్టుబడి పెట్టాలని అనుకుంటారు. ఇలాంటి సమయంలోనే ప్రతి ట్రాక్టర్ కంపెనీ తమ బ్రాండ్లవైపు రైతులను ఆకర్షించేందుకై గొప్ప ఆఫర్లను ప్రవేశపెడతాయి.

నేటి రైతు చాలా తెలివిగా మరియు ముందుచూపుతో ఆలోచిస్తున్నాడు. తాను కష్టపడి సంపాదించిన డబ్బుని మేలైన క్వాలిటీ, అత్యుత్తమమైన సర్వీస్ మరియు విశ్వసనీయమైన బ్రాండ్‌పై వెచ్చించాలని అనుకుంటాడు. ట్రాక్టరు కొనడం అనేది ఒక పెద్ద పెట్టుబడి. ఇది రైతు ఆలోచన విధానానికి చిహ్నంగా ఉంటుంది. ఇందువల్లే తను కొనే ట్రాక్టర్ విశ్వసనీయతపై మరియు ఎక్కువ కాలం వరకు తనకు తోడుగా ఉంటుందా లేదా అన్నది రైతు తెలుసుకోవడం చాలా అవసరం.

మహీంద్రా ట్రాక్టర్స్ దశాబ్దాలుగా రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ వస్తున్నాయి. రైతు అవసరాలను పూర్తిగా అర్థం చేసుకుంటూ వ్యవసాయంలో వివిధ రకాల పనులకై కావల్సిన ఆధునిక టెక్నాలజీని అందిస్తుంది. ఇండియాలో అన్నిటికన్నా పెద్ద ట్రాక్టర్ల కంపెనీ అయినందువలన, మహీంద్రా ద్వారా అతి గొప్ప క్వాలిటీ గల, దృఢమైన మరియు మన్నికగల ట్రాక్టర్లు తయారు చేయబడుతున్నాయి. ఇవి రైతులకు ఎక్కువ ఫలసాయాన్ని ఇవ్వడంలో తోడ్పడతాయి.

**పండుగ సమయంలో తెలంగాణలో మహీంద్రా వారి ఆకర్షణీయమైన ఆఫర్లు :**

- లక్కీ డ్రా ఆఫర్ – బంపర్ డ్రా మరియు వీక్లీ డ్రా.
- 475 Yuvo మరియు బేలర్ కేవలం రూ. 8.88 లక్షలకు మాత్రమే.
- బల్కార్ TMCH కేవలం రూ. 16.99 లక్షలకు మాత్రమే.

**మహీంద్రా వారి వద్ద ఉన్నాయి తెలంగాణ రైతులకై అత్యుత్తమమైన సమాధానాలు.**

వరి, పత్తి, పసుపు మరియు మిరప పంటలకై అగ్రగాములుగా ఉత్పాదన చేస్తున్న తెలంగాణ రాష్ట్రం భారతదేశపు అతి పెద్ద ట్రాక్టర్ మార్కెట్‌లలో ఒకటి. **మహీంద్రా 415 DI, 475 DI, 575 DI, Yuvo 475, Yuvo 575, Novo 605 2WD/4WD, Novo 655 4WD మరియు 755 4WD** ట్రాక్టర్స్ ఈ రాష్ట్రంలో అన్నిటికన్నా ఎక్కువ ప్రజాదరణ పొందిన ట్రాక్టర్స్.




తెలంగాణ రాష్ట్రంలో వరి, పత్తి, పసుపు మరియు మిరప పంటల అవసరాలను పూర్తిచేసేందుకై మహీంద్రా వారి వద్ద అన్నిటికన్నా విస్తృతమైన రేంజ్‌లో ట్రాక్టర్లు మరియు పనిముట్లు లభిస్తున్నాయి. ఇవి నేలను సిద్ధం చేయడం దగ్గర నుండి పంట కోతల వరకే కాకుండా కోత తర్వాత చేయవలసిన పనులను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తాయి. మహీంద్రా ట్రాక్టర్స్‌లో పవర్ మరియు మైలేజ్‌ల మంచి జోడీ ఉంది. వీరు రోటావేటర్, పడ్లింగ్, బేలర్, డోజర్ మరియు హార్వెస్టర్స్ వంటి అడ్వాన్స్‌డ్ ఉపకరణాలకై అందరికన్నా మేలైనవారిగా ప్రసిద్ధి పొందారు.

పండుగల సీజన్ కోసమని మహీంద్రా తన విస్తృత శ్రేణి ట్రాక్టర్ మోడల్స్‌పై అత్యంత ఆకర్షణీయమైన కంజ్యూమర్ ఆఫర్స్‌ను అందిస్తుంది. ఇవి తెలంగాణ రాష్ట్ర రైతులకు పాతవాటి బదులుగా కొత్తవి మరియు మేలైన ట్రాక్టర్లను కొనుగోలు చేయడంలో తోడ్పడతాయి.

**తెలంగాణలో మహీంద్రా ట్రాక్టర్లు ఎందుకని రైతులకి అన్నిటికన్నా మేలైన ఎంపికగా అయ్యాయి.**

**ఎక్కువ పవర్ మరియు మేలైన మైలేజ్ :**

డైరెక్ట్ ఇంజక్షన్ టెక్నాలజీతో మహీంద్రా ట్రాక్టర్స్ డీజిల్ ఆదా చేయడంతోపాటు ఎక్కువ పవర్‌ని కూడా అందిస్తుంది.

**ట్రాక్టరుని నడపడంలో అన్నిటికన్నా తక్కువ ఖర్చు :**

అన్నిటికన్నా తక్కువ మెయింటెనెన్స్ ఖర్చు, చౌకైన స్పేర్ పార్ట్స్‌తోపాటు డీజిల్ వినియోగం తక్కువ అవ్వడం వలన రైతులకు ఆర్థికంగా లాభాన్ని చేకూరుస్తుంది.

**అధునాతన శ్రేణితోపాటు అత్యుత్తమమైన సర్వీస్ :**

మహీంద్రా ట్రాక్టర్స్ తెలంగాణలో అందరికన్నా విస్తృతమైన సర్వీస్ నెట్‌వర్క్‌తోపాటు అందరికన్నా వేగమైన మరియు అత్యుత్తమమైన ట్రాక్టర్ సర్వీసుని అందజేస్తుంది. మహీంద్రా వారి స్పేర్ పార్ట్స్ తెలంగాణ అంతటా సులువుగా లభిస్తాయి. దానితోపాటు ఇంటికే వచ్చి సర్వీసింగ్ చేసే ఏర్పాటు వలన మహీంద్రా ట్రాక్టర్స్‌ని అత్యుత్తమమైన ట్రాక్టర్ బ్రాండ్‌గా చేస్తున్నాయి.

**అన్నిటికన్నా ఎక్కువ రీసేల్ విలువ :**

మేలైన ట్రాక్టరుని కొనడం లేదా ప్రస్తుతం ఉన్న ట్రాక్టరుని మార్చే సమయం వచ్చినప్పుడు, మహీంద్రా ట్రాక్టర్స్‌వారు అన్నిటికన్నా గొప్ప రీసేల్ వాల్యూని ఇస్తున్నారు. ఇందుచేతనే ఇది ఇతర ట్రాక్టర్‌ల కన్నా విశ్వసనీయమైన ట్రాక్టర్ బ్రాండ్ అయింది.

విజ్ఞాపన
Advt.

సాక్షి
బుధవారం, అక్టోబర్, 23

# కీలెరిగి వాత!

ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించడం, అవతలి పక్షాన్ని అసంతృప్తికి గురిచేసే చర్యలు మానుకోవడం దౌత్య రంగంలో కీలకమైన అంశాలు. ఇరుగుపొరుగు దేశాలకైనా, సుదూరంలో ఉండే దేశాల మధ్య అయినా ఇది తప్పనిసరి. అలాగైతేనే ఆ దేశాల మధ్య స్నేహసంబంధాలు వికసిస్తాయి. సమస్యలు పరిష్కారమవుతాయి. టర్కీ ఇలాంటి మౌలిక అంశాలను విస్మరించినందువల్లే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 27, 28 తేదీల్లో ఆ దేశంలో జరపాల్సిన పర్యటన రద్దయింది. నిరుడు జూలైలో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మన దేశంలో పర్యటించారు. అంతక్రితం 2015లో ఆ దేశంలో జరిగిన జీ–20 సమావేశాల్లో పాల్గొనేందుకు మోదీ వెళ్లారు. మొన్న జూన్‌లో ఒసాకాలో జరిగిన జీ–20 సమావేశాల సందర్భంగా టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ చర్చల సందర్భంగానే ఇరు దేశాల మధ్యా రక్షణ రంగంలో సహకరించుకోవాలన్న అంశంలో అంగీకారం కుదిరింది. దానికి అనుగుణంగా నావికా దళానికి తోడ్పడే అయిదు యుద్ధ నౌకలను టర్కీ నుంచి కొనుగోలు చేయడానికి ఒప్పందం రూపొందింది. 230 కోట్ల డాలర్ల విలువైన ఈ ఒప్పందంపై మోదీ పర్యటన సందర్భంగా సంతకాలు జరగాల్సి ఉంది. ఈలోగా కశ్మీర్ పరిణామాలపై ఎర్డోగాన్ సెప్టెంబర్ నెలాఖరున జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేసి ఆ వాతావరణాన్ని కాస్తా చెడగొట్టారు. కశ్మీర్‌లో వేలాదిమంది బలగాలను దించి 80 లక్షలమంది ప్రజానీకాన్ని దిగ్బంధించారని ఆయన ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలపై ఆ వెంటనే మన దేశం టర్కీకి అసంతృప్తి వ్యక్తం చేసింది.

వాస్తవానికి భారత్–టర్కీల మధ్య మొదటినుంచీ సంబంధాలు ఏమంత మెరుగ్గా లేవు. 1965, 1971ల్లో జరిగిన భారత్–పాకిస్తాన్ యుద్ధాల్లో పాకిస్తాన్‌కు టర్కీ అమెరికా తయారీ సైనిక సామగ్రిని సరఫరా చేసింది. చెప్పాలంటే అప్పట్లో సౌదీ అరేబియా కూడా పాకిస్తాన్‌కు సాయపడింది. కానీ అనంతర కాలంలో దాని తీరు మారింది. కానీ గత మూడు దశాబ్దాలుగా భారత్, టర్కీ అధినేతలు పలుమార్లు కలుసుకున్నారు. ఒకరి దేశంలో మరొకరు పర్యటించారు. ద్వైపాక్షిక చర్చల్లో కశ్మీర్ అంశాన్ని మన దేశం టర్కీకి వివరిస్తూనే ఉంది. ఎర్డోగాన్‌కు ముందున్న నేతలు ఇతర విషయాల్లో ఎలా ఉన్నా కశ్మీర్‌పై ఏదోమేరకు సమాధానపడి ఆ అంశాన్ని లేవనెత్తడం మానుకున్నారు. ఎర్డోగాన్ వచ్చాక ఈ తీరు మారింది. భారత్‌ను ఇరకాటంలో పెడితే పాకిస్తాన్ సంతోషిస్తుందనుకున్న ప్రతి సందర్భంలోనూ ఆయన మనకు వ్యతిరేకంగానే వ్యవహరించారు. అణు సరఫరాదారుల బృందం(ఎన్ఎస్‌జీ)లో సభ్యత్వం ఇవ్వడానికి అమెరికా తదితర దేశాలు సిద్ధపడినా టర్కీ మాత్రం వ్యతిరేకించింది. చైనా సరేసరి. 48మంది సభ్యులున్న ఆ బృందంలో ఏ ఒక్కరు వ్యతిరేకించినా తీర్మానం ఆగిపోతుంది. అందులో సభ్యత్వం వల్ల మనకు ఒరిగేదేమిటన్నది వేరే చర్చ. ఎన్ఎస్‌జీకి భారత్‌ను రానీయకుండా చూసి పాక్‌ను సంతృప్తిపరచాలన్నదే టర్కీ ధ్యేయం. గత వారం జరిగిన ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) సమావేశంలో ఉగ్రమూకలకు నిధులు మళ్లడాన్ని నిరోధించలేకపోతున్న పాకిస్తాన్‌పై చర్య తీసుకోవాలన్న ప్రయత్నాన్ని టర్కీయే అడ్డుకుంది. నిధుల వరదను ఆపడానికి పాకిస్తాన్ మొత్తం 27 అంశాల్లో చర్యలు తీసుకోవాలని రెండు నెలల క్రితం ఎఫ్ఏటీఎఫ్ నిర్దేశించింది. కానీ కేవలం అయిదు అంశాల్లో మాత్రమే పాక్ చర్యలు తీసుకుందని సమావేశం తేల్చింది. అయినా పాకిస్తాన్‌కు మరింత గడువు విధించి, అది తప్పించుకునేందుకు టర్కీ తోడ్పడింది. దీనికితోడు గత కొంతకాలంగా అది పాకిస్తాన్‌తో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. వందకోట్ల డాలర్ల విలువైన మధ్యతరహా యుద్ధ నౌకలను అమ్మడానికి అది పాక్‌తో అవగాహనకొచ్చింది. గత ఏడాది 30 సైనిక హెలికాప్టర్లను అమ్మడానికి ఒప్పందం కుదిరింది. ఒక దేశంతో రక్షణపరమైన ఒప్పందాలు కుదుర్చుకుంటూ, అదే సమయంలో దానితో పొసగని మరో దేశంతో అలాంటి ఒప్పందాలకు సిద్ధపడటం సరికాదు. టర్కీ ఒకపక్క మనతో వాణిజ్య, రక్షణ సంబంధాలు నెలకొల్పుకోవాలనుకుంటూనే పాకిస్తాన్‌తో రక్షణ ఒప్పందాలకు దిగుతోంది. ఇతరత్రా ఆ దేశానికి మేలు చేస్తోంది.

ఎర్డోగాన్ అనుసరిస్తున్న ఈ పాక్ అనుకూల విధానం వెనక ఆయన ప్రయోజనాలు ఆయనకున్నాయి. ఆధునిక టర్కీ నిర్మాత ముస్తఫా కెమల్ అటాటుర్క్ ప్రజాజీవన రంగాల్లో ఇస్లాం పాత్ర పరిమితంగా ఉండేలా తీర్చిదిద్దినా, అది రోజులు గడుస్తున్నకొద్దీ టర్కీలో పెరిగిందే తప్ప తగ్గలేదు. 70వ దశకంలో రాజకీయాలకు కూడా విస్తరించింది. ఆమేరకు దాని సెక్యులర్ విలువలు క్షీణిస్తూ వచ్చాయి. కనుకనే యూరప్ యూనియన్‌లో దానికి వస్తుందనుకున్న సభ్యత్వం చేజారింది. చివరకు 2002లో మతత్వ సంస్థలతో సాన్నిహిత్యం ఉన్న ఎర్డోగాన్ అధికారంలోకి రావడంతో టర్కీ రూపురేఖలు మారిపోయాయి. రెండో ప్రపంచయుద్ధానికి ముందు అటోమాన్ సామ్రాజ్యంగా తన దేశానికున్న వైభవప్రాభవాలను పునరుద్ధరించాలని, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని అప్పటినుంచీ ఎర్డోగాన్ కలగంటున్నారు. ఈ క్రమంలో దేశం ఏమైనా ఆయనకు పట్టడం లేదు. అందులో భాగంగానే పాక్‌ను భుజాన వేసుకుంటున్నారు. ఎర్డోగాన్ పీఠం ఎక్కేనాటికి టర్కీ ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉంది. ఆయన ఏలుబడిలో అది నీరసించడం మొదలైంది. అవినీతి, ఆర్థిక అసమానతలు, ఉపాధి లేమి పెరగడం, వృద్ధిరేటు క్షీణించడం వంటి పరిణామాలతో ఆయనపై వ్యతిరేకత పెరిగింది. దాన్నుంచి కాపాడుకునేందుకు మతం పేరిట భావోద్వేగాలు రెచ్చగొట్టారు. సైనిక తిరుగుబాటు బూచి చూపి లక్షలమందిని జైళ్లలో కుక్కారు. న్యాయమూర్తులు, టీచర్లతోసహా వేలాదిమందిని ఉద్యోగాల్లోనుంచి తొలగించి ఖైదు చేశారు. వీరంతా తనకు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో పాలుపంచుకున్నారన్నది ఆయన అభియోగం. ఈ ఏడాది నవంబర్‌లో జరగాల్సిన ఎన్నికలను ఏడాది ముందుకు జరిపారు. ఆ ఎన్నికల్లో ఎర్డోగాన్ గెలుపు ప్రశ్నార్థకమైంది. ఇరుగుపొరుగు దేశాలైన సైప్రస్, గ్రీస్ తదితర దేశాలతో ఆయనకు పడదు. ఇలా స్వదేశంలో నియంతగా వ్యవహరిస్తూ, ఇరుగుపొరుగుతో కయ్యానికి దిగుతూ, దేశంలో ప్రజాస్వామ్య సంస్థలను భ్రష్టుపట్టించిన ఎర్డోగాన్ కశ్మీర్ ప్రజానీకం గురించి కన్నీరు కార్చడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పాకిస్తాన్‌ను నెత్తినెక్కించుకోదల్చుకుంటే అది ఆయన ఇష్టం. అందుకోసం మనకు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తే స్పందించడం తప్పనిసరవుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి బ.దశమి రా.9.10 వరకు
తదుపరి ఏకాదశి, నక్షత్రం ఆశ్లేష ప.12.19 వరకు
తదుపరి మఖ, వర్జ్యం రా.11.31 నుంచి 1.00 వరకు
దుర్ముహూర్తం ప.11.20 నుంచి 12.08 వరకు
అమృతఘడియలు... ఉ.10.45 నుంచి 12.16 వరకు.

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# మీడియా తంత్రం–బాబు కుతంత్రం

**అసలే చిన్నగా ఉండే గురివింద గింజ ప్రతిపక్ష నేత చంద్రబాబును చూసి మరింత చిన్నబోతోంది. గురివింద నీతి కూడా చంద్రబాబు దుర్నీతి ముందు పనికిరాకుండాపోతోంది. అధికారం కోల్పోగానే ప్రతిపక్ష నేతకు హఠాత్తుగా మీడియా స్వేచ్ఛ గుర్తుకు వచ్చింది. పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందంటూ గగ్గోలు మొదలుపెట్టారు. ఆయన రాద్ధాంతం చూస్తేంటే... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీడియా నియంత్రణకు కొత్తగా చట్టం ఏమైనా చేసిందా అనే సందేహం కలుగుతుంది. తీరా చూస్తే కొత్తగా ఎలాంటి చట్టం చేయలేదు... పోనీ చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ఏం చేశారో ఓసారి చూస్తే... ఆయన హయాంలో అంతా పత్రికలపై కక్ష సాధింపులు... పాత్రికేయులపై వేధింపులే కనిపిస్తున్నాయి. ఆధారసహితంగా తన ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేసిన పత్రికలు, పాత్రికేయుల మీద ఏకంగా క్రిమినల్ కేసులు పెట్టాలని జారీ చేసిన జీవోలు ఆయన నిజస్వరూపాన్ని నిగ్గు తేలుస్తున్నాయి.**

మీడియా గొంతు నొక్కుతున్నారని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు బురదజల్లేందుకు నానాపాట్లు పడుతున్నారు. వాస్తవం ఏమిటంటే... మీడియాపై ఆంక్షలు విధిస్తూ కొత్తగా ఎలాంటి చట్టమూ రాలేదు. రాజ్యాంగం దేశ ప్రజలు అందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఇచ్చింది. దానికిందే స్వేచ్ఛగా, నిర్భీతిగా నిజాలు చెప్పేందుకు పత్రికలు, టీవీ చానళ్లకు రాజ్యాంగపరమైన హక్కు కల్పించింది. కానీ అదే సమయంలో అసత్య వార్తలు, నిరాధార కథనాలు ప్రచురించినా, ప్రసారం చేసినా ఆ మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం, అధికారం ప్రభుత్వాలకైనా, ప్రైవేటు వ్యక్తులకైనా, సంస్థలకైనా ఉంటుంది. లేనట్టయితే ఎవరైనా ఇష్టానుసారం అసత్య వార్తలు ప్రచురించి, ప్రసారం చేసి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం రివాజుగా మారుతుంది. అందుకే ఆ జాగ్రత్త తీసుకున్నారు. ఆ ప్రకారమే తప్పుడు వార్తలు, కథనాల విషయంలో చట్టపరంగా తగిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి మొదటి నుంచీ ఉంది. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే చెబుతోంది. నిరాధార వార్తలు ప్రచురించి, ప్రసారం చేసి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించినా, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇదేమీ కొత్త విషయం కాదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంతోసహా అన్ని ప్రభుత్వాలు అనుసరించిన విధానమే. అంతేగానీ కొత్తగా ఎలాంటి చట్టం లేదా జీవో తీసుకురాలేదు. అసత్య వార్తలు, కథనాలు ప్రచురించినా, ప్రసారం చేసినా న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతోంది. అంతేగానీ విలేకరుల మీద పోలీసు కేసులు పెడతామనిగానీ, వేధిస్తామనిగానీ ఎక్కడా చెప్పలేదు. తాము ప్రచురించిన, ప్రసారం చేసిన వార్తలు, కథనాలు నిజాలేనని న్యాయస్థానంలో ఆధారాలు చూపించి నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆ పత్రికలు, చానళ్లపై ఉంటుంది. ఆధారాలు చూపితే న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పు చెబుతుంది. చూపించలేకపోతే ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఉద్దేశ్యపూర్వకంగా అవాస్తవాలు ప్రచురించారని, ప్రసారం చేశారని నిర్ధారిస్తుంది. ఇందులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించడం అన్న ప్రశ్నే ఉత్పన్నం కాలేదన్నది సుస్పష్టం. ప్రభుత్వం పూర్తిగా నిబంధనలకు కట్టుబడి, న్యాయసూత్రాలకు అనుగుణంగానే వ్యవహరిస్తోందన్నది ప్రాతికేయ ప్రముఖులు, ప్రజలూ అంగీకరిస్తున్న వాస్తవం.

### చంద్రబాబూ...! ఎందుకీ గగ్గోలు?!

ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన భజన మీడియా మాత్రం గగ్గోలు పెట్టి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందంటూ అసత్య ఆరోపణలతో రాద్ధాంతం చేసేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో అత్యధిక మీడియా సంస్థలు చంద్రబాబు గుప్పిట్లో ఉన్నాయి. చంద్రబాబు అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులుతీస్తున్నట్లు తప్పుడు గణాంకాలు, గ్రాఫిక్‌లతో తమ పత్రికల్లో పేజీలకు పేజీలు అసత్య కథనాలు వండి వార్చడం... టీవీ చానళ్లలో గంటల తరబడి ప్రసారం చేయడం ఆ మీడియా నైజం. బాబు ప్రతిపక్షంలో ఉంటే ప్రభుత్వంలో అవినీతి, అరాచకం పెట్రేగిపోతోందని అవాస్తవ కథనాలను రోజూ వండివారుస్తూ పత్రికలను నింపడం, టీవీ చానళ్లలో రాద్ధాంతం చేయడం కూడా వారికి అలవాటే. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు టీడీపీ అనుకూల మీడియా ఎంతగా విషం కక్కిందో అందరికీ తెలిసిందే. కానీ విజ్ఞులైన ప్రజలు ఆ ప్రభావానికి లోను కాకుండా వైఎస్సార్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు జైకొట్టి 2009లో రెండోసారి గెలిపించారు. ఇప్పుడు టీడీపీ అనుకూల మీడియా మళ్లీ అదే పాట అందుకుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసత్య కథనాలు ప్రచురించడం, ప్రసారం చేయడం నిత్యకృత్యమైంది. ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో సచివాలయ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడితే... పేపర్ లీక్ చేశారంటూ టీడీపీ అనుకూల మీడియా అసత్య కథనాన్ని రాసింది. ప్రభుత్వ అధికారుల బదిలీలు సాధారణమేనని తెలిసినా ... ఆర్టీసీ ఎండీ బదిలీపై మరో అసత్య కథనాన్ని ప్రచురించి ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నించింది. ఇక వరదల సమయంలో టీడీపీ సోషల్ మీడియా విభాగం పెయిడ్ ఆర్టిస్టులతో అసత్య ప్రచారం చేయడం అందరికీ తెలిసిందే. తిరుమలలో చర్చి కడుతున్నారంటూ టీడీపీ నేతలు మరో అసత్య ప్రచారం తెరపైకి తెచ్చి రాష్ట్రంలో ఉద్రిక్తలు సృష్టించేందుకు కుట్ర పన్నారు. ఇలా టీడీపీ అనుకూల మీడియా బాబు ప్రయోజనాలు నెరవేర్చేందుకు అసత్యాలను ప్రచారం చేస్తోంది. వాటిపై ప్రభుత్వం న్యాయపరంగా వ్యవహరిస్తామంటే బాబు, ఆయన భజన మీడియా గగ్గోలు పెడుతున్నారు. వారికి నిజంగా నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే అంత రాద్ధాంతం అవసరం లేదు. వారు సచ్చీలురైతే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించేవారు. తమ కథనాలపై ప్రభుత్వం కేసు వేస్తే న్యాయస్థానంలో రుజువులు సమర్పించి నిజాయతీ, నిబద్ధత నిరూపించుకుంటామని ప్రకటించేవారు. కానీ బాబుగానీ, ఆయన అనుకూల మీడియాగానీ ఆ మాటే అనడం లేదెందుకు అన్నది కీలక ప్రశ్న. అంటే ఆ మీడియా సంస్థలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడానికి ఇప్పటికే నిర్ణయించుకున్నాయి. కాబట్టే తమ నిజాయతీని నిరూపించుకునేందుకు సంసిద్ధంగా లేవు. పైగా తాము ఏం రాసినా, ఏం ప్రసారం చేసినా సరే తమను ఎవరూ ఏమీ అనడానికి వీల్లేదని, కేసులు వేయకూడదని వాదిస్తున్నాయి. అంటే తాము బట్ట కాల్చి మీద వేస్తాం... అంతా మా ఇష్టం అన్నట్లుగా ఉంది వారి తీరు. మరి ఇదేం పత్రికా స్వేచ్ఛో అన్నది వారికే తెలియాలి. పత్రికా స్వేచ్ఛ ముసుగులో అసత్య ప్రచారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించడం, బాబు రాజకీయ ప్రయోజనాలకు కోసం పని చేయడమే వారి విధానంగా ఉంది. ఈ దుర్నీతిని ప్రభుత్వం సహించాలా...?! ప్రజలు భరించాలా...?!

## ఏది నిజం...!




* వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారం
* మీడియా కట్టడికి జగన్ ప్రభుత్వం చట్టమేమీ చేయలేదు... జీవో ఇవ్వలేదు
* అసత్య కథనాలు వద్దన్నందుకే టీడీపీ అనుకూల మీడియా ఆక్రోశం
* బాబు ప్రభుత్వంలో మీడియాపై బరితెగించి వేధింపులు
* నిజాలు చెప్పిన మీడియా సంస్థలపై కక్ష సాధింపులు
* జీవోలు జారీచేసి మరీ పాత్రికేయుల వేధింపులు
* పత్రికా స్వేచ్ఛపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పూర్తి గౌరవం

### బాబు హయాంలోనే వేధింపులు

అధికారం కోల్పోగానే మీడియా స్వేచ్ఛను కాపాడాలి అంటూ మొసలి కన్నీరు కారుస్తున్న చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ఏం చేశారన్నది అందరికీ తెలుసు. తమ ప్రభుత్వం ఇష్టాను సారం చేస్తున్న అవినీతిని ఆధారాలతోసహా వెలుగులోకి తెచ్చిన 'సాక్షి' పత్రిక, చానళ్లు, సోషల్ మీడియాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. 'సాక్షి' పత్రిక, 'సాక్షి' చానెల్‌పై ఏకంగా అయిదు జీవోలు జారీ చేశారు. ప్రస్తుతం రాద్ధాంతం చేస్తున్న సంఘాలుగానీ, వ్యక్తులుగానీ అప్పుడు నోరు మెదపలేదు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బాబు ఆదేశించడం పత్రికా స్వేచ్ఛను ఆయన ఎంతగా హరించారన్నదానికి నిదర్శనం. అందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో మూడు జీవోలు జారీ అయ్యాయి. అదే విధంగా సాధారణ పరిపాలన(రాజకీయ) కార్యదర్శి పేరుతో మరో రెండు వచ్చాయి.

☞ ***బాబు ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు సహాయ, పునరావాస చర్యల్లో యదేచ్ఛగా అవినీతికి పాల్పడింది. 'సాక్షి' బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి ఆధారాలు సేకరించి మరీ కథనాలు ప్రచురించింది. సర్వే నంబర్లతోసహా గిరిజనుల పరిహారాన్ని ఎలా కొల్లగొట్టారో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కథనాలపై బాబు సర్కారు కనీసం ఖండన కూడా ఇవ్వలేకపోయింది. కానీ కక్షసాధింపు చర్యలకు మాత్రం పాల్పడింది. అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కాటమనేని భాస్కర్, సీఆర్‌డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌ను సీఎం ఆఫీసుకు పిలిపించి మరీ 'సాక్షి'పై క్రిమినల్ కేసులు పెట్టాలని ఒత్తిడి చేశారు.***

☞ ***క్రిమినల్ కేసులు పెట్టేందుకు శ్రీధర్‌కు అనుమతిస్తూ అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ పేరుతో జీవో ఆర్‌టీ 868 జారీ చేయించారు.***

☞ ***అదే విధంగా జగతి పబ్లికేషన్స్ ఎడిటర్, ప్రింటర్, పబ్లిషర్‌లపై ప్రత్యేకంగా క్రిమినల్ కేసులు నమోదుకు కాటమనేని భాస్కర్‌కు అనుమతించారు. ఈమేరకు అప్పటి సాధారణ పరిపాలన (రాజకీయ ) కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ పేరుతో జీవో ఆర్‌టీ 1689 జారీ చేయించారు.***

☞ ***అలాగే క్రిమినల్ కేసుల నమోదుకు చెరుకూరి శ్రీధర్‌కు అనుమతిస్తూ అప్పటి సాధారణ పరిపాలన(రాజకీయ) కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ పేరుతో జీవో ఆర్‌టీ 2151 జారీ చేయించారు.***

☞ ***చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతిపక్షంపై నిఘా పెట్టిన తీరును ఆధారాలతోసహా వెలుగులోకి తెస్తూ 'ప్రతిపక్షంపై రియల్ టైం నిఘా' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై కూడా అప్పటి ప్రభుత్వం ఖండన ఇవ్వలేదు. కానీ 'సాక్షి'పై క్రిమినల్ కేసుల నమోదుకు అప్పటి రియల్‌టైమ్ గవర్నెన్స్ సీఈవోకు అనుమతిచ్చింది. ఈమేరకు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా పేరుతో జీవో ఆర్‌టీ 733 జారీ చేయించింది.***

### నిజాలు మాట్లాడే జర్నలిస్టులపై వేధింపులు

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పత్రికాల్లో అంతా తనకు అనుకూలంగా రాయాలి... టీవీ చానళ్లలో అంతా తనకు అనుకూలంగానే మాట్లాడాలి అన్న అనధికార శాసనాన్ని అమలు చేశారు. ప్రధానంగా టీవీ చానళ్లు ప్రసారం చేసే చర్చా గోష్టులపై టీడీపీ ప్రభుత్వం అనధికారింగా సెన్సార్‌షిప్ అమలు చేసింది. విలేకరులు నిజాలు చెప్పినా, ప్రభుత్వ అవినీతి, అసమర్థతపై ఎవరూ మాట్లాడినా సహించేవారు కాదు. ప్రముఖ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు దశాబ్దన్నరగా పలు టీవీ చానళ్లలో చర్చా వేదికలు నిర్వహిస్తున్నారు. ఈ పదేహేనేళ్లలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి... రాష్ట్ర విభజన వంటి సున్నితమైన అంశాలు చర్చకు వచ్చాయి. కానీ ఏ ప్రభుత్వంలోనూ ఎదురుకాని చేదు అనుభవం బాబు హయాంలో ఆయనకు ఎదురైంది. ఎన్‌టీవీలో చర్చా వేదికలో కొమ్మినేని శ్రీనివాసరావు వాస్తవాలు మాట్లాడుతుంటే చంద్రబాబు, లోకేశ్ సహించలేకపోయారు. తమకు అనుకూలంగా మాట్లాడాలని హుకుం జారీ చేశారు. తాను వాస్తవాలే మాట్లాడతానని ఆయన చెప్పడంతో బాబు సహించలేకపోయారు. ఎన్ టీవీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, బెదిరించి మరీ కొమ్మినేని శ్రీనివాసరావును ఆ చానల్ నుంచి బయటకువెళ్లిపోయేలా చేశారు. అప్పట్లో దీనిపై ఏ పాత్రికేయ సంఘాలుగానీ మీడియా ప్రముఖులుగానీ కనీసం స్పందించనేలేదు. చంద్రబాబు సీఎంగా ఉండగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మీడియా సమావేశాల్లో ఆయన భజన బృందానికిచెందిన పాత్రికేయులకు తప్ప మరెవరికీ కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇచ్చేవారు కాదు. ప్రభుత్వ నిర్ణయంపై ఎవరైనా ప్రశ్నిస్తే బాబు శివాలెత్తిపోయి వారిపై చిందులు తొక్కి అవమానించిన ఉదంతాలు కోకొల్లలు. ప్రభుత్వం అంటే తన ప్రైవేటు కంపెనీగా ఆయన ప్రవర్తించేవారు.

**పత్రికా స్వేచ్ఛపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో పత్రికలు, టీవీ చానళ్లు ప్రధానభూమిక పోషించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వాసం. చిన్నా, పెద్ద పత్రికలు, అన్ని టీవీ చానళ్లు మనుగడ సాగిం చేందుకు ప్రభుత్వపరంగా సహకరించాలన్నది ఆయన విధానం. అందుకే పత్రికలకు ఇచ్చే ప్రకటనల టారిఫ్‌ను పెంచుతూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. 40ఏళ్ల అనుభజ్ఞుడినని చెప్పుకునే చంద్రబాబు మీడియాను తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం తప్ప గౌరవించి ఎరుగరు. కానీ జగన్ మోహన్‌రెడ్డి అన్ని మీడియా సంస్థల ప్రతినిధులను ఒకే రీతిలో గౌరవిస్తుండటం అందర్నీ ఆకట్టుకుంటోంది. అది కదా పత్రికా స్వేచ్ఛను గౌరవించడం అంటే అని అంతా ఆయన్ని కొనియాడుతున్నారు.**

– సాక్షి, అమరావతి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### దేశభక్తి



"నిన్న జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతోమంది సామాన్యులే కాదు, ప్రసిద్ధులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ, ఓటు వేయని దేశభక్తులు కూడా ఉన్నారు. వారు ఎవరో ఊహించగలరా? అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్, అనిల్ అంబానీ, అజయ్ దేవగన్, అనుపమ్ ఖేర్, పాయల్ రోహత్గి, ఏక్తా కపూర్, కంగనా రనౌత్ వీరి దేశభక్తి అంతా కేవలం అధికారంలో ఉన్నవారిని ప్రసన్నం చేసుకోవడానికేనా? వీరికి కనీసం ప్రజాస్వామ్యంపైనైనా నమ్మకం ఉందా?"

– కుమార్ షా, కాంగ్రెస్ నేత

### సమానం



"ముస్లింలందరినీ బహిష్కరించండి అంటున్న వారంతా 22 కోట్లమంది ఉన్న జనాభాను దేశం నుంచి గెంటేయలేమని అర్థం చేసుకోవాలి. అందువల్ల వారితో కలిసి జీవించాల్సిందే. మీ ద్వేషం బాధాకరమైనప్పటికీ మనలో ఎవరం ఎక్కడికీ వెళ్లలేం. మన దేశ స్వాతంత్య్ర పోరాటంలో మన తాత ముత్తాతలు సమానంగానే పాల్గొన్నారు"

– రాణా అయూబ్, జర్నలిస్ట్

### సంతోషం



"దేశంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, జాదవ్‌పూర్ యూనివర్సిటీలు క్యూఎస్ ఇండియా ర్యాంకింగ్ 2020లో మొదటి, రెండు స్థానాలను సొంతం చేసుకున్నాయని తెలియజేయడానికి సంతోషిస్తున్నా. ఈ యూనివర్సిటీలకు చెందిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు"

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

### కన్ను



"అత్యధిక లాభాలతో, వ్యూహాత్మకంగా నడుస్తున్న కంటైనర్ కార్పొరేషన్ (కాంకర్) ప్రభుత్వరంగ సంస్థలన్నింట్లో అత్యుత్తమమైనది. దీనిపై ప్రధాని మోదీ అప్పులైన పెట్టుబడిదారులు కొందరు కన్నువేశారు. దాంతో ప్రభుత్వం వెంటనే అమ్మకానికి సిద్ధమవుతోంది. కాంకర్ యూనియన్ సభ్యులను ఇవాళ కలుసుకున్నా. దయచేసి వారికి మీరంతా కూడా మద్దతు పలకండి"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత

### ఆప్



"రాష్ట్రం తర్వాత రాష్ట్రంలో బీజేపీ విజయాలు సాధిస్తున్నప్పటికీ ఢిల్లీలో తిరిగి ఆప్ రెండోసారి గెలుస్తుందని మీరు ఎలా అనుకుంటున్నారని నన్ను చాలామంది అడుగుతున్నారు. వాళ్లందరికీ నేను చెప్పేదొకటే అరవింద్ కేజ్రీవాల్ నమ్మకమైన, బలమైన ప్రత్యామ్నాయంగా ఢిల్లీ ప్రజలు విశ్వసిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో అటువంటి ప్రత్యామ్నాయం లేదు"

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్ట్

# మనసుంటే చాలు

తన ఇంటి గుమ్మం ముందు నిలుచున్న యాచకుని భిక్షాపాత్రలో ఒక్క మెతుకైనా విదల్చని కోటీశ్వరుడికన్నా, తను తెచ్చుకున్న భిక్షాన్ని తనకంటే నిస్సహాయుడైన వ్యక్తికి పంచే మనిషిది గొప్ప వ్యక్తిత్వం. తన దగ్గరున్నది ఇతరులకు ఇవ్వటం అన్నది కేవలం మనసుకు సంబంధించిన విషయం. తమకు చేతనైన సాయం, చేతిలో ఉన్న సాయం పరులకు చేయాలని ఎప్పుడూ తాపత్రయపడేవారు గొప్ప ఉదారులు. ధనం ఉండటం, లేకపోవటంతో దీనికి సంబంధం లేదు. ఒక ఆధునిక కవి మనుషులలో స్వభావాలను చెబుతూ కొందరు తమకు ఆరోగ్యం సహకరించకపోయినా ఎప్పుడూ ఇతరులకు సాయం చేయటంలోనే లీనమై ఉంటారని చెప్పారు. మనుషులు చేసే పనులకు మరణానంతరం కీర్తి, అపకీర్తులు వాటంతటవే వస్తాయి. ఇతరులకు సాయం చేయటంలో లభించే తృప్తి అనుభవిస్తేనే తెలుస్తుంది.




సక్తుప్రస్తుడు అతిపేద బ్రాహ్మణుడు. ఉంఛవృత్తితో జీవించేవాడు. మంచి మనసున్నవాడు. ఇతడు ఒక నాడు కొంచెం పేలపిండిని సంపాదించుకున్నాడు. తాను, భార్య, కొడుకు, కోడలు దానిని తినటానికి సిద్ధమయ్యారు. అంతలో ఒక అతిథి ఆకలితో వచ్చాడు. సక్తుప్రస్తుడు తన భాగాన్ని అతనికి పెట్టాడు. అతిథి ఆకలి తీరలేదు. వరుసగా భార్య, కొడుకు, కోడలు కూడా తమ భాగాలను అతిథికి పెట్టేసారు. ఆకలితో ఉన్న అతిథికి ఆహారం పెట్టగలిగామన్న తృప్తిని ఆ కుటుంబం పొందింది. ఆ అతిథి తాను ధర్మ దేవతనని తన నిజ స్వరూపాన్ని తెలియ జేశాడు.

ఈ పేలపిండి నలుసులు ఒక ముంగిస పాదాలపై పడి ఆ భాగమంతా బంగారంగా మారింది. అప్పటినుండి తన మిగతా శరీరమంతా బంగారంగా మార్చే గొప్ప దానపరుల కోసం ముంగిస వెతుకుతూ ఉంది. ఒకసారి ధర్మరాజు యజ్ఞం చేస్తున్నప్పుడు అక్కడ అన్నదానం జరిగే చోటుకు వెళ్లి తన మిగతా శరీరం బంగారంగా మారకపోవటం చూసి ఇది సక్తుప్రస్తుని దానాన్ని పోలదు అందిట. సర్వ సంపదలూ సమృద్ధిగా ఉండి చేసే దానాలకన్నా, సాయాలకన్నా తమకున్న దాంట్లో ఇతరులకు పెట్టడం ఇంకా మిన్న. ఇందుకు మనసుంటే చాలు.

తమ దగ్గర ఉన్న వస్తువులు ఇతరులకు ఇవ్వటం, పరోపకారం బాల్యం నుంచే పిల్లలకు పెద్దలు అలవాటు చేయటానికి ఇటువంటి కథలు దోహదం చేస్తాయి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 23-10-2019


నీలా మెహతా

చెక్-ఇన్‌సల్ట్

# అవమాన ప్రయాణం

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్. వీల్ చైర్ కావాలని ఎయిర్‌లైన్ సిబ్బందిని కోరారు జీజా ఘోష్. ఎంతసేపటికీ రాలేదు. అదేమని విచారిస్తే ''ఈరోజు స్టాఫ్ తక్కువగా ఉన్నారు'' అని సమాధానం వచ్చింది సిబ్బంది నుంచి. ఎట్టకేలకు దీర్ఘ నిరీక్షణ తర్వాత వీల్ చైర్ వచ్చింది. తీరా చెకిన్ కౌంటర్‌కు వెళ్లాక ''ఎవరూ తోడు లేకుండా మీరొక్కరే ప్రయాణం చేయడానికి వీల్లేదు'' అని చెప్పారు 'గో ఎయిర్' చెకిన్ కౌంటర్‌లో. జీజాకు సెరిబ్రల్ పాల్సి. ఈ ఇద్దరూ.. న్యూఢిల్లీలో జరగబోయే వికలాంగ మహిళల హక్కుల సమావేశానికి హాజరయ్యేందుకు మొన్న ఆదివారం కోల్‌కతా నుంచి బయలుదేరారు. ఆ సమయంలో వాళ్లకు జరిగిన అవమానం ఇది. ఈ సంఘటనలతో వాళ్లు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ వివక్ష మీద అక్కడే నిరసననూ తెలిపారు. దాంతో ఆ చెకిన్ కౌంటర్‌లోని వ్యక్తి 'సారీ' చెప్పింది ఈ ఇద్దరికి. ''ఆ అమ్మాయి


జీజా ఘోష్ (వీల్ చైర్) కుహూ దాస్ (మధ్యలో)


విమానాశ్రయ సిబ్బంది ధోరణిపై నిరసన

ఆశ్చర్యపోయారు జీజా.. ''ఒంటరి ప్రయాణం నాకు కొత్తకాదు.. ప్రపంచమంతా ఒక్కదాన్నే చుట్టొస్తుంటా'' అని. ఆ విషయాన్నే సిబ్బందితో చెప్పారు కూడా. అయినా ససేమిరా అన్నారు వాళ్లు. దాంతో తనతోపాటు న్యూఢిల్లీకి ప్రయాణం చేసే మిగతా సహచరులు వచ్చేవరకు ఆమెకు బోర్డింగ్ పాస్ ఇవ్వలేదు.

ఆ సహచరుల్లోనే ఒకరైన కుహూ దాస్‌కూ ఇలాంటి అవమానమే ఎదురైంది! ఆమెకు పోలియో. దాంతో క్యాలిపర్స్ పెట్టుకొని వచ్చారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) తనిఖీ కోసం ప్యాంట్స్ తీసేయమన్నారట. షాక్ అయ్యారు కుహూ దాస్.. ఇన్నేళ్లుగా ఫ్లైట్లలో ప్రయాణం చేస్తున్న తనకు ఏ రోజూ ఇలాంటి అవమానం ఎదురు కాలేదు. ''వాళ్లు ఆ మాట అనగానే ఒక్క క్షణం నా చెవులను నేనే నమ్మలేకపోయా. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఏ ఆఫీసర్ ఇలా అడగలేదు. ఇంత ఇన్‌సల్ట్ చేయలేదు'' అన్నారు కుహూ.

కుహూనే కాదు జీజా ఘోష్ కూడా వికలాంగురాలే. 2019 ఎలక్షన్ కమిషన్ క్యాంపెయిన్ పోస్టర్ గర్ల్ కూడా అయిన

**మన దేశంలో దాదాపు ఎనిమిది కోట్ల మంది వికలాంగులున్నారు. రకరకాల వైకల్యాలతో బాధపడుతున్న వాళ్లకు కల్పించాల్సిన ప్రత్యేక సదుపాయాల సంగతేమో కాని పని గట్టుకొని ఇలా అవమానించకుండా ఉంటే చాలు.**

మీద మాకేం కోపం లేదు. ఇది ఆ అమ్మాయి ఒక్కరి తప్పు కాదు.. మాలాంటి వాళ్లను ఎయిర్‌లైన్ ఎలా ట్రీట్ చేస్తుందో.. ఎంత చులకనగా చూస్తుందో అనడానికి ఇదొక ఎగ్జాంపుల్'' అన్నారు జీజా, కుహూ.

విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్ట్ సిబ్బంది జీజా ఘోష్, కుహూ దాస్‌లను క్షమాపణ కోరుతూ.. జరిగిన తప్పిదాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకునే పూచీని సంబంధిత ఎయిర్‌లెన్స్ అధికారులకు అప్పగించామని కోల్‌కతా ఎయిర్ పోర్ట్ సిబ్బంది ట్వీట్ చేశారు.

**ధోక్లాతో మొదలుపెట్టి ఖాండ్వి, భేల్‌పురి, సేవ్‌పురి, ఘుగ్రా వంటి గుజరాత్ సంప్రదాయ వంటకాలన్నింటినీ ఇష్టపడి, వాటికి అలవాటు పడిన ముంబై మహానగరం నేటికీ నీలా మెహతాను తలచుకుంటూనే ఉంది. ముంబైలో ధోక్లా క్వీన్‌గా, మిగతా ప్రపంచానికి భేల్ క్వీన్‌గా ప్రసిద్ధురాలైన ఈ గుజరాతీ గృహిణి.. స్నాక్స్ వ్యాపారంలో ఒక ట్రెండ్‌ను సృష్టించి వెళ్లారు.**

# ధోక్లా క్వీన్

అది 1974. నీలా మెహతా అనే యువతి పెళ్లి చేసుకుని గుజరాత్‌లోని బారుచ్ నుంచి ముంబైకి వచ్చింది. అప్పటి గృహిణులకు తెలిసింది.. భర్త, పిల్లలకు వండి పెట్టుకుంటూ, ఇంటిని చక్క దిద్దుకుంటూ గడపడమే. అయితే ముంబై మహానగరంలో ఒక్కరి సంపాదనతో ఇల్లు గడవదని అర్థమైందామెకి. తనకు ఇష్టమైన ఎంబ్రాయిడరీ చేసింది. చీర మీద సన్నని అందమైన ఎంబ్రాయిడరీ చేయడానికి నెల రోజులు పట్టేది. నెల రోజులపాటు పడిన శ్రమకు వచ్చిన డబ్బు సంతృప్తినిచ్చేది కాదు.

అప్పుడే ఒక కొత్త అడుగు వేశారు నీలా మెహతా. తనకు చెయ్యి తిరిగిన గుజరాత్ వంటకాలను ముంబైవాసులకు రుచి చూపించారు. 'ఢోక్లా' పేరు వినడమే కానీ దాని రుచితో పరిచయం లేని ముంబై వాళ్లు లొట్టలేసుకుని తిన్నారు. ఢోక్లాతో పరిచయం ఉండి, ఉద్యోగరీత్యా ముంబయిలో స్థిరపడిన వాళ్లు నీలా మెహతా చేతి ఢోక్లా తిని సొంతూరికి వెళ్లి వచ్చిన అనుభూతికి లోనయ్యారు. ఢోక్లాతో మొదలు పెట్టి ఖాండ్వి, భేల్‌పురి, సేవ్‌పురి, ఘుగ్రా వంటి గుజరాత్ సంప్రదాయ వంటకాలన్నింటినీ ఇష్టపడడం ముంబై వాళ్లకు అలవాటై పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ముంబై నగరం నీలా చేతి వంటకు దాసోహం అయింది. ఇందుకోసం నీలా మెహతా పెద్ద పెట్టుబడి పెట్టిందేమీ లేదు. తాను నివసిస్తున్న ఇంటి వంట గదిలో తనకు చేతనైన వంటకాలను చేయడం, వాటిని డోర్ డెలివరీ చేయడం. ఇక్కడ ఆమె ప్రవేశ పెట్టిన డోర్ డెలివరీ మార్కెటింగ్ టిప్... ఆమెకు అతి కొద్ది సమయంలోనే 'ఢోక్లా' క్వీన్ బిరుదును తెచ్చి పెట్టింది.

**రంగుల ప్రయోగం**

వ్యాపార రంగంలో ఒకరు ఒక కొత్త ఐడియాతో వచ్చిన తర్వాత వారి అడుగుజాడల్లో నడవడానికి మరెంత మందో సిద్ధంగా ఉంటారు. నీలా మెహతా ఐడియా సక్సెస్ కావడంతో మగవాళ్లు కూడా తమ రాష్ట్రాల సంప్రదాయ వంటల వ్యాపారంలోకి వచ్చేశారు. అప్పుడు నీలా మెహతా తన హోమ్‌ఫుడ్‌లో ప్రయోగాలు మొదలు పెట్టారు. స్వాతంత్ర్యోద్యమం, గణతంత్ర దినోత్సవం రోజుల్లో మూడు రంగుల ఢోక్లాను ప్రవేశపెట్టారు. ఒక వరుస శనగపిండితో చేసిన పసుపు రంగు ఢోక్లా, మరో వరుసలో బియ్యం గోధుమ పిండితో చేసిన తెల్లటి ఢోక్లా, వాటి మధ్యలో పుదీనా వంటి ఆకుపచ్చ రంగు చట్నీతో 'తిరంగి ఢోక్లా'ను రుచి చూపించారు. ఢోక్లా వడ్డించడం ఓల్డ్ ఫ్యాషన్ అని శాండ్‌విచ్‌లతో ఆతిథ్యం ఇచ్చే సంపన్న కుటుంబాలు కూడా తమ ఇళ్లలోని వేడుకలకు ఈ తిరంగి ఢోక్లా కోసం నీలా మెహతాకు ఆర్డర్ ఇవ్వడం మొదలైంది. పెళ్లి సీమంతం వంటి వేడుకలకు ఐదురంగులతో 'పంచరంగ్' ఢోక్లా చేశారు నీలా మెహతా. 'ఎంటర్‌ప్రెన్యూర్ అనే పదం మహిళా లోకానికి చెందినది కాదు, ఆ రంగంలో పేటెంట్ రైట్స్ అన్నీ పురుష ప్రపంచానివే' అని సమాజం పరిధులు విధించుకున్న రోజుల్లో.. మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్ అయిన మగవాళ్ల దగ్గర పీఏ ఉద్యోగాలకు



గుజరాతీ సంప్రదాయ వంటకాలను తయారుచేస్తున్న నీలా మెహతా







మాత్రమే పరిమితం చేసిన సమాజంలో... నీలా మెహతా ఒక ట్రెండ్‌ను సెట్ చేశారు. 'ఒక మహిళ ఒక పరిశ్రమ నడిపిస్తోందంటే.. అది ఆమెకు తండ్రి లేదా భర్త నుంచి వారసత్వంగా వచ్చిన పరిశ్రమను నడిపించడం లేదా అంతటి సంపన్న కుటుంబాల నుంచి కొత్త ఆలోచనలతో వచ్చిన మహిళలకు మాత్రమే సాధ్యం... అంతే తప్ప మామూలు మహిళలకు అది అసాధ్యం' అనే భావనను కూడా తుడిచి పెట్టేశారు నీలా మెహతా.

**బజాజ్ వాళ్లింటి పెళ్లి**

ఉమెన్ అసోసియేషన్ సమావేశానికి ఇరవై ఢోక్లా పార్సిళ్లు ఇవ్వడంతో పడిన నీలా తొలి అడుగు... రోజుకు అరవై నుంచి డెబ్బై కిలోల ఢోక్లా ఆర్డర్‌లు అందించే స్థాయికి చేరింది. ఈ ప్రయాణంలో ఆమెను తీవ్రమైన ఉత్కంఠకు గురి చేసిన సంఘటన బజాజ్ కుటుంబంలో పెళ్లి. ''ఆ పెళ్లికి పదహారు వందల కిలోల ఢోక్లా ఆర్డర్ వచ్చింది. దినుసులన్నీ సమకూర్చుకున్నాం, అదనంగా పని వాళ్లను కూడా పిలుచుకున్నాం. హఠాత్తుగా నీళ్లు బంద్. వాటర్ ట్యాంకర్‌ల కోసం పరుగులు పెట్టాం. వంట చేయడం కంటే నీళ్ల ట్యాంకర్లు సమకూర్చుకోవడమే పెద్ద సవాల్ అయింది. రెండు రోజుల పాటు ఇంట్లో వాళ్లకు, పని వాళ్లకు తిండి, నిద్ర లేవు. మొత్తం అందిచ్చిన తర్వాత ఊపిరి పీల్చుకున్నాం'' అని చెప్పారు నీలా మెహతా కొడుకు ప్రతీక్. చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేసిన ప్రతీక్ తర్వాత తల్లికి సహాయంగా ఆమె వ్యాపారంలోనే స్థిరపడ్డారు. ''ఢోక్లా క్వీన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమ్మకు నిల్వ ఉండే భేల్ వంటి పదార్థాలను కూడా చేర్చమని సలహా ఇచ్చాం. వాటిని ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, యూఎస్, యూకేలకు ఎగుమతి చేసింది అమ్మ. ముంబై వాళ్లు ఢోక్లా క్వీన్‌ని చేశారు, అమ్మ చేతి భేల్ రుచి చూసిన బయటి నగరాల వాళ్లు ఆమెను 'భేల్ క్వీన్'అని ప్రశంసించారు'' అని చెప్పారు ప్రతీక్ మెహతా. 83 ఏళ్ల నీలా మెహతా పోయిన మంగళవారం అక్టోబర్ 15వ తేదీన తుది శ్వాస వదిలారు. ముంబై నేటికీ ఆమెను తలచుకుంటూనే ఉంది.

యంగ్ టాలెంట్

# ర్యాప్ న మ హా

**మనసులోని భావాలను వచన కవిత్వంలో సూటిగా చెప్పొచ్చు. పదునైన వచన కవిత్వాని కన్నా పదునైనది ర్యాప్. తీవ్ర భావోద్వేగాలను సైతం ర్యాప్‌లో సున్నితంగా, అదే సమయంలో శక్తిమంతంగా చూపించవచ్చు. అంతటి శక్తి మంతమైన ర్యాప్‌తో ప్రణవ్ చాగంటి ప్రపంచాన్ని తన వైపుకి తిప్పుకుంటున్నాడు. ర్యాప్ పాడుతూ యువతకు తెలుగును పరిచయం చేస్తున్నాడు. న, మ అక్షరాలతో ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా రెండు అక్షరాల ర్యాప్‌ను సృష్టించాడు. తనలో నిద్రాణంగా ఉండిపోయిన భావాలను బయటకు తీసుకురావడానికి ర్యాప్ తనను ఎంచుకుంది అంటున్న 29 ఏళ్ల ఈ హైదరాబాద్ ర్యాపర్ గురించి అతడి మాటల్లోనే..!**







నా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తయి ఉద్యోగాన్వేషణలో ఉన్న సమయంలో మా చుట్టాలాయన ఒకరు వచ్చి, 'నేవీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ జాబ్ అవకాశాలు ఉన్నాయి. చేరిపో, మంచి భవిష్యత్తు ఉంటుంది' అని చెప్పారు. నాకు అమ్మని వదిలి ఉండటం ఇష్టం లేదు. అయినా ఇంట్లో వారి బలవంతం మీద రెండేళ్లు నేవీలో చేరాను. క్రూడ్ ఆయిల్ ట్యాంకర్ అవ్వడం వల్ల చాలాసేపు సముద్రం మీదే ఉండవలసి వచ్చేది. నౌక పోర్టులోకి వచ్చినా కొద్దిగంటల్లోనే మళ్లీ బయలుదేరిపోతుంది. ఇంజనీరింగ్ చదివానన్న మాటే గానీ చిన్నప్పటి నుంచీ నాకు సంగీతమంటే చాలా ఇష్టం. భాషాభేదం లేకుండా అన్ని పాటలు వినే వాడిని. కానీ నౌకలో ఆ అవకాశం దొరికేది కాదు. అమ్మానాన్నలకు, సంగీతానికి దూరంగా ఉండటం నా మనసుకి నచ్చలేదు. అందుకే ఆ ఉద్యోగంలో ఉండలేక వచ్చేశాను. ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూనే ఉండటం నా నైజం. ఒక లైన్ రాయగానే, ఏదో ఒక పాట రాయొచ్చుగా అనుకుంటాను. నా మైండ్ క్షణం కుదురుగా ఉండేది కాదు. రచన, సంగీతం.. వీటి చుట్టూ పరిభ్రమిస్తూ ఉండేది.

**కదిలించిన యాసిడ్ ఘటన**

ఢిల్లీలో 2004లో జరిగిన ఒక యాసిడ్ దాడి దేశంతోపాటు నన్నూ కదిలించేసింది. ప్రేమను ఒప్పుకోకపోతే యాసిడ్ దాడి చేయడమేంటి?! మనుషులు ఇంత క్రూరంగా ఉంటారా అనుకున్నాను. ఎమోషనల్‌గా షేక్ అయ్యాను. ఆ భావాన్ని ఎలా బయటపెట్టాలో ఆ చిన్న వయసులో నాకు అర్థం కాలేదు. పెద్దవాడినయ్యాక పాటల రూపంలో నాలోని ఉద్వేగాలను బయటకు తీసుకురావడం ప్రారంభించాను. 'ఆవేదన' అనే ర్యాప్‌గా ఆ యాసిడ్ దాడి గురించి నా ఎమోషన్ బయటకు వచ్చింది. నాలో ఏదో తెలియని రిలీఫ్. ఆ తరవాత నిర్భయ గురించి రాయడానికి నాలో ఆవేశం కట్టలు తెంచుకుని వచ్చింది. అప్పటికి నా భాష మెరుగైంది. తెలుగు భాష గొప్పదనం గురించి కూడా నలుగురికీ చెప్పాలనిపించింది. ఆ ప్రయత్నంగానే న, మ అక్షరాలతో ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా రెండు అక్షరాల ర్యాప్‌ను సృష్టించాను. దానికి 'దివ్యాక్షరి' అని పేరు పెట్టాను.



**నీ మనన మాన నేను**

అమ్మ పద్మ కామాక్షి, హౌస్ వైఫ్. నాన్న చాగంటి గౌరీపతి, మెడికల్ రిప్రజెంటేటివ్. కాలా (రజనీకాంత్), పైసా వసూల్, హలో (అఖిల్), యుద్ధం శరణం (నాగచైతన్య), మెంటల్ మదిలో, ఈ నగరానికి ఏమైంది.. చిత్రాలకు ర్యాప్ రాసుకుని పాడాను. నా వీడియోలను నేనే ప్రొడ్యూస్ చేసుకుంటాను. మా అన్నయ్య చాగంటి శ్రీహర్షతేజ నాకు బాగా సపోర్ట్ ఇస్తారు. తాజాగా 'నీ నామమును నమ్మ నేను.. నీ మనన మాన నేను' అని మోడరన్ దివ్యాక్షరి పేరుతో వీడియో అప్‌లోడ్ చేశాను.

– ప్రణవ్ చాగంటి,
ర్యాప్ సింగర్, హైదరాబాద్

– డా. వైజయంతి పురాణపండ

చెట్టు నీడ

# దీపం

ఇద్దరు ప్రయాణీకులు దారిలో కలిశారు. ఒకతని దగ్గర దీపం ఉంది. ఇంకొకతని దగ్గర ఏమీ లేదు. కాని ఇద్దరూ కలిసి పక్కపక్కనే నడవడం వల్ల దీప కాంతి ఇద్దరి మార్గాల్లోనూ పరుచుకుంటోంది. దీపం ఉన్న వ్యక్తి ఎంత సులభంగా అడుగులు వేస్తున్నాడో, దీపం లేని వ్యక్తి కూడా అంతే అనాయాసంగా నడుస్తున్నాడు. కారణం దీపం ఉన్న వ్యక్తితోపాటు దీపం లేని వ్యక్తి నడవడమే. అట్లా ఇద్దరూ చాలా దూరం నడచాక ఒక నాలుగురోడ్ల కూడలికి చేరారు. అప్పటిదాకా ప్రయాణం ఎంతో సాఫీగా సాగింది. అక్కడినుంచి దారులు వేరయ్యాయి. దీపం ఉన్న వ్యక్తి కుడివైపుకి, దీపం లేని వ్యక్తి ఎడమవైపుకీ వెళ్లాలి. దీపం ఉన్న వ్యక్తి తన దారిన తాను వెళ్లిపోయాడు. దీపం వెలుగు కూడా అతనికి దారి చూపిస్తూ వెళ్లింది. దీపం లేని వ్యక్తి ఎడమవైపుకి తిరిగి పదడుగులు వేశాడో లేదో కాలు ముందుకు కదల్లేదు. కారణం చీకటి. అతనికి దుఃఖం వచ్చింది. అప్పటివరకూ దీపంతో దారి చూపించిన వ్యక్తిని తలచుకున్నాడు. అతని దగ్గరగా తాను నడుస్తున్నంత సేపూ ప్రయాణం అనాయాసంగా సాగింది. అతను వెళ్లిపోయాక తన మార్గం అంధకారబంధురమైంది.

**దీపం లేని వ్యక్తి ఎడమవైపుకి తిరిగి పదడుగులు వేశాడో లేదో కాలు ముందుకు కదల్లేదు. కారణం చీకటి. అతనికి దుఃఖం వచ్చింది. అప్పటివరకూ దీపంతో దారి చూపించిన వ్యక్తిని తలచుకున్నాడు.**

మనకు ఇతరులు కొంతమేరకే మార్గం చూపిస్తారు. తరువాత మన దారి మనం వెతుక్కోవాలి. చివరిదాకా ఎవరూ ఎవరికీ దారి చూపరు. గురువు కానీ, మన ముందు తరాల వారు కానీ చేసే పని అదే. వారు ఇచ్చిన ఆస్తులు కానీ, చూపిన దారి కానీ, గురువు బోధించిన విద్య కానీ కొంతమేరకే దారి చూపుతుంది. శిష్యుడు తనలోని జ్ఞానదీపాన్ని వెలిగించుకున్నప్పుడు మాత్రమే ప్రయాణం చివరిదాకా చేయగలడు. అందుకే బుద్ధుడు ఎప్పుడూ 'నీకు నువ్వే దీపం' అని అంటూ ఉండేవాడు.

కేరెంటింగ్

# ఆలోచనల్ని ప్రోత్సహిస్తే చెప్పిన మాట వింటారు



చిన్న కుటుంబాలు ఎక్కువైన ప్రస్తుత కుటుంబ వ్యవస్థలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడం కత్తి మీద సాముగా మారింది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబవ్యవస్థ.. నైతిక విలువలకు రక్షణ కవచంలా ఉండేది. ఈనాటి సాంకేతిక ప్రపంచంలో అనేక కారణాల వల్ల పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఒక అగాధం ఏర్పడుతోంది. పిల్లలు త్వరత్వరగా అభివృద్ధిలోకి రావాలనే ఆలోచనతో వారిని రోజులో మూడు వంతులు చదువు అనే రణరంగంలోకి వదిలేస్తున్నారు. పిల్లలూ శక్తికి మించి పోరాడుతూ ఒత్తిడితో అలసిపోతున్నారు. ఆ ఒత్తిడినుండి ఉపశమనం కోసం మొబైల్ ఫోన్స్, సామాజిక మాధ్యమాలు, వర్చ్యువల్ గేమ్స్‌లాంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఏది మంచి, ఏది చెడు.. చెప్పే ప్రయత్నం చేసినా వినే ధోరణి కనిపించడం లేదు! అలాగని పిల్లల్ని సరిదిద్దే ప్రయత్నంలో వారిని బలవంతం చెయ్యకూడదు. ఈ తరం పిల్లల్లో తెలివితేటలు, సమయస్ఫూర్తి ఎక్కువగా ఉంటున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. అందుకే వారి ఆలోచనల్ని, అభిప్రాయాలను ప్రోత్సహించాలి. దీనివల్ల తల్లిదండ్రులు చెప్పే మాటల పట్ల పిల్లల్లో సానుకూల దృక్పథం కలుగుతుంది. ఇలా కలిగాక పిల్లలకు నీతి కథలు, పురాణాలు, ఇతిహాసాలు, సంగీతం, నృత్యం

**ఈ తరం పిల్లల్లో చురుకుదనం, తెలివితేటలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆ కారణంగా వాళ్లు కొన్ని తప్పులు చెయ్యొచ్చు. ఆ తప్పుల్ని సున్నితంగా సరిదిద్దాలే తప్ప.. దురుసుగా, దండన విధించినట్లుగా పెద్దలు ప్రవర్తించకూడదు.**

ఇలా అనేక సాధనాల ద్వారా మానవ సంబంధాలు, విలువలు అర్థమయ్యేలా చెప్పాలి. పిల్లలు తప్పు చేస్తే దానిగురించి దీర్ఘ ప్రసంగం చేసి వారి తప్పును ఎత్తి చూపడం కాకుండా.. ఆ తప్పు, లేదా పొరపాటు వల్ల కలిగే పరిణామాలు వివరించాలి. పిల్లలు చాలా సున్నిత మనస్కులు. చిన్నతనంలో నాటే నైతికత విలువల విత్తనమే వారి ఉజ్వల భవితకు పునాది. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలు దూరంగా ఉన్నా.. మనవలను కలిసినప్పుడల్లా నాలుగు మంచిమాటలు, నాలుగు మంచి కథలు చెప్పాలి. అంతేకాదు, వయస్సుకి తగ్గ పనులు వారికి అప్పచెప్పి, ఎప్పుడూ చురుకుగా ఉండేలా కూడా చేయాలి.

– డా. పి.వి.రాధిక
సైకాలజీ కన్సల్టెంట్ (విజయవాడ)

epaper.sakshi.com



● ప్రభాస్

# డార్లింగ్‌కి శుభాకాంక్షలు

'**బా**హుబలి' సక్సెస్‌తో 'ప్యాన్ ఇండియన్ స్టార్'గా మారిపోయారు ప్రభాస్. ఆ నెక్ట్స్ ఆయన నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సాహో' మంచి వసూళ్లను రాబట్టగలిగింది. 'సాహో' వంటి యాక్షన్ మూవీ తర్వాత ప్రస్తుతం ఓ ప్రేమకథ సినిమా చేస్తున్నారు ప్రభాస్. 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 1970 నేపథ్యంలో పీరియాడికల్ లవ్‌స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. గోపీకృష్ణ మూవీస్ కృష్ణంరాజు సమర్పణలో వంశీ, ప్రమోద్‌లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'జాన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ చిత్రం తొలి షెడ్యూల్ ఇటలీలో ముగిసింది. తర్వాతి షెడ్యూల్‌ను ఈ నెలాఖరులో హైదరాబాద్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రభాస్‌తో పాటు కీలక తారాగణంపై ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఓ భారీ సెట్‌ను తయారు చేస్తున్నారు. పీరియాడికల్ మూవీ కాబట్టి ఆ కాలాన్ని ప్రతిబింబించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు కళాదర్శకుడు రవీందర్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. బుధవారం ప్రభాస్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమా అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించి, ప్రభాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది చిత్రబృందం. ఇటీవల హాలిడేలో భాగంగా ప్రభాస్ ప్యారిస్ వెళ్లారు. ఆయన బర్త్‌డే వేడుకలు అక్కడే జరుగుతాయని ఊహించవచ్చు. ఇదిలా ఉంటే.. దాదాపు నెల రోజులుగా 'మా డార్లింగ్ ప్రభాస్ పుట్టినరోజు' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ఈ 23వ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. అభిమాన హీరోకి సోషల్ మీడియా ద్వారా అభిమానులు శుభాకాంక్షలతో సందడి చేస్తున్నారు.



● నయనతార

# ఫారిన్ పోదాం రాములా!

**అ**ల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అల.. వైకుంఠపురములో...'. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాలోని 'రాములో.. రాములా..' సాంగ్ టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. పూర్తి పాటను ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వచ్చే నెల ప్రథమార్ధంలో విదేశాల్లో చిత్రీకరణ జరిపేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోందని సమాచారం. సుశాంత్, నివేదా పేతురాజ్, టబు, జయరామ్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది.



● అల్లు అర్జున్

# ధన్యవాదాలు బంగారం!



● విఘ్నేష్ శివన్‌తో నయనతార

''**నీ** పరిచయం తర్వాత నా జీవితంలో అన్నీ మధుర క్షణాలే. ఈ ఆనందానికి కారణమైనందుకు ధన్యవాదాలు'' అంటూ దర్శకుడు విఘ్నేష్ శివన్ సోషల్ మీడియాలో నయనతారను ఉద్దేశించి ఓ పోస్ట్ పెట్టారు. విఘ్నేష్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, నయనతార జంటగా నటించిన 'నానుమ్ రౌడీదాన్' విడుదలై సోమవారంతో నాలుగేళ్లయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ''ధన్యవాదాలు బంగారం. ఈ సినిమా ఒప్పుకున్నందుకు థ్యాంక్స్. అలాగే నా జీవితం బాగుండే అవకాశం ఇచ్చావు. ఆ దేవుడి ఆశీర్వాదాలు నీకెప్పుడూ ఉండాలి. నువ్వు బయట, లోపల ఎప్పుడూ ఇంతే అందంగా ఉండాలి. బోలెడంత ప్రేమతో'' అంటూ నయన పట్ల తనకున్న ఫీలింగ్‌ని షేర్ చేశారు విఘ్నేష్ శివన్. 'నానుమ్ రౌడీదాన్' సినిమా అప్పుడే విఘ్నేష్, నయన ప్రేమలో పడ్డారనే వార్తలు మొదలయ్యాయి. అప్పటినుంచి ఇప్పటివరకూ కలిసి విహార యాత్రలకు వెళ్లడం, ఒకరి పుట్టినరోజుని మరొకరు ఘనంగా జరపడం, పండగలను కూడా కలిసి జరుపుకోవడం.. ఇలాంటివన్నీ ఇద్దరి మధ్య అనుబంధం బలపడిందని చెప్పడానికి ఉదాహరణలు. త్వరలో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారని సమాచారం.

# సినీ పరిశ్రమ అభివృద్ధికి జగన్ ముందుంటారు

- వై.వి. సుబ్బారెడ్డి



● కృష్ణ భగవాన్, అలీ, రఘుబాబు, శ్రీనివాస్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, శ్రీనివాస్ కానూరు, రఘు కుంచె

''**వే**దికపై ఉన్న అలీ, రఘుబాబు మా పార్టీలో (వైఎస్సార్‌సీపీ) ఉన్నారు. వారందరి సూచనలతో ఆంధ్రప్రదేశ్‌లో సినిమా ఇండస్ట్రీని అభివృద్ధి చేయడానికి మా సీఎం జగన్‌మోహన్ రెడ్డిగారు సుముఖంగా ఉన్నారు'' అని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డ్ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. సత్యదేవ్, ఈషా రెబ్బ, శ్రీరాం, గణేష్ వెంకట్రామన్, ముస్కాన్ సేథీ ముఖ్య పాత్రల్లో శ్రీనివాస్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాగల 24 గంటల్లో'. శ్రీనివాస్ కానూరు నిర్మించిన ఈ సినిమా నవంబరులో విడుదల కానుంది. రఘు కుంచె సంగీతం అందించారు. ఈ చిత్రంలోని హీరోయిన్ ఇంట్రడక్షన్ 'నారాయణతే నమో నమో..' లిరికల్ వీడియో సాంగ్‌ని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వై.వి.సుబ్బారెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''శ్రీనివాస్ రెడ్డి 20 ఏళ్లుగా నాకు మంచి స్నేహితుడు. వెంకటేశ్వర స్వామివారి కీర్తన పాటని నాతో ఎందుకు రిలీజ్ చేయించారో పాట చూశాక అర్థం అయింది. పాటని చక్కగా చిత్రీకరించారు. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ– ''నా దైవం, పితృ సమానులు సుబ్బారెడ్డిగారితో నా అనుబంధం 20 ఏళ్లుగా కొనసాగుతోంది. దివంగత నేత వై.యస్. రాజశేఖర రెడ్డి గారి మరణానంతరం ఆ కుటుంబానికి, పార్టీకి వెన్నెముకగా ఉండి ఎన్నో సేవలందిస్తున్నారు సుబ్బారెడ్డిగారు. యస్వీబీసీ (శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్) బోర్డ్ డైరెక్టర్ పదవీ బాధ్యతలు నాకు అప్పగించారు. ఆయన నాపై పెట్టిన నమ్మకానికి నిజాయతీగా పని చేస్తా'' అన్నారు. ''రామానాయుడుగారు, 'దిల్' రాజుగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఈ సినిమా నిర్మించడం సంతోషంగా ఉంది'' అన్నారు శ్రీనివాస్ కానూరు. సంగీత దర్శకుడు రఘు కుంచె, పాటల రచయిత శ్రీమణి, ఆర్ట్ డైరెక్టర్ చిన్నా, ఎడిటర్ తమ్మిరాజు, నటుడు రవి ప్రకాష్, కెమెరామేన్ అంజి, లైన్ ప్రొడ్యూసర్ యమ్‌యస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పూరీ నుంచి కోల్‌కత్తా



● వైష్ణవ్ తేజ్

**చి**రంజీవి మేనల్లుడు, సాయిధరమ్ తేజ్ తమ్ముడు పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'ఉప్పెన'. సుకుమార్ వద్ద దర్శకత్వ శాఖలో పని చేసిన బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. క్రితీశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై రూపొందుతోన్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ పూరీలో ప్రారంభమైంది. పూరితో పాటు కోల్‌కత్తా, గ్యాంగ్‌టక్ ప్రాంతాల్లో దాదాపు 20రోజుల పాటు జరగనున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, కెమెరా: శాందత్ సైనుద్దీన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

# తుపాకి రాముడుకి థియేటర్లు ఇవ్వాలి

- తలసాని శ్రీనివాసయాదవ్



● బిత్తిరి సత్తి, హరీశ్ రావు. తలసాని, బాలకిషన్, ఈటెల రాజేందర్

''**క**ళలపై రసమయికి ఉన్న మక్కువతో 'తుపాకి రాముడు' సినిమాని నిర్మించాడు. బిత్తిరి సత్తి గురించి అందరికీ తెలిసిందే. వీరు కలిసి చేసిన ఈ చిత్రానికి థియేటర్లు ఇవ్వమని నిర్మాత 'దిల్' రాజుతో మాట్లాడాను. కొంత నష్టమైనా భరించాలని చెప్పాను. ఆయన ధైర్యంగా ముందుకొచ్చారు'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. బిత్తిరి సత్తి, ప్రియ జంటగా టి. ప్రభాకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తుపాకి రాముడు'. రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస యాదవ్, ఈటెల రాజేందర్ బిగ్ సీడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ– ''తెలంగాణ ఉద్యమ సమయంలో రసమయి ఓ సినిమా చేశాడు. ఇప్పుడు హీరో, హీరోయిన్‌తో పాటు సాంకేతిక నిపుణులందర్నీ తెలంగాణ వారినే పెట్టి మంచి సినిమా తీశాడు. తెలంగాణ కళలు, సంప్రదాయాలు, బతుకమ్మ పండగ గురించి తీసిన సందేశాత్మక చిత్రమిది. ప్రేక్షకాదరణతో 100 రోజులు ఆడాలి'' అన్నారు. ''శంకర్ అన్నలా 'శ్రీరాములయ్య' వంటి గొప్ప సినిమా తీయాలనే నా కోరిక 'తుపాకి రాముడు'తో తీరింది. సినిమా నిర్మించడం కంటే విడుదల చేయడం కష్టమని 'దిల్' రాజుగారిని కలిశాక తెలిసింది'' అని రసమయి బాలకిషన్ అన్నారు. ''ఎప్పుడూ నవ్వించే సత్తి ఈ చిత్రంతో ఏడిపిస్తాడు కూడా'' అని బిత్తిరి సత్తి అన్నారు. నిర్మాత 'దిల్' రాజు, దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్. శంకర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నిర్మాత శివకుమార్, నటులు రాజ్ తరుణ్, ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ప్రేక్షకుల సపోర్ట్ చాలు

- అలీ



● చోటా కె.నాయుడు, అలీ, ఓంకార్, అశ్విన్‌బాబు, అవికాగోర్

**ఓ**క్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రూపొందిన చిత్రం 'రాజుగారి గది–3'. ఓంకార్ దర్శకత్వంలో అశ్విన్ బాబు, అవికాగోర్ జంటగా నటించారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా ఓంకార్ మాట్లాడుతూ –''నా తమ్ముడు అశ్విన్‌ను హీరోగా యాక్సెప్ట్ చేసి ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. సాధారణంగా పెద్ద హీరో సినిమాలకు మాత్రమే థియేటర్స్ ఫుల్ అవుతుంటాయి. అలాంటిది మా 'రాజుగారి గది 3' చిత్రం ఫుల్ అవుతోంది'' అన్నారు. అలీ మాట్లాడుతూ– ''ఈ చిత్రాన్ని నేను కూకట్‌పల్లిలోని థియేటర్లో ప్రేక్షకుల మధ్యలో కూర్చుని చూశాను. వారందరూ సినిమాను చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా ఆడాలంటే ప్రేక్షకుల సపోర్ట్ ఉంటే చాలు'' అన్నారు. ''4 కోట్ల రూపాయల గ్రాస్ వసూలు చేసింది ఈ చిత్రం. అశ్విన్ ప్రాణం పెట్టి నటించారు'' అన్నారు కెమెరామెన్ ఛోటా. కె. నాయుడు. ''సినిమా చెయ్యాలనే ఆసక్తే నన్ను సినిమాల్లోకి వచ్చేలా చేసింది. ఈ చిత్రంతో నాకు ఓ మార్కెట్ ఏర్పడింది అని ఫ్రెండ్స్ అంటుంటే చాలా ఆనందంగా ఉంది'' అన్నారు అశ్విన్. ''సినిమా ఇంత పెద్ద విజయం సాధించినందుకు మా యూనిట్‌కి అభినందనలు'' అన్నారు అవికాగోర్. సంగీత దర్శకుడు షబ్బీర్ పాల్గొన్నారు.

# భావనా ఈజ్ బ్యాక్



● అదా శర్మ

**ఓ** మిషన్‌లో భాగంగా గన్ పట్టుకుని శత్రువులను వెంటాడుతున్నారు అదా శర్మ. ఈ మిషన్ తాలూకు డిటైల్స్ త్వరలో వెండితెరపై బహిర్గతం కానున్నాయి. విద్యుత్ జమాల్ హీరోగా కమాండో సిరీస్‌లో వస్తోన్న మూడో చిత్రం 'కమాండో 3'. ఈ చిత్రానికి ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులోని ప్రధాన తారాగణానికి చెందిన లుక్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ''కమాండో సిరీస్‌లో వస్తోన్న ఈ థర్డ్ పార్ట్‌లో భాగమవ్వడం సంతోషంగా ఉంది. ఇందులో భావనారెడ్డి పాత్రలో నటించాను. ఈ సినిమాను ఈ ఏడాది నవంబరు 29న విడుదల చేస్తున్నాం. ట్రైలర్ మరో రెండు రోజుల్లో రిలీజ్ అవుతుంది'' అని అదా శర్మ అన్నారు. 'కమాండో 2' చిత్రంలో కూడా విద్యుత్ జమాల్, అదా శర్మయే హీరో హీరోయిన్లుగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రంలో అదా శర్మ ఇన్‌స్పెక్టర్ భావనారెడ్డి పాత్రలోనే నటించారు.

# మా ఏపీ సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా

''**మూ**వీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్' (మా ఏపీ) లో సభ్యులైన నిరుపేద కళాకారులు, సాంకేతిక నిపుణులు తమ పేర్లను ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ సర్వేలో విధిగా నమోదు చేసుకోవాలి. నమోదు అయిన 'మా ఏపీ' సభ్యులకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమా ఉంటుంది'' అని 'మా ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్ రాజా, అధ్యక్షురాలు కవిత అన్నారు. తెనాలిలోని 'మా ఏపీ' కార్యాలయంలో వారు మాట్లాడుతూ–''రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన నియమ నిబంధనల మేరకు 'మా–ఏపీ' 24 విభాగాల యూనియన్ సంబంధిత శాఖ అధికారుల నుంచి ఆమోదం పొందిన తర్వాతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మా ఏపీ'కి అనుమతి మంజూరు చేసింది. ఇప్పటికే 400 మంది సాంకేతిక నిపుణులు, నటీనటులు సభ్యులుగా ఉన్నారు. ప్రేక్షకులే నిర్ణేతలుగా 'మా–ఏపీ' సినీ అవార్డుల వేడుకలను జనవరిలో నిర్వహిస్తున్నాం. అన్ని విభాగాల్లోని వారికి అవార్డులు అందిస్తాం. మా ఏపీ సభ్యులకు హెల్త్ కార్డులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారిని కలిసి మంజూరు చేసేలా కృషి చేస్తాం'' అన్నారు.



● దిలీప్ రాజా కవిత

# నకిలీ ఆహ్వానం



● రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్



● ఆన్‌లైన్ ఆహ్వానపత్రిక

**బా**లీవుడ్ క్రేజీ లవ్‌బర్డ్స్ రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్‌ల నిశ్చితార్థం వచ్చే ఏడాది జనవరి 22న జోథ్‌పూర్‌లో జరుగుతుందన్నట్లు ఓ ఆహ్వాన పత్రిక నెట్టింట్లో చక్కర్లు కొట్టింది. కానీ నెట్టింట్లో ఉన్న ఆహ్వానపత్రిక నిజమైనది కాదట. అందులో 'ఆలియా' స్పెల్లింగ్ తప్పుగా ఉండటంతో పాటు ఆలియా తండ్రి పేరు ముఖేష్ భట్ (నిజానికి ఆలియాభట్ తండ్రి పేరు మహేశ్‌భట్) అని ఉంది. ఈ కారణాలతో అది నకిలీ ఆహ్వానపత్రిక అని తెల్చేశాయి బాలీవుడ్ వర్గాలు. మరోవైపు ఈ విషయం గురించి ముంబై విమానాశ్రయంలో తారసపడిన ఆలియాను మీడియా అడిగితే.. ''నేనేం చెప్పగలను. ఆ ఆహ్వాన పత్రిక ఫేక్'' అని బదులిచ్చారట. ప్రస్తుతం మూడు నాలుగు సినిమాలతో తీరిక లేకుండా ఉన్న ఆలియా తన ప్రియుడు రణ్‌బీర్ కపూర్‌తో 'బ్రహ్మాస్త్ర' సినిమా చేస్తున్నారు. నెట్టింట్లో చక్కర్లు కొట్టిన ఆహ్వాన పత్రిక నకిలీదే అయ్యుండొచ్చు కానీ రణ్‌బీర్, ఆలియా ప్రేమలో ఉన్నారన్నది మాత్రం నిజం. మరి.. పెళ్లెప్పుడు? అంటే.. ఇద్దరూ నవ్వేసి, సమాధానం చెప్పకుండా తెలివిగా తప్పించుకుంటున్నారు.



సీరియల్

# బంగారు లక్ష్ములు

**తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు మధురగా కల్పిత సుపరిచితమే. ఇప్పుడు చెల్లి లిఖిత 'బంగారు పంజరం'తో తెలుగు ప్రేక్షకులను అలరించడానికి ముస్తాబవుతోంది. బెంగుళూరులో పుట్టి తెలుగు బుల్లితెర ద్వారా ఆకట్టుకుంటున్న ఈ అక్కాచెల్లెళ్ల టీవీ ప్రయాణం గురించి వారి మాటల్లోనే..**

'మా నాన్న బిల్డింగ్ కాంట్రాక్టర్. అమ్మ గృహిణి. అక్క, నేను.. ఇదీ మా కుటుంబం. అక్క కాలేజీ రోజుల్లో నటిస్తూనే పీజీ పూర్తి చేసింది. 'ఒకరికి ఒకరు' సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైన కల్పిత కన్నడ సీరియల్స్‌లోనూ నటిస్తోంది. మా ఇంట్లో తను ఎంత చెబితే అంత. తనే నాకు అన్ని విషయాల్లో అడ్వైజర్. మోడల్.

**మంచితనమే ఆభరణంగా!**

'స్టార్ మా టీవీలో వచ్చే 'బంగారు పంజరం' సీరియల్‌లో మహాలక్ష్మిగా నటిస్తున్నాను. ఈ సీరియల్‌లోని ముగ్గురు అక్కాచెల్లెళ్లలో నేనే పెద్దదాన్ని. అమ్మానాన్నలు చనిపోవడంతో కుటుంబం అంతా తాత బ్రహ్మయ్య బొమ్మల తయారీమీద వచ్చిన ఆదాయంతోనే బతుకుతుంటుంది. తాత బొమ్మలతో పాటు చిన్న చిన్న నగలను కూడా తయారు చేసి అమ్ముతుంటాడు. పేదరికంలో ఉన్నా మా సంతోషాలకు ఎలాంటి లోటూ లేదు. ఒకసారి జమిందారీ కుటుంబం ఆ గ్రామంలోని దేవాలయంలో దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించడానికి పూనుకుంటుంది. అందుకు విగ్రహాలు, నగలు చేయమని ఆ పనిని మా తాతకు అప్పజెబుతుంది. పని అంతా పూర్తి చేస్తాడు మా తాత. ఇది గిట్టని వాళ్లు విగ్రహప్రతిష్ఠకు ముందు రోజు నన్ను కిడ్నాప్ చేస్తారు. రోజంతా ఒక ఇంట్లో ఉంచి, మరుసటి రోజు వదిలేస్తారు. అందరూ మహాలక్ష్మి శీలాన్ని శంకిస్తుంటారు. దీంతో తాత బ్రహ్మయ్య చాలా బాధపడతాడు. తమవల్ల బ్రహ్మయ్య కుటుంబానికి చెడ్డ పేరు వచ్చింది కాబట్టి ఆ పేరు పోగొట్టడానికి తమ కంపెనీ మేనేజర్‌తో మహాలక్ష్మిని పెళ్లి చేసుకోమని చెబుతాడు జమిందార్. కానీ పెళ్లి సమయానికి ఆ మేనేజర్ పారిపోవడంతో జమిందారే మహాలక్ష్మిని పెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. జమిందార్ ఇంట్లో ఇల్లాలిగా అడుగుపెట్టిన మహాలక్ష్మికి అప్పటికే అతనికి పెళ్లయ్యిందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని తెలిసి షాకవుతుంది. అలా బంగారు పంజరంలో చిక్కుకుపోయి విలవిల్లాడుతుంది. ఎంతో అమాయకత్వం, మరెంతో మంచితనం గల అమ్మాయి మహాలక్ష్మి పాత్ర పోషిస్తున్నందుకు, ఇలా మీ ముందుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.





అక్క కల్పిత నటించిన సీరియల్‌లోని దృశ్యం



లిఖిత నటించిన సీరియల్‌లోని దృశ్యం

**చదువంటేనే ఇష్టం**

అక్క నటిగా మారి నాకూ ఓ మార్గం వేసింది.. అని ఈ సీరియల్ ద్వారా అర్థమైంది. నాచేత ఫొటో షూట్స్ చేయించడం, ఫొటోగ్రాఫ్స్ సీరియల్ టీమ్స్‌కి పంపించడం.. అన్నీ తనే చూసుకుంది. అయితే, ముందు ఇదంతా నాకు తెలియదు. తను చేయమన్నట్టు చేసేదాన్ని. ఒక రోజు సీరియల్ టీమ్ అడుగుతున్నారు, అందులో యాక్ట్ చేయాలి అని తను నన్ను అడిగినప్పుడు చదువంటేనే ఇంట్రస్ట్ అని చెప్పాను. అవకాశాలు అందరికీ రావు, వచ్చినప్పుడు ఉపయోగించుకోవాలి అని తనే నచ్చజెప్పింది. నా చదువుకి ఇబ్బంది లేకపోతే ఓకే అన్నాను. ఎందుకంటే ఇప్పుడు బీకామ్ సెకండియర్ చదువుతున్నాను. సీఏ చేద్దామన్నది నా ఫ్యూచర్ ప్లాన్. మా లెక్చరర్స్, ఫ్రెండ్స్‌ని కలిసి అక్కనే మాట్లాడింది. వాళ్లు సపోర్ట్ చేస్తామన్నారు. అక్క నా పట్ల చూపిస్తున్న శ్రద్ధ కాదన లేక నటిగానూ ప్రూవ్ చేసుకుందామని ఇలా యాక్టింగ్ వైపు వచ్చాను.



**లలిత సంగీతం**

చదువుతోపాటు పాటలు పాడటం, డ్యాన్స్ చేయడం, పెయింటింగ్స్ వేయడం.. వీటి కోసం ఎన్ని గంటల సమయమైనా కేటాయిస్తాను. సింగర్‌గానూ రాణించాలని తొమ్మిదేళ్ల పాటు లలిత సంగీతం నేర్చుకున్నాను. అక్క మాటను కాదనలేక ఒక సీరియల్ అనుకున్నాను. కానీ, నటిగా రాణించడంలోనూ, ప్రూవ్ చేసుకోవడంలోనూ నూటికి నూరుపాళ్లు ఇన్‌వాల్వ్ అవుతున్నాను. ఇదే ఇకముందు నా ప్రపంచం అనిపిస్తోంది. ఇప్పుడు బాగుంది. ముందు ముందు ఎలా ఉంటుందో చూడాలి. నేనూ అక్కలా పీజీ చేసి ఈ ఇండస్ట్రీలోనే స్థిరపడాలని, మరిన్ని మంచి ప్రాజెక్టులు చేయాలని ఇప్పుడు అనుకుంటున్నాను.

– ఆరెన్నార్

**ఇద్దరిదీ ఒకే మాట**

మా ఇద్దరి అక్కాచెల్లెళ్లది ఒకే మాట. ఇద్దరం సీరియల్స్ చూస్తాం. సీరియస్‌గా డిస్కషన్ చేస్తుంటాం. అందులోని నటీనటుల యాక్టింగ్ గురించి, వారి క్యాస్ట్యూమ్స్ గురించి... ప్రతీది చర్చిస్తుంటాం. ఇద్దరం యాక్టింగ్ ఫీల్డ్‌లో ఉన్నాం కాబట్టి నటనలో మెలకువల గురించి, ఎలా చేస్తే ఫ్యూచర్ బాగుంటుందో మాట్లాడుకుంటూ ఉంటాం. మా అమ్మానాన్నలు మా ఇద్దరి గురించి ఎవరితోనైనా చెప్పేటప్పుడు 'మా ఇంటి బంగారు లక్ష్ములు' అని గర్వంగా చెబుతుంటారు.



అక్క కల్పితతో లిఖిత

జీవనం

**వాళ్లిద్దరూ వికలాంగులు. పుట్టుకతోనే పోలియోబారిన పడి నడవలేని పరిస్థితి వారిది. పదేళ్ల క్రితం ఒకరినొకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. కాళ్లు లేకున్నా ఆత్మవిశ్వాసంతో తమకు తాముగా నిలదొక్కుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా బతుకుతున్న ఆ జంటను చూసి అంతా అభినందిస్తున్నారు.**



శంకర్, శారద దంపతులు

ఒకరికి ఒకరు

# ఊతమిచ్చుకున్నారు

కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి పట్టణానికి సమీపంలో ఉన్న బాలాజీనగర్ తండాకు చెందిన కాట్రోత్ శంకర్ పుట్టుకతోనే వికలాంగుడు. నడవలేకున్నా చేతులనే ఆధారం చేసుకొని ఇంటర్ వరకూ చదువుకున్నాడు. ఆ తర్వాత సైకిల్ పంక్చర్ దుకాణం పెట్టుకుని జీవనం సాగించడం మొదలుపెట్టాడు. టీవీఎస్ మోపెడ్‌ను తనకు వీలుగా మరో రెండు చక్రాలు బిగింపజేసుకుని దానిపై ఊరూరు తిరుగుతూ సీజనల్ వ్యాపారాలు చేస్తుంటాడు.

**ఇష్టపడిన జీవితం**

మెదక్ జిల్లా కొడిపల్లికి చెందిన శారద చిన్నప్పుడే పోలియోబారిన పడింది. శారదను కలిసిన శంకర్ ఆమెనే తన జీవితభాగస్వామిగా రావాలనుకున్నాడు. ఇద్దరూ ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ వికలాంగులు కావడంతో ఎలా బతుకుతారోనని ఆ తండాలోని అంతా అనుకున్నారు. కాని వారి ఆత్మవిశ్వాసం ముందు వైకల్యం ఓడిపోయింది.

**ఊరూరా ఇడ్లీలు**

ఇద్దరూ తెల్లవారకముందే నిద్రలేచి ఇడ్లీలు తయారు చేసుకుని ద్విచక్ర వాహనంపై పెట్టుకొని ఊరూరు తిరుగుతూ అమ్ముతుంటారు. ఇడ్లీల అమ్మకంతో వచ్చిన డబ్బును పొదుపు చేసుకున్నారు. ఇడ్లీలతోపాటు వేసవి వస్తే ఐస్‌క్రీమ్‌లు అమ్మేవారు. చలికాలం దుప్పట్ల వ్యాపారం చేసేవారు. ఇలా సీజన్‌కు తగ్గట్టు రకరకాల వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న శంకర్, శారద దంపతులు తండావాసులకు ఆదర్శం అయ్యారు.

**కిరాణా కొట్టుతో పోషణ**

పొదుపు చేసుకున్న డబ్బుతో ఇప్పుడు కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఓ చిన్న షాప్ వేసుకుని కిరాణాకొట్టు నిర్వహిస్తున్నారు. ఇద్దరు కలిసి కామారెడ్డి, ఎల్లారెడ్డి పట్టణాలకు వెళ్లి సామాన్లు కొనుగోలు చేసుకుని వస్తారు. ప్రతీ రోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ దుకాణం తెరిచే ఉంటుంది. తండావాసులే కాకుండా, రోడ్డున వెళ్లేవారు సైతం అక్కడ ఆగి తమకు కావలసిన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఇద్దరినీ చూసి మెచ్చుకొని వెళుతుంటారు.

**కొత్త కష్టం**

కుటుంబ పోషణకు ఎవరిపైనా ఆధారపడకుండా వెళ్లదీసుకుంటున్న ఈ జంటకు ఇప్పుడు కొత్త కష్టం వచ్చింది. ఇన్నాళ్లూ పోగేసుకొని నిర్మించుకున్న షాప్ రోడ్డు వెడల్పులో పోతుందని ఆందోళన చెందుతోంది. అక్కడే ప్రభుత్వ స్థలం ఉందని, ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందిస్తే ఆ స్థలంలో షెడ్డు నిర్మించుకొని తమ బతుకులు తాము బతుకుతామని అంటున్నారు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి
ఫొటోలు: అరుణ్

మాకు కాళ్లు లేవని బాధగా ఉండేది. కానీ, ఇప్పుడు ఒకరికి ఒకరం ఉన్నాం. కాళ్లు లేవనే బాధ లేదు. నలుగురిలో భేషుగ్గా బతకాలని ఇద్దరం కష్టపడుతున్నాం. దేనికీ లోటులేకుండా బతుకుతున్నాం. మమ్మల్ని చూసి మా తండాలోనే కాదు చుట్టుపక్కల ఊళ్లవాళ్లూ మెచ్చుకుంటుంటే ఎంతో ఆనందం కలుగుతోంది.

– కాట్రోత్ శంకర్, శారద దంపతులు



దుకాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆనందో బ్రహ్మ

# ఒక లడ్డూ నన్ను జాదూగర్‌గా మార్చింది

– అంతర్జాతీయ స్థాయి ఇంద్రజాలికుడు జాదూగర్ ఆనంద్

**ఐదు దశాబ్దాలుగా 36 దేశాల్లో 37 వేలకుపైగా ఇంద్రజాల ప్రదర్శనలు. నాలుగు ప్రపంచ రికార్డులు. వేలాది సన్మానాలు. మ్యాజిక్ షోలతో పిల్లలు, పెద్దలను అమితాశ్చర్యంలో ముంచెత్తే ఫీట్స్. జాదూగర్ ఆనంద్‌గా ప్రసిద్ధికెక్కిన ప్రముఖ ఇంద్రజాలికుడు అవస్తి ఆనంద్ సాధించిన ఘనత ఇది. ఇంద్రజాల ప్రదర్శనలో భాగంగా చిత్తూరు జిల్లా మదనపల్లెకు వచ్చిన జాదూగర్ ఆనంద్ 'సాక్షి'తో ముచ్చటించారు.**





**● మీరు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. వాటిలో అమితంగా ఆకట్టుకున్నవి..?**

పద్దెనిమిదేళ్ళ వయస్సులో 'అండర్ వాటర్ ఎస్కేప్'గా మొదటి రికార్డు, ఆ తర్వాత ఏడు 'బ్లైండ్ ఫోల్డ్ ఫో'తో రెండో ప్రపంచ రికార్డు సాధించాను. ఇండోర్ నుంచి భూపాల్ వరకు 210 కిలో మీటర్లు కళ్లకు గంతలు కట్టుకుని స్కూటర్ మీద ప్రయాణం చేయడం మర్చిపోలేని సంఘనలు. ఇప్పటి వరకు నాలుగు ప్రపంచ రికార్డులు, 36 దేశాలలో 37 వేలకు పైగా ప్రదర్శనలు నిర్వహించి మూడో ప్రపంచ రికార్డు, అత్యంత వేగవంత మెజీషియన్‌గా నాల్గవ ప్రపంచ రికార్డు సాధించినందుకు ఆనందంగా అనిపిస్తోంది. షో జరిగే సమయంలో అకస్మాత్తుగా ప్రేక్షకుల్లో ఒక అమ్మాయిని స్టేజీ మీదకు పిలిపించి, ఎలాంటి ఆధారం లేకుండా గాలిలో పైకి లేపడం, మరొకరిని క్షణాల్లో మాయం చేయడం, తిరిగి వారిని ప్రేక్షకుల ముందుకు ప్రత్యక్షమయ్యేలా చేయడం... ఒకటి కావు అన్నీ ఆకట్టుకునేవే. స్టేజీ మీద ప్రదర్శించబడుతున్న సినిమా తెరలోకి వెళ్లి అక్కడి నటుల్ని స్టేజీ మీదకు తీసుకురావడం, అండర్ వాటర్ ఎస్కేప్ ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకుంటాయి. ఏదైనా ప్రేక్షకుల అభినందనలు అందుకున్న ప్రతీసారి వారు ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చానన్న సంతృప్తి అన్ని రికార్డులకన్నా మించినదిగా భావిస్తాను.

**● మీ పేరు అవస్తి ఆనంద్. జాదూగర్ ఆనంద్‌గా ఎలా మారారు?**

నేను పుట్టిపెరిగింది మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో. మా కుటుంబంలో అందరూ బాగా చదువుకున్న వారే. ఆ రోజుల్లోనే నాన్న ఏ.పి.అవస్తి డాక్టర్, అమ్మ మహేశ్వరిదేవి ప్రొఫెసర్. మా ముగ్గురు అక్కయ్యలూ బాగా చదువుకున్నవారు. ఆఖరివాడినైన నేనూ పీజీ చేశాను. ఇప్పుడు నా వయసు అరవైఏడేళ్లు. ఆరేళ్ల వయసులో మా స్కూల్‌కి వెళ్లేదారిలో కొందరు గారడీవిద్య ప్రదర్శించేవారు. రోజూ అక్కడికి వెళ్లి ఆ గారడీ చూసేవాడిని. వాళ్లు గాల్లో నుంచి నాకు లడ్డూలు తీసి ఇచ్చేవారు. రోజూ లడ్డూలు తినేవాడిని. అప్పుడే అనిపించింది 'నేనే సొంతంగా గారడీ చేసి లడ్డూలు తెచ్చేసుకుంటే..' అని. ప్రయత్నించా.. లడ్డూ రాలేదు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాను. ఒక్క లడ్డూ కూడా రాలేదు. కానీ నిరాశపడలేదు, ప్రయత్నాన్నీ వదలలేదు. ఎక్కడ ఏ చిన్న గారడీ, మ్యాజిక్ షోలు జరిగినా ఎంత దూరమైనా వెళ్లి చూసేవాడిని. అలా అలా చిన్న చిన్న మేజిక్‌లు నేర్చేసుకున్నా. వాటిని మా స్కూల్లో ప్రదర్శించేవాడిని. చుట్టూ ఫ్రెండ్స్ బాగా ప్రోత్సహించేవారు. ఆ తర్వాత టీచర్లూ మెచ్చుకున్నారు. అక్కణ్ణుంచి గణేష్, దుర్గాదేవి నవరాత్రులలో జరిగే ఉత్సవాలలో ప్రదర్శనలు ఇచ్చేవాడిని. అక్కడ వారు ఇచ్చే డబ్బులు, అమ్మా–నాన్న ఇచ్చే పాకెట్ మనీతో ఇంద్రజాలానికి సంబంధించిన పుస్తకాలు కొనేవాడిని. చదివేవాడిని. ప్రాక్టీస్ చేసేవాడిని. అలా మొదలైన నా ప్రస్థానం.. అంతర్జాతీయ స్థాయి 'జాదూగర్'గా మార్చింది. నాకెవ్వరూ గురువులు లేరు. స్వయంకృషి, స్వంతప్రయత్నంతోనే ఈ విద్యను సాధించాను.

**● మీకు గురువెవ్వరూ లేరు అంటున్నారు.. మీ తల్లిదండ్రుల సహకారం లభించలేదా?**

లేదు. మా కుటుంబంలో ఏకైక మగ పిల్లవాడైనందున మా అమ్మానాన్నలు నాపై అనేక ఆశలు పెట్టుకుని, నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. నేను మెజీషియన్‌గా మారడం వారికి ఇష్టం వుండేది కాదు. అదేమైనా తిండి పెడుతుందా, దేనికి ఉపయోగపడుతుంది..? అనేవారు. అయితే వారి ఇష్టానికి వ్యతిరేకంగా ఇంద్రజాల విద్యలోనే రాణించాను.

**● నీళ్లలోనూ విన్యాసాలు చేశారు..**

స్కూల్లోనూ, కాలేజీలోనూ చిన్న చిన్న మేజిక్ షోలు చేసిన నేను పద్దెనిమిదేళ్ల వయసులో సొంతంగా వేదికల మీద ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టాను. 'అండర్‌వాటర్ ఎస్కేప్'లో భాగంగా తలకు ముసుగు వేసి, కాళ్లను, చేతులను సంకెళ్లతో బంధించి, ఒక పెట్టెలో పెట్టి తాళం వేస్తారు. ఆ పెట్టెను నదిలో పడేస్తారు. ఆ పెట్టెలో నుంచి తప్పించుకుని బయటకు రావాలి. సంకెళ్లను విడదీసేదెలా? పెట్టె తాళం పగలగొట్టేదెలా? బయటకు ఎలా వస్తాను అని పైన అంతా ఉత్కంఠ. కానీ, నేను కేవలం నలభైసెకన్లలో ఈ విన్యాసాన్ని ప్రదర్శించి నది నుంచి బయటకు వచ్చేశాను. ఇది కూడా స్వతహాగానే నేర్చుకున్నాను.

**● ప్రపంచ ప్రసిద్ధి పొందిన మీరు ఇక ముందు ఏం చేయబోతున్నారు?**

ఇంద్రజాలాన్ని ప్రభుత్వాలు ఓ కళగా గుర్తించాలి. అప్పుడే ప్రాచీన భారతీయ సంస్కృతిలో భాగమైన ఇంద్రజాలాన్ని పరిరక్షించుకోగలుగుతాం. సర్కస్ అంటే రష్యాది అని... ఇంద్రజాలం అంటే ఇండియాది అని ప్రపంచం అంతటా పేరుంది. దేశానికి పేరు తెచ్చిన ఇంద్రజాల విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత మనమీదుంది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో మ్యాజిక్ అకాడమీలు ఏర్పాటు చేసి ఇంద్రజాలాన్ని ప్రోత్సహించాలి. ఆ దిశగా నా కార్యాచరణను కొనసాగిస్తున్నాను.

– మాడా చంద్రమోహన్,
సాక్షి, మదనపల్లె, చిత్తూరు

పీడియాట్రిక్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

## బాబుకు మాటిమాటికీ జ్వరం

**మా బాబుకు రెండున్నర ఏళ్లు. ఇటీవల వాడికి మాటిమాటికీ జ్వరం వస్తోంది. డాక్టర్లు రాసిన మందులు వాడుతున్నంత సేపు తగ్గి మళ్లీ వస్తోంది. ఇలా వాడికి మాటిమాటికీ జ్వరం రావడం నాకు చాలా ఆందోళన కలిగిస్తోంది. మా బాబు విషయంలో సలహా ఇవ్వండి.**

**- ఎమ్. శైలజ, ఖమ్మం**



చిన్న పిల్లలు ప్రతిరోజూ సూక్ష్మక్రిములు, వైరస్, బ్యాక్టీరియాకు ఎక్స్‌పోజ్ అవుతుంటారు. దాంతో వారికి ఇలా తరచూ జ్వరం వస్తుండటం చాలా సాధారణం. అందునా కాలం మారినప్పుడు (సీజనల్ వేరియేషన్స్) ఇన్ఫెక్షన్స్ ఎక్కువగా రావచ్చు. గడ్డలు, బ్రుస్సెల్లోసిస్, డెంటల్ యాబ్సెస్, దీర్ఘకాలికమైన జబ్బులు, క్రిప్టోకోకస్, సిస్టైటిస్, ఫెమీలియల్ ఫీవర్ సింర్డోమ్ వంటి అనేక సాధారణ సమస్యలు మొదలుకొని కొన్ని తీవ్రమైన సమస్యల వరకు ఇలా జ్వరం రావచ్చు. మీరు ఇచ్చిన కొద్దిపాటి సమాచారంతో మీ బాబుకు జ్వరం ఎందుకు వస్తోందనేది నిర్దిష్టంగా చెప్పడం సాధ్యం కాదు. అయితే ఒకసారి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన పరీక్షలతో పాటు దీర్ఘకాలికమైన జబ్బులకు ఏమైనా అంతర్గతంగా ఉన్నాయేమో అని వాటి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేయించడం చాలా అవసరం. జ్వరం వచ్చిన ప్రతీసారీ కారణం తెలుసుకోకుండా మందులు – మరీ ముఖ్యంగా యాంటీబయాటిక్స్, ఎన్ఎస్ఏఐడీ వంటివి చాలాకాలం పాటు వాడుతూ పోవడం చాలా అపాయకరం. అది సరైనదీ కాదు. మీరు మరొకసారి మీ పిల్లల వైద్య నిపుణుడిని సంప్రదించి ఈ అంశాలన్నీ చర్చించి, తగిన చికిత్స తీసుకోండి.

## మబ్బులు పడితే చాలు... పాపకు జలుబు

**మా పాప వయసు ఏడేళ్లు. కాస్త వర్షం వచ్చే వాతావరణం ఉంటే చాలు జలుబు చేస్తుంది. రాత్రి వేళల్లో ఊపిరి సరిగ్గా అందక చాలా ఇబ్బంది పడుతోంది. మా పాప సమస్యకు సరైన పరిష్కారం సూచించండి.**

**- కె. రమణి, నెల్లూరు**

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి చూస్తే మీ పాపకు ఉన్న కండిషన్‌ను రైనైటిస్‌గా చెప్పవచ్చు. రైనైటిస్ అనేది ముక్కు లోపలి పొర (నేసల్ మ్యూకోజా) ఇన్‌ఫ్లమేషన్ వల్ల వస్తుంది. ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, కొద్దిమందిలో ముక్కు లోపల దురద, విపరీతమైన తుమ్ములు వంటి ఇతర లక్షణాలు కూడా రైనైటిస్‌లో కనిపిస్తాయి. ఇటీవల ఈ కేసుల సంఖ్య పెరుగుతోంది. కొద్దిమందిలో ఇది సైనసైటిస్, ఆస్తమాతో పాటు కనిపించవచ్చు. కొంత మందిలో ఎప్పుడూ కనిపించే ఈ సమస్య మరికొందరిలో అప్పుడప్పుడు (సీజనల్)గా కనిపిస్తుంటుంది. ఇది అలర్జీ వల్లనే కాకుండా ఇన్ఫెక్షన్స్‌కు సంబంధం లేని ఇతర సమస్యలు (నాన్ ఇన్ఫెక్షియస్ కారణాల వల్ల కూడా) రావచ్చు. అలర్జెన్స్ వల్లనే కాకుండా చల్ల గాలి, ఎక్సర్‌సైజ్, వాతావరణంలో మార్పులు, కాలుష్యాలు, ఉద్వేగాలకు లోనుకావడం (ఎమోషనల్ డిస్టర్బెన్సెస్) వల్ల కూడా ఇది వస్తుంది. కొన్ని సందర్భాల్లో హార్మోన్ల సమతౌల్యతలో లోపాల వల్ల కూడా రావచ్చు. ఇక మీ పాప విషయంలో మీరు చెప్పిన అంశాలను బట్టి చూస్తుంటే ఇది ఇడియోపథిక్ అలర్జిక్ రైనైటిస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమస్యలో చాలాసార్లు కారణం తెలుసుకోవడం కష్టం అయినప్పటికీ– కంప్లీట్ హీమోగ్రామ్ ఇమ్యునోగ్లోబ్యులిన్ (ఐజీఈ) లెవెల్స్, సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే అలర్జెన్స్ పరీక్ష వల్ల కూడా కారణాలు తెలుసుకోవచ్చు. దీనికి చికిత్సగా ముక్కులో సెలైన్ నేసల్ డ్రాప్స్), యాంటీహిస్టమైన్ (గ్రూపు మందులు వాడాల్సి ఉంటుంది. తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే నేసల్ స్టెరాయిడ్స్‌తో చాలావరకు ఉపశమనం ఉంటుంది. ఇక సమస్యను నివారించడం కోసం రైనైటిస్‌ను ప్రేరేపించే ఇతర అంశాలు అంటే... ఫేస్‌పౌడర్, పెయింట్ వంటి ఘాటైన వాసనలు ఉండే పదార్థాలు, పెంపుడు జంతువుల ఒంటి మీద వెంట్రుకలు, దుమ్మూ ధూళి, కాలుష్యాల వంటి వాటికి పాపను దూరంగా ఉంచాలి. మీరు మరొకసారి మీ పిల్లల వైద్యనిపుణుడిని లేదా ఈఎన్‌టీ నిపుణుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోండి.





డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
23-10-2019

దేశ సేవ చేయాలనే ఆసక్తి, సవాళ్లకు వెరువని నైజం ఉంటే.. పదోతరగతి, ఇంటర్, ఇంజనీరింగ్‌తో రక్షణ దళాల్లో ఉజ్వల కెరీర్ ఖాయం చేసుకోవచ్చు. యువతకు రక్షణ రంగంలో లక్షణమైన కొలువులు అందించేందుకు ఆర్మీ, కోస్ట్ గార్డ్ తాజాగా నోటిఫికేషన్‌లు విడుదల చేశాయి. పదోతరగతితో నావిక్ ఎన్‌బీ పోస్టులు, ఇంటర్‌తో ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్, ఇంజనీరింగ్ డిగ్రీ అర్హతతో టెక్నికల్ గ్రాడ్యుయేట్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.




# లక్షణమైన రక్షణ కొలువులు

సాధించాలనే పట్టుదల, పరిశ్రమించే తత్వం ఉంటే.. రక్షణ దళాల్లో కొలువు సంపాదించడం పెద్ద కష్టమేమీ కాదు. భద్రతా దళాల్లో చాలెంజింగ్ కెరీర్ కోరుకునే యువతకు ఇండియన్ ఆర్మీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ (భారతీయ తీరగస్తీ దళం) ఆహ్వానం పలుకుతున్నాయి. అర్హులకు పరీక్షలను, ఇంటర్వ్యూలను నిర్వహించి.. అందులో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఉన్నత ఉద్యోగాలను అందిస్తున్నాయి. ఆర్మీ, కోస్ట్‌గార్డ్‌కు ఎంపికైతే ఆకర్షణీయ వేతనాలతోపాటు ఉన్నత హోదాలను అందుకోవచ్చు.

## భారతీయ తీర గస్తీ దళం
### (ఇండియన్ కోస్ట్ గార్డ్)

దేశ రక్షణ, సముద్ర తీర భద్రత కోసం నిత్యం పహారా కాసే ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో ఉద్యోగమంటే చక్కటి కెరీర్ సొంతమైనట్లే. ఆకర్షణీయమైన జీతాలు, అలవెన్సులు, ప్రమోషన్లు పొందొచ్చు. పదోతరగతి విద్యార్హతతో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**పోస్టులు**

నావిక్ డొమెస్టిక్ బ్రాంచ్-స్టీవార్డ్ (ఎన్‌బీ) అంటే ఫుడ్ ప్రిపేర్ చేయడం, మెను తయారు చేయడం, హౌస్ కీపింగ్, స్టోర్ కీపర్ సహా అవసరమైన ఏ డ్యూటీలకైన కేటాయించవచ్చు.

**అర్హతలు**

నావిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జనరల్ కేటగిరీ 50శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

**వయసు**

18 ఏళ్ల నుంచి 22 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. 01.04.1998 నుంచి 31.03.2002 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 5ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు వయో పరిమితి సడలింపు లభిస్తుంది.

**ఎంపిక ప్రక్రియ**

నావిక్ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారిని మాత్రమే ఉద్యోగంలోకి తీసుకుంటారు.

**పరీక్ష విధానం**

నావిక్ పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. సిలబస్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మ్యాథ్స్, జనరల్ సైన్స్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్‌లో ముఖ్యంగా వెర్బల్, నాన్ వెర్బల్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

తాజాగా నోటిఫికేషన్లు విడుదల చేసిన ఆర్మీ, కోస్ట్‌గార్డ్

టెన్త్, ఇంటర్, ఇంజనీరింగ్‌తో ఉజ్వల అవకాశాలు

ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనాలు

**జీతభత్యాలు**

నావిక్ పోస్టులకు ఎంపికైన వారికి ప్రారంభ వేతనం 7వ పే కమిషన్ 3వ లెవల్ ప్రకారం నెలకు రూ.21,700 అందిస్తారు. వీటికి అదనంగా అలవెన్సులు, భోజన, వసతి సౌకర్యాలు ఉంటాయి. ప్రమోషన్ తర్వాత ప్రధాన అధికారి హోదాలో డీఏతోపాటు రూ.47,600 (8వ పే లెవల్) అందిస్తారు.

**ముఖ్యమైన తేదీలు**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో.
- **దరఖాస్తు ప్రారంభ తేదీ:** 30.10. 2019
- **దరఖాస్తు ముగింపు తేదీ:** 08.11.2019
- **అడ్మిట్ కార్డ్:** 17–22 నవంబర్ 2019
- **పరీక్ష:** నవంబర్ నెలాఖరులో ఉంటుంది.
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

## ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్

భారత రక్షణ దళాల్లో ఒకటైన ఆర్మీలో పనిచేయడం ఎంతో మంది విద్యార్థుల కల. ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు ద్వారా ఇంజనీరింగ్ అర్హతతో అత్యున్నతస్థాయి ఉద్యోగం పొందే అవకాశం లభిస్తుంది. ఉన్నతస్థాయి హోదాతోపాటు, ఆకర్షణీయమైన జీతభత్యాలు, అలవెన్సులు అందుకోవచ్చు.

**పోస్టులు**

ఇండియన్ ఆర్మీ 131వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 40 పోస్టులు భర్తీ చేయనుంది.

**అర్హతలు**

- భారతీయ పౌరుడై ఉండాలి.
- అవివాహిత పురుష అభ్యర్థులై ఉండాలి.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా పొందాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఎత్తు**

ఆర్మీ నిబంధనలకు అనుగుణంగా 157.5 సెం. మీ. ఎత్తు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు తప్పనిసరి.

**వయసు**

- టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 20–27 ఏళ్లు ఉండాలి. జూలై 2, 1993 నుంచి జూలై 1, 2000 మధ్య జన్మించినవారై ఉండాలి.
- పదోతరగతి, 12వ తరగతి మెమోలో ఉన్న పుట్టిన తేదీని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఎటువంటి వయోపరిమితి సడలింపు లేదు.

**ఎంపిక ప్రక్రియ**

ఇంజనీరింగ్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రెండు దశల్లో ఇంటర్వ్యూ, పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి దశల్లో అర్హత సాధించిన అభ్యర్థులను రెండో దశకు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఐదు రోజుల పాటు అలహాబాద్, బోపాల్, బెంగళూర్, కపుర్తలా అభ్యర్థులకు కేటాయించిన ఏదో ఒక ప్రదేశంలో సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్ట్, సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపించిన అభ్యర్థులకు చివరిగా మెడికల్ టెస్ట్ ఉంటుంది.

**శిక్షణ**

ఫైనల్‌గా ఎంపికైన అభ్యర్థులకు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. కోర్సును విజయవంతంగా పూర్తిచేసినవారికి ఆర్మీలో లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగం ఖాయమవుతుంది.

**జీతభత్యాలు**

టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైఫండ్‌గా అందిస్తారు. శిక్షణ పూర్తయ్యాక లెఫ్టినెంట్ హోదాలో పే బ్యాండ్ ప్రకారం రూ.56,100–77,500 జీతాన్ని చెల్లిస్తారు. వీటికి ఆదనంగా గ్రూప్ ఇన్సూరెన్స్, వసతి, భోజన సౌకర్యాలు, ఇంకా అదనపు ప్రోత్సాహకాలు కూడా ఉంటాయి.

లెఫ్టినెంట్ నుంచి కల్నల్, లెఫ్టినెంట్ జనరల్, అత్యంత ఉన్నత పదవీ అయిన సీఓఎస్ (చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్) వరకు గల హోదాలలో ప్రమోషన్లు పొందేకొద్దీ వాటికి అనుగుణంగా జీతభత్యాలు, ప్రోత్సాహకాలు పెరుగుతూ ఉంటాయి.

**ముఖ్యమైన తేదీలు**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- **పరీక్ష ఫీజు:** ఎటువంటి పరీక్ష ఫీజు లేదు.
- **దరఖాస్తు ముగింపు తేదీ:** 14.11.2019
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

## 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సు–43కు దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులకు ఐదేళ్ల శిక్షణ అనంతరం ఇంజనీరింగ్ డిగ్రీతో పాటు పర్మనెంట్ కమిషన్‌లో ఆఫీసర్లుగా నియమిస్తారు.

- **ఖాళీలు:** 90
- **కోర్సు ప్రారంభం:** జులై 2020.
- **అర్హత:** కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్)ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:**16½ నుంచి 19½ ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 13, 2019.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

## ఎఫ్ఎస్ఎస్ఏఐలో 6 ఉద్యోగాలు

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ).. 6 ఫుడ్ అనలిస్టు పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం, గేట్/ఐకార్–నెట్ క్వాలిఫై అయి ఉండాలి.
- **వయసు:** 2019, నవంబర్ 11 నాటికి 35 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూసీ, ఓబీసీలకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ, ఉమెన్, ఎక్స్–సర్వీస్‌మెన్, పీడబ్ల్యూడీలకు రూ.250.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 11, 2019.
- **వెబ్‌సైట్:** www.fssai.gov.in

## సీఐఎమ్ఎఫ్ఆర్‌లో 11 ఖాళీలు

సీఎస్ఐఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎమ్ఎఫ్ఆర్).. 11 సైంటిస్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, జియాలజీ, జియోఫిజిక్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఈ, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 18, 2019.
- **వెబ్‌సైట్:** www.cimfr.nic.in

## ఏపీవీవీపీలో 27 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ).. ఒప్పంద ప్రాతిపదికన 27 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** స్పెషలిస్ట్ డాక్టర్లు(అనస్థీషియా, గైనకాలజీ)–11, మెడికల్ ఆఫీసర్–16.
- **అర్హత:** ఎంబీబీఎస్, సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయసు:** 18–44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 25, 2019.
- **వెబ్‌సైట్:** http://apvvp.nic.in

## ఆర్ఆర్‌సీలో 14 కొలువులు

చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న సదరన్ రైల్వేలో 14 స్కౌట్స్ అండ్ గైడ్స్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పదో తరగతి, ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత, ప్రెసిడెంట్ స్కౌట్/గైడ్/ రోవర్/రేంజర్.
- **ఎంపిక:** రాతపరీక్ష, సర్టిఫికెట్స్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 18, 2019.
- **వెబ్‌సైట్:** www.rrcmas.in

## ఈఈఎస్ఎల్‌లో 235 పోస్టులు

భారత ప్రభుత్వ శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్).. 235 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఆఫీసర్, అసిస్టెంట్ ఆఫీసర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నీషియన్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, సీఏ/ఐసీడబ్ల్యూఏ, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం.
- **వయసు:** పోస్టులను బట్టి 27–37 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీలకు పదేళ్ల గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** నవంబర్ 1, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 30, 2019.
- **వెబ్‌సైట్:** www.eeslindia.org

## ఆర్‌బీఐలో 5 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ).. ఒప్పంద ప్రాతిపదికన 5 బ్యాంక్స్ మెడికల్ కన్సల్టెంట్స్ (బీఎంసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 8, 2019.
- **వెబ్‌సైట్:** www.rbi.org.in

## ఎన్ఎల్‌సీలో 25 కొలువులు

చెన్నైలోని నవరత్న హోదా కలిగిన ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 25 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** జనరల్ మేనేజర్ (మైనింగ్)–4, జనరల్ మేనేజర్ (మెకానికల్)–3, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్–2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్)–2, డిప్యూటీ చీఫ్ మేనేజర్ (హెచ్‌ఆర్)–2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్)–4, అడిషనల్ చీఫ్ మేనేజర్ (ఫైనాన్స్)–3, డిప్యూటీ చీఫ్ మేనేజర్ (ఫైనాన్స్)–1, చీఫ్ మేనేజర్ (సెక్యూరిటీ)–1, అసిస్టెంట్ మేనేజర్ (సెక్యూరిటీ)–3.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ/ఇంజనీరింగ్/ఎంబీబీఎస్/పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 18, 2019.
- **వెబ్‌సైట్:** https://www.nlcindia.com

## ఏఐఈఎస్ఎల్‌లో 170 పోస్టులు

ఎయిరిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన 170 అసిస్టెంట్ సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **రీజియన్ల వారీ ఖాళీలు:** ఈస్టర్న్–15, వెస్టర్న్–80, నార్తర్న్–50, సదరన్–25.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, ఆగస్టు 1 నాటికి 33 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ స్కిల్‌టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **పరీక్ష తేదీ:** నవంబర్ 24, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.airindia.in




# ప్రవేశాలు

## ఎన్ఐఎస్‌లో పీజీ

చెన్నైలోని భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధా (ఎన్ఐఎస్).. 2019–20కి గాను ఎండీ (సిద్ధా) ప్రోగ్రాములో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు వ్యవధి:** 3 ఏళ్లు.
- **అర్హత:** బీఎస్ఎంఎస్ డిగ్రీ ఉత్తీర్ణత, కంపల్సరీ రొటేటరీ రెసిడెన్షియల్ ఇంటర్న్‌షిప్ (సీఆర్ఆర్ఐ) చేసి ఉండాలి.
- **ఎంపిక:** ఏఐఏపీజీఈటీ –2019 మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 25, 2019.
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబర్ 28, 2019.
- **వెబ్‌సైట్:** https://nischennai.org

## డీఎన్‌బీ-పీడీసెట్ 2020

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ 2020కి గాను కింది విభాగాల్లో పోస్ట్ డిప్లొమా డీఎన్‌బీ ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.

- డిప్లొమా నేషనల్ బోర్డు (పోస్ట్ డిప్లొమా) సెంట్రలైజ్‌డ్ ఎంట్రెన్స్ టెస్ట్–2020
- **విభాగాలు:** న్యూక్లియర్ మెడిసిన్, అనస్థీషియాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణత.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** డిసెంబర్ 20, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.4500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 31, 2019.
- **వెబ్‌సైట్:** http://nbe.edu.in

## ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా

నాగ్‌పూర్‌లోని నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) ఆధ్వర్యంలోని పవర్ సిస్టమ్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (పీఎస్‌టీఐ).. పీజీ డిప్లొమా (ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **కాల వ్యవధి:** 26 వారాలు.
- **సీట్లు:** 60.
- **అర్హత:** బీఈ/బీటెక్ (ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/పవర్ ఇంజనీరింగ్).
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తు నింపిన తర్వాత డీడీతో పాటు అవసరమైన డాక్యుమెంట్లు జతచేసి నిర్ణీత గడువులోగా సంబంధిత చిరునామాకు పంపాలి.
- **ఎంపిక:** బీఈ/బీటెక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 24, 2019.
- **వెబ్‌సైట్:** http://www.nptinagpur.com

## మ్యాట్-డిసెంబర్ 2019

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్)కు సంబంధించి నోఫికేషన్‌ను ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (ఏఐఎంఏ) విడుదల చేసింది.

- **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న వారు కూడా అర్హులు.
- **పరీక్ష విధానం:** రాత పరీక్ష/కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** రాత పరీక్ష: డిసెంబర్ 1. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష: డిసెంబర్ 6, 2019.
- **పరీక్ష తేదీలు:** రాత పరీక్ష: డిసెంబర్ 8, 2019. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష: డిసెంబర్ 14, 2019.
- **వెబ్‌సైట్:** www.aima.in

**సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..**

- 10వ తరగతి ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్ మొదలైనవి.. (EM&TM)
- ఇంటర్మీడియట్ ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్, స్టడీ మెటీరియల్, ఎగ్జామ్స్ గైడెన్స్ మొదలైనవి...(EM&TM)
- ఎంసెట్ బిట్‌బ్యాంక్, ప్రాక్టీస్ టెస్టులు, ప్రీవియస్ పేపర్స్, క్విక్ రివ్యూ, ఆన్‌లైన్ టెస్టులు... మొదలైనవి.

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

# 'నిజాయితీగా శ్రమించాం... ఫలితాలు సాధించాం'

అద్భుతం. మేము ఎలా ఆడామో మీరంతా చూశారు. పెద్దగా అనుకూలించని పిచ్‌లపై కూడా ఇలాంటి ఫలితాలు రాబట్టడం గర్వంగా ఉంది. ప్రపంచంలో అత్యుత్తమ జట్టుగా నిలవాలంటే అన్ని రంగాల్లో పటిష్టంగా ఉండాలి. స్పిన్ మొదటినుంచి మన బలం కాగా, బ్యాటింగ్ అనేది ఎప్పుడూ సమస్యే కాదు. ఈ సారి పేస్ బౌలర్లు కూడా చెలరేగారు. మేం ఎక్కడైనా గెలవగలమని నమ్ముతున్నాం. నిజాయితీగా కష్టపడితే ఇలాంటి విజయాలు వాటంతట అవే వస్తాయి. పట్టుదలగా ఆడితే అన్నీ మనకు అనుకూలిస్తాయి. ఉత్కంఠ, తడబాటును అధిగమించి ఓపెనర్‌గా రాణించిన రోహిత్‌కు ప్రత్యేక ప్రశంసలు. ఏదైనా సాధించగలమనే నమ్మకమే మా జట్టును 31 విజయాల వరకు తీసుకొచ్చింది. దీంతో మేం ఆగిపోము.

–విరాట్ కోహ్లి, భారత జట్టు కెప్టెన్

## ఐదు టెస్టు వేదికలుంటే చాలు...

క్రికెట్‌ను చిన్న నగరాలకు కూడా తీసుకొచ్చే క్రమంలో బీసీసీఐ పలు వేదికల్లో టెస్టులు నిర్వహిస్తోంది. అన్ని సంఘాలకు అవకాశం కల్పించాలనే బోర్డు రొటేషన్ పాలసీ కూడా అందుకు ఒక కారణం. అయితే కొన్ని ప్రధాన నగరాలు మినహా ఎక్కడా టెస్టులకు ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించడం లేదు. తాజాగా దక్షిణాఫ్రికా సిరీస్‌తో ఇది మళ్లీ రుజువైంది. మూడు చోట్లా స్టేడియంలో పెద్దగా జనం కనిపించలేదు. దీనిపై కెప్టెన్ కోహ్లి బోర్డుకు ఒక సూచన చేశాడు. భారత్‌లో టెస్టులను మాత్రం కొన్ని ప్రముఖ వేదికలకే పరిమితం చేయాలని అన్నాడు. 'నా అభిప్రాయం ప్రకారం మన దేశంలో ఐదు టెస్టు వేదికలు మాత్రమే ఉంటే సరిపోతుంది. రొటేషన్, అందరికీ అవకాశం ఇవ్వాలనే విషయం నాకూ తెలుసు. కానీ వాటికి వన్డేలు, టి20 మ్యాచ్‌ల అవకాశం కల్పించాలి. మన వద్దకు వచ్చే ముందు విదేశీ జట్లకు కూడా ఎక్కడ టెస్టులు జరుగుతాయో తెలిసి వాటిని అనుగుణంగా సిద్ధమవుతాయి. అక్కడ పిచ్‌లు ఎలా ఉంటాయో, ప్రేక్షకుల సంఖ్య ఎంత ఉంటుందో అన్నీ తెలుస్తుంది. కాబట్టి ప్రేక్షకుల ఆదరణ బాగా ఉండే గరిష్టంగా ఐదు బలమైన టెస్టు వేదికలు చాలు' అని విరాట్ అన్నాడు. భారత్‌లో ఇప్పటి వరకు 27 వేదికల్లో టెస్టు మ్యాచ్‌లు జరగ్గా... 2000 నుంచి 18 వేర్వేరు స్టేడియాల్లో జట్టు టెస్టులు ఆడింది.




# 12 బంతుల్లోనే...

## దక్షిణాఫ్రికా ఖేల్ ఖతం

- మూడో టెస్టులో ఇన్నింగ్స్, 202 పరుగులతో భారత్ ఘన విజయం
- 3–0తో 'ఫ్రీడం ట్రోఫీ' సొంతం

**రాంచీ:** భారత క్రికెట్ జట్టు లాంఛనం పూర్తి చేసింది. దక్షిణాఫ్రికా మిగిలిన 2 వికెట్లను నాలుగో రోజు ఆరంభంలోనే పడగొట్టి ఇన్నింగ్స్, 202 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలు 133 పరుగులకే ఆలౌటయ్యారు. మంగళవారం ఈ క్రతువుకు సరిగ్గా 2 ఓవర్లు మాత్రమే సరిపోయాయి. తొలి ఓవర్ వేసిన షమీ ఒక పరుగు ఇచ్చి ముగించాడు. ఆ తర్వాతి ఓవర్ వేసిన నదీమ్ తొలి నాలుగు బంతుల్లో పరుగులివ్వలేదు. చివరి రెండు బంతుల్లో వరుసగా బ్రూయిన్ (49 బంతుల్లో 30; 4 ఫోర్లు, సిక్స్), ఇన్‌గిడి (0)లను అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికా కథ కంచికి చేరింది. సొంతగడ్డపై మూడు మ్యాచ్‌లు గెలిచి 'ఫ్రీడం ట్రోఫీ'ని సొంతం చేసుకున్న భారత్... దక్షిణాఫ్రికాను 3–0తో క్లీన్‌స్వీప్ చేయడం ఇదే తొలిసారి. ఈ టెస్టులో డబుల్ సెంచరీ సాధించిన రోహిత్ శర్మ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడంతో పాటు సిరీస్‌లో మొత్తం 529 పరుగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డునూ సొంతం చేసుకున్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా పరిస్థితి మాత్రం సిరీస్‌లో రానురానూ తీసికట్టుగా మారింది. విశాఖపట్నంలో జరిగిన తొలి టెస్టులో ఐదో రోజు వరకు పోరాడిన టీమ్ పుణే టెస్టులో నాలుగో రోజు 67.2 ఓవర్ల పాటు ఆడి చివరి సెషన్ వరకు మ్యాచ్‌ను తీసుకెళ్లగలిగింది. ఈ టెస్టులో నాలుగో రోజు రెండు ఓవర్లకే ఆ జట్టు ఆట పరిమితమైంది.

తాజా ప్రదర్శనతో భారత్ ఖాతాలో మరో 40 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్లు చేరాయి. ఈ పద్ధతి మొదలయ్యాక ఐదు టెస్టులు ఆడిన భారత్ ఐదింటిలోనూ గెలిచి అందుబాటులో మొత్తం 240 పాయింట్లను కూడా సొంతం చేసుకోవడం విశేషం. మిగతా అన్ని జట్లు కలిపి 19 వరల్డ్ చాంపియన్‌షిప్ టెస్టులు ఆడగా... వారు సాధించి మొత్తం పాయింట్లు కలిపి 232 మాత్రమే కావడం టీమిండియా ఆధిపత్యాన్ని సూచిస్తోంది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 497/9 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 162; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** డికాక్ (బి) ఉమేశ్ 5; ఎల్గర్ (రిటైర్డ్ హర్ట్) 16; హమ్జా (బి) షమీ 0; డు ప్లెసిస్ (ఎల్బీ) (బి) షమీ 4; బవుమా (సి) సాహా (బి) షమీ 0; క్లాసెన్ (ఎల్బీ) (బి) ఉమేశ్ 5; లిండే (రనౌట్) 27; పీట్ (బి) జడేజా 23; బ్రుయిన్ (సి) సాహా (బి) నదీమ్ 30; రబడ (సి) జడేజా (బి) అశ్విన్ 12; నోర్జే (నాటౌట్) 5; ఇన్‌గిడి (సి అండ్ బి) నదీమ్ 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (48 ఓవర్లలో ఆలౌట్) 133**

**వికెట్ల పతనం:** 1–5, 2–10, 3–18, 4–22, 5–36, 6–67, 7–98, 8–121, 9–133, 10–133.

**బౌలింగ్:** షమీ 10–6–10–3, ఉమేశ్ 9–1–35–2, జడేజా 13–5–36–1, నదీమ్ 6–1–18–2, అశ్విన్ 10–3–28–1.

# పేస్ బౌలింగ్ సూపర్

## మెరిసిన షమీ, ఉమేశ్
### భారత విజయంలో కీలకపాత్ర

సాక్షి క్రీడా విభాగం

'స్పిన్ పరీక్ష కోసం సన్నద్ధమై వస్తే సిలబస్‌లో లేని విధంగా భారత పేస్ బౌలర్లు మాకు పరీక్ష పెట్టారు'... అదో రకమైన వైరాగ్యంతో దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్ దాదాపుగా ఇదే మాట చెప్పాడు. భారత జట్టు సొంతగడ్డపై టెస్టులు, సిరీస్‌లు నెగ్గడం కొత్త కాదు. మన బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించడం కూడా మొదటి సారి కాదు. మనం భారీ స్కోర్లు సాధించిన తర్వాత స్పిన్నర్లు చెలరేగిపోయి టపటపా వికెట్లు పడగొట్టడం రొటీన్‌గా జరిగిపోయేదే. కానీ ఈ సారి విజయానికో విశేషం ఉంది. సఫారీలపై మన గెలుపులో భారత పేస్ బౌలర్లు కీలక పాత్ర పోషించారు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ మన పేసర్లను ఎదుర్కోవడంలో ఎంత ఇబ్బంది పడ్డారో కనిపించింది. సిరీస్‌లో మన ఫాస్ట్ బౌలర్లు షమీ, ఉమేశ్, ఇషాంత్ కేవలం 17.50 సగటుతో వికెట్లు పడగొడితే రబడ, ఫిలాండర్‌లాంటి పదునైన పేసర్లతో కూడిన దక్షిణాఫ్రికా జట్టు మరీ ఘోరంగా 70.20 సగటుతో వికెట్లు తీసిందంటే మన సత్తా అర్థమవుతోంది. మనం సొంతగడ్డపై ఆడుతున్నామని అనుకున్నా... అనుకూలంగా ఉన్న పిచ్‌లపై కూడా ఏమీ చేయలేని సఫారీలతో పోలిస్తే మన బౌలింగ్ ఎంత పదునుగా ఉందో ఇది చూపిస్తోంది. షమీ 3 టెస్టుల్లో 13, ఉమేశ్ 2 టెస్టుల్లో 11 వికెట్లు పడగొట్టారు. ఇషాంత్ 2 వికెట్లే తీసినా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెంచడంలో సఫలమయ్యాడు. స్పిన్నర్లు తీసిన 32 వికెట్లతో పోలిస్తే పేసర్లు 26 వికెట్లతో చేరువగా రావడం సాధారణంగా భారత్‌లో కనిపించని దృశ్యం. ఉమేశ్ యాదవ్ మాటల్లో చెప్పాలంటే 'ఆరంభంలో బంతి మెరుపు పోయేలా చేసి స్పిన్నర్లకు అప్పగించడం, ఆ తర్వాత ఎప్పుడో చివర్లో రివర్స్ స్వింగ్ కోసం ప్రయత్నించడం ఇప్పటి వరకు కనిపించేది. కానీ మన బౌలింగ్‌లో పేస్, బౌన్స్ ఉంటే భారత్‌లో కూడా సఫలం కావచ్చని మేం రుజువు చేశాం' అనేది అక్షర సత్యం. భారత పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేయాలో తమకు అర్థం అయిందని, దాని కోసం ఎంతో సాధన చేశామని షమీ చెప్పుకొచ్చాడు. తమ ఫిట్‌నెస్‌గా అద్భుతంగా మారడం కూడా అందుకు ఒక కారణమని అతను విశ్లేషించాడు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌పై మన ఫాస్ట్ బౌలర్లు ఇంతగా ఆధిపత్యం కనబర్చడం ఎప్పుడూ చూడలేదని మాజీ క్రికెటర్లు కూడా చాలా మంది అభిప్రాయ పడ్డారు. ఇక ఈ సిరీస్‌లో నంబర్‌వన్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఉండి ఉంటే ఏం జరిగేదే ఊహించగలమా! వీరితో పాటు కొంత కాలంగా నిలకడగా మన విజయాల్లో కీలక పాత్ర పోషించిన భువనేశ్వర్ కూడా మరో కీలక బౌలర్. రాబోయే రోజుల్లో ఈ ఐదుగురితో కూడిన మన పేస్ దళంనుంచి మరిన్ని అద్భుతాలు, ముఖ్యంగా విదేశాల్లో నిలకడైన విజయాలు కచ్చితంగా వస్తాయని ఆశించవచ్చు.




> 'షమీ, ఉమేశ్ స్ట్రయిక్‌రేట్ చూస్తే భారత్‌లో గతంలో ఏ పేసర్లూ ఇలా బౌలింగ్ చేయలేదని అర్థమవుతోంది. ముఖ్యంగా స్టంప్స్‌పైకి, బ్యాట్స్‌మెన్ ప్యాడ్లపైకి వీరు బంతులు సంధించిన తీరు నిజంగా అద్భుతం. ఇది మన దూకుడుకు మంచి సంకేతం. బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి కొనసాగిస్తూ వీరు వికెట్లు తీయగలిగారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మన పేసర్లు బౌలింగ్ చేసే సవాల్‌కు సిద్ధంగా ఉంటున్నారు. వికెట్ తీయాల్సిందే అన్నట్లుగా బంతిని అడిగి మరీ తీసుకుంటున్నారు.'
>
> -విరాట్ కోహ్లి

*1932లో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసిన భారత్ ఇప్పటివరకు మొత్తం 538 టెస్టులు ఆడింది. ఇందులో 155 మ్యాచ్‌ల్లో గెలిచింది. 165 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 217 టెస్టులు 'డ్రా' చేసుకుంది. ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. 87 ఏళ్ల తమ టెస్టు చరిత్రలో ఓవరాల్‌గా కనీసం రెండు అంతకంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌లతో జరిగిన సిరీస్‌లను భారత్ 'క్లీన్‌స్వీప్' చేయడం ఇది 14వసారి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.*

### భారత్ క్లీన్‌స్వీప్ సిరీస్‌ల జాబితా

| ఏడాది | ప్రత్యర్థి | వేదిక | విజేత | తుది ఫలితం |
|---|---|---|---|---|
| 1992-93 | ఇంగ్లండ్ | భారత్ | భారత్ | 3-0 |
| 1993-94 | శ్రీలంక | భారత్ | భారత్ | 3-0 |
| 2001-02 | జింబాబ్వే | భారత్ | భారత్ | 2-0 |
| 2004-05 | బంగ్లాదేశ్ | బంగ్లాదేశ్ | భారత్ | 2-0 |
| 2005 | జింబాబ్వే | జింబాబ్వే | భారత్ | 2-0 |
| 2009-10 | బంగ్లాదేశ్ | బంగ్లాదేశ్ | భారత్ | 2-0 |
| 2010-11 | ఆస్ట్రేలియా | భారత్ | భారత్ | 2-0 |
| 2012 | న్యూజిలాండ్ | భారత్ | భారత్ | 2-0 |
| 2012-13 | ఆస్ట్రేలియా | భారత్ | భారత్ | 4-0 |
| 2016-17 | న్యూజిలాండ్ | భారత్ | భారత్ | 3-0 |
| 2017 | శ్రీలంక | శ్రీలంక | భారత్ | 3-0 |
| 2018-19 | వెస్టిండీస్ | భారత్ | భారత్ | 2-0 |
| 2019 | వెస్టిండీస్ | వెస్టిండీస్ | భారత్ | 2-0 |
| 2019 | దక్షిణాఫ్రికా | భారత్ | భారత్ | 3-0 |

## వలసలు దెబ్బ తీస్తున్నాయి



2015 సిరీస్ అనుభవం తర్వాత స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటే చాలని ఇక్కడికొచ్చాం. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. భారత పేసర్లు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశారు. మా దేశ బోర్డు సరైన ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కాలేదు. ఇక భారత పర్యటన మానసికంగా మాకు మానలేని గాయాలు చేసింది. దీని నుంచి కోలుకోవడం అంత సులువు కాదు. ప్రతీసారి భారత్ నిర్దాక్షిణ్యంగా ఆడి భారీ స్కోర్లు నమోదు చేసింది. వాటిని చూడగానే మానసికంగా మేం బలహీనపడిపోయాం. అదే మా బ్యాటింగ్‌లో కనిపించింది. వైజాగ్‌లో తొలి ఇన్నింగ్స్ చాలా బాగా ఆడిన తర్వాత ఇలా జరగడం బాధాకరం. ఆ తర్వాత మేం తప్పుల మీద తప్పులు చేస్తూ వచ్చాం. అయితే ప్రతీ విభాగంలో మాపై పైచేయి సాధించిన భారత జట్టును ప్రశంసించకుండా ఉండలేం. దిగ్గజ ఆటగాళ్ల స్థానంలో భవిష్యత్తు కోసం వేరేవాళ్లను తీర్చి దిద్దే ప్రయత్నం జరగలేదు. 'కొల్పాక్' ఒప్పందంతో ప్రతిభ గల మా ఆటగాళ్లంతా ఇంగ్లండ్‌కు వలస వెళ్లిపోతుండటం దేశ క్రికెట్‌ను దెబ్బ తీస్తోంది. అంతా డబ్బు మహిమ.

–డు ప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్

> కొత్త బంతిని ఎదుర్కోవడం ఎప్పుడైనా సవాల్‌వంటిదే. దానిని సమర్థంగా ఎదుర్కోగలడం నాకు పెద్ద సానుకూలాంశంగా చెప్పగలను. వన్డేలైనా నేను ఆరంభంలో జాగ్రత్తగా ఆడిన నిలదొక్కుకున్న తర్వాతే షాట్లు ఆడతాను. దానినే ఇక్కడా అమలు చేశాను. ఓపెనర్‌గా కెప్టెన్, కోచ్ ఇచ్చిన మద్దతు ఎంతో మేలు చేసింది. టెస్టుల్లో భారీ స్కోర్లు చేస్తే ఆత్మవిశ్వాసం ఎంతో పెరుగుతుంది. నేను భారీ స్కోర్లు సాధించే వరకు క్రీజ్‌లో పట్టుదలగా నిలబడాలని ప్రతీ సారి నాకు నేను చెప్పుకున్నాను.
>
> –రోహిత్ శర్మ, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్

## నదీమ్ కల నెరవేరిన వేళ...



షాబాజ్ నదీమ్ తన తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్‌ను జార్ఖండ్ తరఫున 2004 డిసెంబర్‌లో ఆడాడు. నదీమ్ వయసు 15 ఏళ్లు కాగా, అప్పటికి ఇంకా భారత్ తరఫున అరంగేట్రం చేయని ఎమ్మెస్ ధోని వికెట్ కీపర్‌గా వ్యవహరించాడు. ఇక రాంచీ టెస్టులో తనతో కలిసి ఆడిన మిగతా పది మంది జట్టు సహచరులందరూ నదీమ్ తర్వాతే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తొలి మ్యాచ్ ఆడటం విశేషం! కానీ భారత జట్టులోకి వచ్చేసరికి నదీమ్ వయసు 30 ఏళ్లు. 15 ఏళ్ల కఠోర శ్రమ తర్వాత గానీ అతనికి అవకాశం దక్కలేదు. దేశవాళీలో 400కు పైగా వికెట్లు తీసిన తర్వాత తొలి టెస్టు ఆడిన అతను మ్యాచ్ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యాడు. జట్టులో స్థానం కోసం పిలుపు వచ్చిన సమయంలో కోల్‌కతాలో ఉన్న నదీమ్... విమానాలు అందుబాటులో లేకపోవడంతో 450 కిలోమీటర్ల రోడ్డు ద్వారా ప్రయాణించి రాత్రికి రాంచీ చేరుకున్నాడు. ఉదయమే అతనికి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. 'ఎప్పుడో ఒకసారి జట్టుకు ఎంపిక కాకపోతామా అనే ప్రేరణే ఇన్నేళ్లు నడిపించింది. భారత్‌కు ఆడుతున్న స్పిన్నర్లందరూ బాగా రాణిస్తున్నప్పుడు మనమేం చేయాలి. ముందు ఒక స్థానం ఖాళీ అయితే కదా మనం భర్తీ చేయగలమా అనే ఆలోచన వచ్చేది' అని నదీమ్ వ్యాఖ్యానించాడు. అతని అచ్చమైన సాంప్రదాయ లెఫ్టార్మ్ స్పిన్ బౌలింగ్ శైలి అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా బవుమాను స్టంపౌట్ చేయడంలో నదీమ్ బంతి వేసిన తీరు చూడచక్కగా ఉందంటూ దిగ్గజం బిషన్ సింగ్ బేడి నుంచి వచ్చిన ప్రశంస అతనికి దక్కిన అతి పెద్ద బహుమతి. చివరి రోజు టెస్టు చూసేందుకు వచ్చిన ధోని డ్రెస్సింగ్ రూమ్ వద్ద నదీమ్‌కు కొన్ని సూచనలివ్వడం అందరినీ ఆకర్షించింది.

## ఏ పిచ్ అయినా ఒకటే



పిచ్‌లు ఎలా పోతే మాకేంటి? జొహన్నెస్‌బర్గ్ అయినా మెల్‌బోర్న్ అయినా ముంబై అయినా మ్యాచ్ ఫలితంపై పిచ్ ప్రభావం లేకుండా చూడటమే మా ఉద్దేశం. ఇంత అద్భుతమైన బ్యాటింగ్ లైనప్, 20 వికెట్లు తీయగల బౌలర్లు ఉన్నప్పుడు ఈ విజయాలు వస్తూనే ఉంటాయి. మా జట్టు ఫెరారీ కారు తరహాలో దూసుకుపోతుంది. సాధారణంగా భారత్‌లో విజయం సాధించినప్పుడు ఒకరో, ఇద్దరికో గుర్తింపు లభిస్తుంది. కానీ ఈసారి ఆరేడుగురు ఆ జాబితాలో ఉన్నారు. షాబాజ్ నదీమ్ ఈ స్థాయికి చేరేందుకు ఎంతో శ్రమించాడు. అతను తన సొంత ప్రేక్షకుల సమక్షంలో మ్యాచ్‌ను ముగించడం సంతోషంగా ఉంది. ప్రతీ బంతిని కచ్చితత్వంతో వేయడం అతని అనుభవానికి నిదర్శనం.

–రవిశాస్త్రి, భారత కోచ్

## నేడు బీసీసీఐ ఏజీఎం



**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నేడు జరుగుతుంది. అనంతరం ఎన్నికయిన నూతన కార్యవర్గం బోర్డులో పూర్తిస్థాయి పాలన పగ్గాలు చేపడుతుంది. దీంతో సుప్రీం కోర్టు నియమించిన పరిపాలక కమిటీ (సీఓఏ)కి నేటితో శుభం కార్డు పడుతుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన వివాదాస్పదం కాకుండా సజావుగానే ముగిసింది. మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బోర్డు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు జై షా కార్యదర్శి పదవికి నామినేషన్ వేశారు. మరోవైపు ఇన్నాళ్లు భారత క్రికెట్ వ్యవహారాలు చూసిన సీఓఏ చీఫ్ వినోద్ రాయ్, సభ్యురాలు డయానా ఎడుల్జీలకు 33 నెలల కాలానికి ఒక్కొక్కరికి రూ. 3.5 కోట్లు చెల్లించాలని బీసీసీఐ నిర్ణయించింది.

## విజేత హారిక

### ఐల్ ఆఫ్ మ్యాన్ చెస్ టోర్నీ



**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 'ఐల్ ఆఫ్ మ్యాన్' స్విస్ గ్రాండ్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన ఈ టోర్నీలో హారిక మహిళల విభాగంలో విజేతగా నిలిచింది. 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హారిక 5.5 పాయింట్లతో దినారా (కజకిస్తాన్)తో కలిసి సమఉజ్జీగా నిలిచింది. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరించగా హారికకు తొలి స్థానం, దినారాకు రెండో స్థానం లభించాయి. హారిక 11 మంది గ్రాండ్‌మాస్టర్లతో గేమ్‌లు ఆడింది. రెండు గేముల్లో గెలిచింది. ఏడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, రెండు గేముల్లో ఓడింది. తాజా ప్రదర్శనతో హారిక త్వరలో వెలువడే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 13వ స్థానం నుంచి 9వ స్థానానికి చేరుకుంటుంది.

## సింధు శుభారంభం

### ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ



**పారిస్:** ఈ ఏడాది తొలి వరల్డ్ టూర్ టైటిల్ కోసం వేచి చూస్తున్న ప్రపంచ చాంపియన్ పీవీ సింధు ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ సింధు 21–15, 21–13తో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ మిచెల్లి లీ (కెనడా)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 26వ ర్యాంకర్ యో జియా మిన్ (సింగపూర్)తో సింధు ఆడుతుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో శుభాంకర్ డే సంచలనం సృష్టించాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ శుభాంకర్ డే 15–21, 21–14, 21–17తో ప్రపంచ 17వ ర్యాంకర్ టామీ సుగియార్తో (ఇండోనేసియా)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. మరోవైపు మంగళవారం విడుదలైన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ కెరీర్ బెస్ట్ 11వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

THE CO-OPERATIVE ELECTRIC SUPPLY SOCIETY (CESS) LTD
SIRCILLA-505 301, DIST: RAJANNA SIRCILLA (TELANGANA STATE)
TENDER NOTICE NO. 3/2019-20, DATE: 19.10.2019
Sealed tenders are invited from Reputed Suppliers for immediate supply of Servers, Firewall, Server Rack etc for Automation works.
The cost of tender schedule is Rs. 500/- and fixed EMD will be Rs. 50,000/-. The tender schedules shall be obtained upto 4 PM on 03.11.2019. The cost of schedules & Bid Security shall be paid by DD drawn in favour of Managing Director, CESS, Ltd., payable at Sircilla. Sealed tenders with fixed EMD will be accepted upto 4PM on 04.11.2019. Opening of sealed tenders starts at 3 PM on 05.11.2019. Mob: 94408 - 14058/59/9440815202, email: cessonline.sircilla@gmail.com. Sd/-, Managing Director.

Notification For Request for Proposal (RFP)
- Request for Proposal (RFP) is invited from experience agencies / firms / companies for "Upgradation of Champions of Change Dashboard with Advanced Analytics for the Transformation of Aspirational Districts Programme, NITI Aayog, GoI.
- RFP documents, Eligible criteria and other details can be downloaded from the website www.apvision.ap.gov.in. For further details contact 0866-2484820, email: eproc.apsdps@gmail.com.
- Interested agencies shall submit before 3.00 PM on 07-11-2019.
Sd/- CEO, APSDPS, Planning Department, Vijayawada.
DIPR RO.No.189PP/CL/Advt/1/1/2019-20, Dt.22-10-2019

NISE
NATIONAL INSTITUTE OF SOLAR ENERGY
(An Autonomous Institution under the Ministry of New & Renewable Energy, Government of India)
Faridabad-Gurgaon Road, GwalPahari, Gurgaon - 122003, Haryana
3 Months Residential Placement linked Skill Development Program
'SURYAMITHRA'
Training Center: Institute of Solar Power Technologies & Vocational Training, (M/s. PLNS Educators Private Limited) Hyderabad
Starting from: 28-10-2019
Registrations will close on 26th October - 2019
Venue: 8-3-167/20/M/5, 2nd Floor, Above Karur Vysya Bank, Moti Nagar Branch, Rajeev Nagar 'X' Roads, Hyderabad - 500 018. Telangana.
Eligibility: Education : ITI Electrician / Wireman / Electronics or Diploma Electrical / Electronics / Mechanical only. Gender : Both Male & Female Candidates. Age : Minimum Age : 19 years Maximum Age : 25 years.
Contact Details: Land Line : 040 - 23833566 / 040 - 23833567; Mobile : 6303 450 925; Email : centercoordinatorhyd.plns@gmail.com
Certification By SCGJ / Govt. of India.

సాక్షి బిజినెస్
బుధవారం
23-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 335 ▼ | 74 ▼ |
| 38,964 | 11,588 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,153 | ▼ | 10 |
| డోజోన్స్ | 26,920 | ▲ | 92 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,212 | ▲ | 49 |
| డాక్స్ | 12,756 | ▲ | 7 |
| షాంఘై | 2,954 | ▲ | 15 |
| నికాయ్ (సోమవారం ముగింపు) | 22,549 | ▲ | 56 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 70.04 | 72.32 |
| బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 90.11 | 93.77 |
| యూరో | థామస్‌కుక్ | 77.96 | 80.92 |
| జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 62.00 | 74.00 |
| ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 47.79 | 50.07 |
| సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 51.26 | 53.49 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.13 | 19.73 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.85 | 19.85 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.40 | 10.80 |

# ఇన్ఫోసిసిస్.. ఇన్వెస్టెర్రర్!

## షేరు 16 శాతం క్రాష్...

- ఆరేళ్లలో అత్యంత భారీ పతనం
- సీఈవో, సీఎఫ్‌వోలపై ఆరోపణలే కారణం
- విచారణ జరిపిస్తామన్న చైర్మన్ నీలేకని

సీఈవో, సీఎఫ్‌వోలపై అనైతిక విధానాల ఆరోపణలు ఐటీ దిగ్గజం ఇన్ఫీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కంపెనీ షేరు ఆరేళ్లలో ఎన్నడూ లేనంతగా మంగళవారం కుప్పకూలింది. ప్రజావేగుల ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామంటూ సంస్థ చైర్మన్ నీలేకని దిద్దుబాటు చర్యలు ప్రారంభించినప్పటికీ.. అమెరికాలో ఇన్ఫీని ఇరకాటంలో పెట్టేందుకు అక్కడి ఇన్వెస్టర్లు క్లాస్ యాక్షన్ దావాకు సిద్ధమవుతున్నారు. దీంతో.. రెండేళ్ల క్రితం సీఈవో, ప్రమోటర్ల మధ్య వివాదాలతో తలెత్తిన సంక్షోభ ప్రభావాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఇన్ఫోసిస్ .. తాజాగా మరో సంక్షోభంలోకి జారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**న్యూఢిల్లీ:** ఆదాయాలు, లాభాలను పెంచి చూపించేందుకు అనైతిక విధానాలకు పాల్పడుతున్నారంటూ స్వయంగా సీఈవో సలిల్ పరేఖ్‌పై వచ్చిన ఆరోపణలతో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు కుదేలైంది. మంగళవారం ఏకంగా 16 శాతం పతనమైంది. గడిచిన ఆరేళ్లలో ఇంత భారీగా ఇన్ఫీ షేరు క్షీణించడం ఇదే తొలిసారి. మరోవైపు స్వల్పకాలికంగా ఆదాయాలు, లాభాలు పెంచి చూపించేందుకు ఖాతాల గోల్‌మాల్ చేయిస్తున్నారని, అనైతిక విధానాలకు తెరతీశారని సలిల్ పరేఖ్, సీఎఫ్‌వో నీలాంజన్ రాయ్‌లపై వచ్చిన ఆరోపణల మీద పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామంటూ ఇన్ఫీ చైర్మన్, సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని స్పష్టం చేశారు. అంతర్గత ఆడిటర్లు ఈవైతో ఆడిట్ కమిటీ సంప్రతింపులు జరుపుతోందని, స్వతంత్ర విచారణ కోసం న్యాయసేవల సంస్థ శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కోని నియమించుకున్నామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు నీలేకని తెలియజేశారు.

**ఆడిట్ కమిటీ సిఫార్సులతో చర్యలు..**

సంస్థలో అనైతిక విధానాల పేరిట ఈ ఏడాది సెప్టెంబర్ 30న ఒక బోర్డు సభ్యుడికి గుర్తుతెలియని వారి నుంచి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు నీలేకని తెలిపారు. వీటిలో ఒక దానిపై సెప్టెంబర్ 20వ తేదీ ఉండగా, రెండో దానిపై తేదీ లేకుండా ప్రజావేగు ఫిర్యాదు అని ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రెండింటినీ అక్టోబర్ 10న ఆడిట్ కమిటీ ముందు, మరుసటి రోజున బోర్డులో నాన్–ఎగ్జిక్యూటివ్ సభ్యుల ముందు ఉంచినట్లు నీలేకని తెలిపారు. తేదీ లేని రెండో లేఖలో ప్రజావేగు ప్రధానంగా సీఈవో అమెరికా, ముంబైల పర్యటనల మీద ఆరోపణలు ఉన్నట్లు వివరించారు. 'అక్టోబర్ 11న బోర్డు సమావేశం అనంతరం ప్రాథమిక విచారణకు సంబంధించి స్వతంత్ర అంతర్గత ఆడిటర్లతో (ఎర్నెస్ట్ అండ్ యంగ్) ఆడిట్ కమిటీ సంప్రతింపులు ప్రారంభించింది. అక్టోబర్ 21న శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో సంస్థను స్వతంత్ర విచారణ కోసం నియమించుకోవడం జరిగింది' అని ఆయన పేర్కొన్నారు. 11న బోర్డు సమావేశం తర్వాత తమ ఆడిటర్లకు (డెలాయిట్ ఇండియా) అన్ని విషయాలు పూర్తిగా తెలియజేసినట్లు నీలేకని తెలిపారు. 'ఈమెయిల్స్ లేదా వాయిస్ రికార్డింగ్స్ లాంటివేవీ మాకు అందలేదు. అయినప్పటికీ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇది నిష్పాక్షికంగా జరిగేలా చూసేందుకు సీఈవో, సీఎఫ్‌వో దీనికి దూరంగా ఉంటారు' అని ఆయన వివరించారు. విచారణలో వెల్లడయ్యే వివరాలను బట్టి ఆడిట్ కమిటీ సిఫార్సుల ప్రకారం బోర్డు తగు చర్యలు తీసుకుంటుందని నీలేకని చెప్పారు.




### గతంలో ఇన్ఫీ షేర్ భారీ పతనాలు..

| తేది | ముగింపు (రూ.లలో) | క్షీణత (%) |
|---|---|---|
| ఏప్రిల్ 10, 2003 | 47.6 | 26.78 |
| ఏప్రిల్ 12, 2013 | 286.9 | 21.33 |
| ఏప్రిల్ 11, 2001 | 50.6 | 16 |
| ఏప్రిల్ 11, 2003 | 40.9 | 14 |
| మార్చి 2, 2001 | 77.2 | 13 |

## అమెరికాలో క్లాస్ యాక్షన్ దావా!



ప్రజావేగు ఆరోపణల నేపథ్యంలో ఇన్ఫీని మరిన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఈ వివాదంతో నష్టపోయిన ఇన్వెస్టర్ల తరపున క్లాస్ యాక్షన్ దావా వేసేందుకు సిద్ధమవుతున్నట్లు అమెరికాకు చెందిన న్యాయసేవల సంస్థ రోజెన్ లా ఫర్మ్ వెల్లడించింది. 'ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించేలా ఇన్ఫోసిస్ చేసిన ప్రకటనల కారణంగా మదుపుదారులకు వాటిల్లిన నష్టాల గురించి విచారణ చేస్తున్నాం. పరిహారాన్ని రాబట్టేందుకు క్లాస్ యాక్షన్ దావా సిద్ధం చేస్తున్నాం' అని పేర్కొంది. ఐఎస్ఎస్ సెక్యూరిటీస్ క్లాస్ యాక్షన్ సర్వీసెస్ ప్రకారం 2017లో అత్యధికంగా క్లాస్ యాక్షన్ దావాలను సెటిల్ చేసిన సంస్థల్లో రోజెన్ అగ్రస్థానంలో ఉంది.

**క్లాస్ యాక్షన్ అంటే..:** ఒక్కొక్క ప్రతివాదికి రావాల్సిన పరిహారం చాలా స్వల్పస్థాయిలో ఉండి, దావా వేసేంత స్థాయిలో ఆర్థిక వనరులు లేనప్పుడు అందరూ కలిసి వేసే కేసును క్లాస్ యాక్షన్ దావాగా పరిగణించవచ్చు. ఒక గ్రూపుగా ఏర్పడి కేసు వేయడం వల్ల లాయర్ల ఫీజుల భారం తగ్గించుకోవచ్చు. అదే సమయంలో కోర్టులకు కూడా ఒకే తరహా కేసులో వందలకొద్దీ క్లెయిమ్స్ విచారణ భారం తగ్గుతుంది. సాధారణంగా తప్పుడు ప్రకటనలు, వివక్ష, లోపభూయిష్టమైన ఉత్పత్తులు తదితర అంశాలపై ఆర్థిక సంస్థలు, తయారీదార్ల నుంచి ప్రభుత్వ సంస్థల దాకా దేనిపైనైనా ఈ దావాలకు ఆస్కారముంది. సాధారణంగా ఇలాంటి క్లాస్ యాక్షన్ కేసుల సెటిల్మెంట్ కోర్టుల వెలుపలే జరుగుతుంటాయి. పదేళ్ల క్రితం సత్యం కంప్యూటర్స్ స్కామ్ బైటపడినప్పుడు అమెరికాలో ఇన్వెస్టర్లు ఇలాంటి కేసు ద్వారానే నష్టాలకు కొంత పరిహారం పొందగలిగారు. కానీ భారత్‌లో అప్పట్లో ఇలాంటి విధానం లేకపోవడంతో ఇక్కడి ఇన్వెస్టర్లకు సాధ్యపడలేదు. సత్యం కుంభకోణం దరిమిలా ఆ తర్వాత భారత్‌లో కూడా ఇలాంటి క్లాస్ యాక్షన్ దావాలకు వీలు కల్పిస్తూ.. కంపెనీల చట్టంలో నిబంధనలు చేర్చారు.

## 53 వేల కోట్ల మార్కెట్ క్యాప్ హుష్..



ప్రజావేగుల ఆరోపణలపై ఆందోళనలతో ఇన్ఫీ షేరు కుదేలవడంతో కంపెనీ మార్కెట్ విలువ ఒకే రోజులో ఏకంగా రూ. 53,451 కోట్ల మేర తుడిచిపెట్టుకుపోయింది. మార్కెట్ వేల్యుయేషన్ రూ. 2,76,300 కోట్లకు తగ్గింది. మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా పతనమైన పెద్ద కంపెనీ షేరు ఇదే. బీఎస్‌ఈలో షేరు ఒక దశలో 16.86 శాతం పతనమై రూ. 638.30 స్థాయిని కూడా తాకింది. 2013 ఏప్రిల్ తర్వాత ఒకే రోజున ఇంత స్థాయిలో షేరు క్షీణించడం ఇదే తొలిసారి. చివరికి 16.21 శాతం క్షీణించి రూ. 643.30 వద్ద క్లోజయ్యింది. మరోవైపు ఎన్‌ఎస్‌ఈలో 16.65 శాతం క్షీణించి రూ. 640 వద్ద క్లోజయ్యింది. మరోవైపు, అమెరికా మార్కెట్లో సోమవారం 14 శాతం పతనమైన ఇన్ఫీ ఏడీఆర్ (అమెరికన్ డిపాజిటరీ రిసీట్) పతనం మంగళవారం కూడా కొనసాగింది. ఒక దశలో మరో 4 శాతం దాకా పడింది.

## ఇదీ వివాదం..

కంపెనీ లాభాలు పెంచి చూపించేందుకు సలిల్ పరేఖ్, ఆయనకు తోడుగా నీలాంజన్ రాయ్ ఖాతాలు గోల్‌మాల్ చేయిస్తున్నారంటూ కొందరు ఉద్యోగుల బృందం.. ఇన్ఫీ బోర్డుకు, అమెరికాలోని విజిల్‌బ్లోయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రాంకు చేసిన ఫిర్యాదులు సోమవారం వెలుగులోకి వచ్చాయి. గత రెండు త్రైమాసికాలుగా ఇలాంటి ధోరణులు పెరిగాయని, అనైతిక విధానాలకు అడ్డు చెప్పిన ఉద్యోగులను పక్కన పెట్టడం జరుగుతోందని ప్రజావేగులు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఈమెయిల్స్, వాయిస్ రికార్డింగ్స్ అన్నీ తమ దగ్గర ఉన్నాయని, తగిన సందర్భంలో అందజేస్తామని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. కార్పొరేట్ గవర్నెన్స్ లోపాల ఆరోపణలతో రెండేళ్ల క్రితం ఇన్ఫీ ఉక్కిరిబిక్కిరైన సంగతి తెలిసిందే. దీనిపైనే ప్రమోటర్లతో విభేదాలు రావడంతో సీఈవో విశాల్ సిక్కా అర్ధంతరంగా నిష్క్రమించారు. కొత్త సీఈవోగా సలిల్ పరేఖ్ వచ్చిన తర్వాత మళ్లీ ఇన్ఫీ మెల్లిగా గాడిన పడటం మొదలైంది. అయితే ఇంతలోనే ఆయనపైనా అవకతవకల ఆరోపణలు రావడంతో ఇన్ఫీ వ్యవహారాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

## నిబంధనలు స్థిరంగా ఉండేలా చూడండి..

**ప్రధాని మోదీకి వాల్‌మార్ట్ సీఈవో డగ్ మెక్‌మిలన్ లేఖ**




**న్యూఢిల్లీ:** ఈ–కామర్స్ రంగానికి సంబంధించి డేటా గోప్యతపరమైన సమస్యలు పరిష్కరించాలని, నియంత్రణ సంస్థలపరంగా నిబంధనల్లో స్థిరత్వం ఉండేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీను రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ సీఈవో డగ్ మెక్‌మిలన్ కోరారు. అలాగే, కొత్త స్టోర్స్ ఏర్పాటుకు పొందాల్సిన లైసెన్సులు, పర్మిట్ల సంఖ్యను కూడా తగ్గించాలన్నారు. మెక్‌మిలన్ ఈ మేరకు మోదీకి లేఖ రాశారు. విదేశాల్లో తమ కార్యకలాపాల కోసం భారత్ నుంచి వాల్‌మార్ట్ మరింత కొనుగోళ్లు జరుపుతుందని, తద్వారా చిన్న సంస్థలు.. ఉద్యోగాల కల్పనకు ఊతమిచ్చేందుకు కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఫ్లిప్‌కార్ట్‌ను వాల్‌మార్ట్ కొన్న సంగతి తెలిసిందే.

## బ్యాంకింగ్ సమ్మె.. పాక్షిక ప్రభావం



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్మిక సంఘాలు మంగళవారం నిర్వహించిన సమ్మె ప్రభావం దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకింగ్ కార్యకలాపాలపై పాక్షిక ప్రభావం చూపింది. బ్యాంకింగ్ రంగంలో విలీనాలు, పొదుపు రేట్లలో కోత వంటి వంటి విధానాలను నిరసిస్తూ, కార్మిక సంఘాలు ఈ ఒకరోజు సమ్మె పిలుపును ఇచ్చాయి. నగదు డిపాజిట్లు, ఉపసంహరణలు, చెక్ క్లియరెన్సులపై ప్రభావం పడినట్లు వార్తలు అందాయి. అయితే ప్రైవేటు రంగ బ్యాంకులు మామూలుగా పనిచేశాయి.

## చాక్లెట్ @ రూ. 4.3 లక్షలు

**ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన చాక్లెట్ తయారు చేసిన ఐటీసీ**




**న్యూఢిల్లీ:** ఎఫ్‌ఎంసీజీ దిగ్గజ కంపెనీ 'ఐటీసీ'.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన చాక్లెట్‌ను తయారు చేసింది. ఈ కంపెనీకి చెందిన ఫాబెల్లె బ్రాండ్ 'ట్రినిటీ – ట్రఫుల్స్ ఎక్స్‌ట్రార్డినేర్' పేరిట చాక్లెట్‌ను రూపొందించగా.. దీని ఖరీదు కేజీ రూ. 4.3 లక్షలుగా ప్రకటించింది. ఇంతటి ఖరీదైన చాక్లెట్ మరొకటి లేనందున గిన్నిస్ బుక్‌లో ఈ లిమిటెడ్ ఎడిషన్ స్థానం సంపాదించినట్లు కంపెనీ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. చేతిలో సరిపడే ఒక్కో చెక్క పెట్టెలో 15 ట్రఫుల్స్ ఉండగా.. సగటు బరువు దాదాపు 15 గ్రాములు ఉన్నట్లు తెలిపింది. ఈ విధంగా ఒక కిలో రేటును నిర్ణయించినట్లు తెలిపింది. కేవలం భారత్‌కే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించినందుకు సంతోషంగా ఉందని ఐటీసీ ఫుడ్ డివిజన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుజ్ రుస్తాగి అన్నారు.

## ఎన్‌బీఎఫ్‌సీలో సంక్షోభం వస్తే కష్టమే!

- బ్యాంకింగ్‌పై ఫిచ్ అంచనా
- అలాంటప్పుడు బ్యాంకులకు 3.5 లక్షల కోట్ల మూలధనం అవసరం

**న్యూఢిల్లీ:** నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో సంక్షోభం నెలకొంటే బ్యాంకింగ్‌కు 2020–21 నాటికి రూ.3.5 లక్షల కోట్ల (50 బిలియన్ డాలర్లు) మూలధన కొరత ఏర్పడుతుందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ– ఫిచ్ అధ్యయనం ఒకటి తేల్చింది. ''ఎన్‌బీఎఫ్‌సీ రంగం సంక్షోభ పరిస్థితుల్లోకి వెళితే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణ విభాగం తీవ్ర ఒత్తిడికి గురవుతుంది. 'బీ' శ్రేణిలో ఒయబిలిటీ (సామర్థ్యం) రేటింగ్స్‌సహా బ్యాంకింగ్ రుణ విభాగం బలహీనమవుతుంది. ప్రభుత్వం నుంచి తాజా మూలధనం లభించని పక్షంలో దివాలా పరిస్థితులనూ ఎదుర్కొనాల్సి వస్తుంది'' అని ఫిచ్ నిర్వహించిన ఒక అధ్యయనం విశ్లేషించింది. ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకింగ్ రుణాలకు సంబంధించి 30% మొండిబకాయిలుగా(ఎన్‌పీఏ) మారే అవకాశం ఉందని ఫిచ్ అధ్యయనం పేర్కొనడం గమనార్హం. బ్యాంకింగ్ వ్యవస్థ స్థూల ఎన్‌పీఏ నిష్పత్తి 2018–19లో 9.3 శాతం ఉంటే, ఇది 2020–21లో 11.6 శాతానికి పెరిగే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ

**బ్యాంకింగ్ ఆందోళనకరం: అభిజిత్ బెనర్జీ**

భారత్ బ్యాంకింగ్ సంక్షోభ పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితిని ఎదుర్కొనడానికి తగిన పటిష్ట చర్యలు అవసరమని ఆయన న్యూఢిల్లీలో విలేకరులతో అన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాను 50 శాతం దిగువకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల అధికారులు కొంత స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగలుగుతారని విశ్లేషించారు.

## యాక్సిస్ నష్టం రూ.112 కోట్లు

- రూ.2,138 కోట్ల వన్‌టైమ్ పన్ను వ్యయాల ఎఫెక్ట్
- రూ.19,334 కోట్లకు మొత్తం ఆదాయం
- స్వల్పంగా మెరుగుపడిన రుణ నాణ్యత




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్‌కు ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో రూ.112 కోట్ల నికర నష్టాలు (స్టాండ్అలోన్) వచ్చాయి. కార్పొరేట్ పన్ను రేటులో మార్పుల వల్ల రూ.2,138 కోట్ల వన్ టైమ్ పన్ను వ్యయాల కారణంగా ఈ నష్టాలు వచ్చాయని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. ఈ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుంటే ఈ క్యూ2లో నికర లాభం 157 శాతం వృద్ధితో రూ.2,026 కోట్లకు పెరిగి ఉండేదని వివరించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.790 కోట్ల నికర లాభం ఆర్జించామని పేర్కొంది. ఇక మొత్తం ఆదాయం రూ.15,959 కోట్ల నుంచి రూ.19,334 కోట్లకు పెరిగాయని తెలిపింది. నిర్వహణ లాభం 45 శాతం వృద్ధితో రూ.5,952 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

**నికర వడ్డీ ఆదాయం రూ.6,102 కోట్లు ...**

నికర వడ్డీ ఆదాయం 17 శాతం వృద్ధితో రూ.6,102 కోట్లకు పెరిగిందని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. 3.51 శాతం నికర వడ్డీ మార్జిన్‌ను సాధించామని, ఇది తొమ్మిది క్వార్టర్ల గరిష్ట స్థాయని పేర్కొంది. బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ2లో 5.96 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో 5.03 శాతానికి తగ్గాయని తెలిపింది. నికర మొండి బకాయిలు 2.54 శాతం నుంచి 1.99 శాతానికి తగ్గాయని పేర్కొంది. సీక్వెన్షియల్‌గా చూస్తే, ఈ క్యూ1లో స్థూల మొండి బకాయిలు 5.25 శాతంగా, నికర మొండి బకాయిలు 2.04 శాతంగా ఉన్నాయి. కేటాయింపులు రూ.2,927 కోట్ల నుంచి రూ.3,518 కోట్లకు పెరిగాయని తెలిపింది. అయితే సీక్వెన్షియల్‌గా చూస్తే, కేటాయింపులు తగ్గాయి. ఈ క్యూ1లో రూ.3,815 కోట్ల కేటాయింపులు జరిపామని వివరించింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 78 శాతం నుంచి 79 శాతానికి పెరిగిందని పేర్కొంది. లోన్ బుక్ రూ.24,318 కోట్లకు పెరిగిందని, ఇది రెండేళ్ల గరిష్ట స్థాయని పేర్కొంది.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో యాక్సిస్ బ్యాంక్ షేర్ 0.4 శాతం లాభంతో రూ.713 వద్ద ముగిసింది.**

## కోటక్ లాభం 2,407 కోట్లు

- క్యూ2లో 51% అప్..; ఆదాయం రూ.12,543 కోట్లు
- 25% పెరిగిన నికర వడ్డీ ఆదాయం

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్లో రూ.2,407 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం(రూ.1,747 కోట్లు)తో పోల్చితే 38 శాతం వృద్ధి సాధించామని కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.10,829 కోట్ల నుంచి రూ.12,543 కోట్లకు పెరిగిందని పేర్కొంది. స్టాండ్అలోన్ పరంగా చూస్తే, గత క్యూ2లో రూ.1,142 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో 51 శాతం వృద్ధితో రూ.1,724 కోట్లకు పెరిగిందని వివరించింది.

**రూ.3,350 కోట్లకు నికర వడ్డీ ఆదాయం....**

పన్ను వ్యయాలు తక్కువగా ఉండటం, నికర వడ్డీ ఆదాయం అధికంగా ఉండటంతో ఈ స్థాయి నికర లాభం సాధించామని కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. తమ కన్సాలిడేటెట్ లాభంతో అనుబంధ సంస్థల వాటా 28 శాతంగా ఉందని వివరించింది. నికర వడ్డీ ఆదాయం రూ.2,676 కోట్ల నుంచి 25 శాతం వృద్ధితో రూ.3,350 కోట్లకు పెరిగిందని తెలిపింది. గత క్యూ2లో 4.19 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్ ఈ క్యూ2లో 4.61 శాతానికి పెరిగిందని పేర్కొంది. రుణ వృద్ధి 21 శాతం నుంచి 15 శాతానికి తగ్గిందని తెలిపింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, ఈ క్యూ1లో రుణ వృద్ధి 18 శాతమని పేర్కొంది.




**తగ్గిన రుణ నాణ్యత...**

ఈ బ్యాంక్ రుణ నాణ్యత ఒకింత తగ్గింది. గత క్యూ2లో రూ.4,302 కోట్లుగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో రూ.5,475 కోట్లకు పెరిగాయని బ్యాంక్ పేర్కొంది. అలాగే నికర మొండి బకాయిలు రూ.1,618 కోట్ల నుంచి రూ.2,032 కోట్లకు పెరిగాయని వివరించింది. శాతం పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు 1.91 శాతం నుంచి 2.17 శాతానికి, నికర మొండి బకాయిలు 0.73 శాతం నుంచి 0.82 శాతానికి పెరిగాయని పేర్కొంది. కేటాయింపులు రూ.360 కోట్ల నుంచి రూ.473 కోట్లకు పెరిగాయని వివరించింది.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ 0.8 శాతం లాభంతో రూ.1,629 వద్ద ముగిసింది.**

epaper.sakshi.com

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,380 | |
| బంగారం (22 క్యారెట్లు) | 37,500 | |
| వెండి (కిలో) | 49,300 | |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,350 | ▲ 170 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,520 | ▲ 120 |
| వెండి (కిలో) | 49,300 | ▲ 137 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,330 | ▲ 170 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,520 | ▲ 120 |
| వెండి (కిలో) | 49,300 | ▲ 137 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,500 | ▲ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,570 | ▲ 160 |
| వెండి (కిలో) | 46,800 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,320 | |
| బంగారం (22 క్యారెట్లు) | 36,570 | |
| వెండి (కిలో) | 47,000 | |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,480 | ▲ 60 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,520 | ▲ 50 |
| వెండి (కిలో) | 49,300 | 0 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 54.20 (రాత్రి 11.30కు) | $53.51 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 59.38 (రాత్రి 11.30కు) | $58.96 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 23-10-2019

| | |
|---|---|
| విశాఖ | 380-00 |
| చిత్తూరు | 413-00 |
| వరంగల్ | 380-00 |
| చెన్నై | 420-00 |
| ముంబై | 430-00 |
| **22-10-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 377-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.35 |
| విజయవాడ | 373-00 |
| నమక్కల్ | 407-00 |
| గోదావరి | 373-00 |
| బెంగళూరు | 390-00 |
| కోల్‌కతా | 400-00 |
| ఢిల్లీ | 400-00 |

# ఆరు రోజుల లాభాలకు బ్రేక్

- ఇన్ఫోసిస్ ఎఫెక్ట్
- ఇటీవల పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణ
- 335 పాయింట్లు పతనమై 38,964కు సెన్సెక్స్
- 74 పాయింట్ల నష్టంతో 11,588కు నిఫ్టీ



ఆరు రోజుల స్టాక్‌మార్కెట్ లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఈ ఆరు రోజుల్లో లాభపడిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణ జరగడం, ప్రజావేగు ఫిర్యాదు నేపథ్యంలో ఇన్ఫోసిస్ భారీగా నష్టపోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 39,000 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 11,600 పాయింట్ల దిగువకు పడిపోయాయి. మహారాష్ట్ర, హర్యానా ఎగ్జిట్ పోల్స్ పాలక బీజేపీకే అనుకూలంగా ఉండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ 20 పైసలు పుంజుకోవడం వంటి సానుకూలాంశాలు ప్రభావం చూపించలేకపోయాయి. దిగువ స్థాయిల్లో ప్రైవేట్ బ్యాంక్ షేర్ల మద్దతు లభించడంతో నష్టాలు పరిమితమయ్యాయి. సెన్సెక్స్ 335 పాయింట్లు పతనమై 38,964 పాయింట్ల వద్ద, నిఫ్టీ 74 పాయింట్లు నష్టపోయి 11,588 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ నష్టాల్లో ఆరంభమైంది.

**501 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

నష్టాల తర్వాత లాభాల్లోకి వచ్చినప్పటికీ, మళ్లీ నష్టాల్లోకి జారిపోయింది. ఒక దశలో 128 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ మరో దశలో 373 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 501 పాయింట్ల రేంజ్‌లో పతనమైంది. ఇంట్రాడేలో 11,700 పాయింట్లపైకి నిఫ్టీ ఎగబాకినప్పటికీ, అమ్మకాల ఒత్తిడి కారణంగా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. ఇక ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా మొదలయ్యాయి.

- లాభాలు పెంచుకోవడానికి అకౌంట్ అవకతవకలకు, అనైతిక విధానాలకు ఇన్ఫోసిస్ సీఈఓ సలిల్ పరేఖ్ పాల్పడ్డారన్న ప్రజావేగు ఫిర్యాదుల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేర్ భారీగా పతనమైంది.
- సెప్టెంబర్ క్వార్టర్లో ప్రమోటర్లు తమ వాటాను తగ్గించుకున్నారన్న వార్తల కారణంగా డిష్ టీవీ షేర్ 12 శాతం పెరిగి రూ. ముగిసింది.
- క్యూ2 ఫలితాలు బాగా ఉండటంతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 13 శాతం, శ్రీ సిమెంట్ 5 శాతం, గ్రాన్యూల్స్ ఇండియా 18 శాతం చొప్పున లాభపడ్డాయి.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 3,606 |
| ఎన్‌ఎస్‌ఈ | 49,320 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 10,27,370 |
| ఎఫ్‌ఐఐ | -557 |
| డీఐఐ | -985 |

## ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓకు సెబీ ఓకే



ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. సూక్ష్మ రుణ సంస్థ, ఉజ్జీవన్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు హోల్డింగ్ కంపెనీగా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యవహరిస్తోంది. ఐపీఓలో భాగంగా రూ.10 ముఖ విలువ గల తాజా ఈక్విటీ షేర్లను ఈ బ్యాంక్ జారీ చేస్తుంది. ఇష్యూ సైజు రూ.1,200 కోట్లు.

## 71 శాతం ఎగసిన బజాజ్ ఫిన్‌సర్వ్ లాభం

### బజాజ్ ఫైనాన్స్ లాభం 63% అప్



**న్యూఢిల్లీ:** బజాజ్ ఫిన్‌సర్వ్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్లో 71 శాతం ఎగసింది. గత క్యూ2లో రూ.704 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో రూ.1,204 కోట్లకు పెరిగిందని బజాజ్ ఫిన్‌సర్వ్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.9,698 కోట్ల నుంచి 47 శాతం వృద్ధితో రూ.14,224 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

## బజాజ్ ఫైనాన్స్ లాభం రూ.1,506 కోట్లు

బజాజ్ గ్రూప్‌నకు చెందిన మరో ఫైనాన్స్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ లాభం కూడా భారీగానే పెరిగింది. గత క్యూ2లో రూ.923 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో 63 శాతం ఎగసి రూ.1,506 కోట్లకు పెరిగిందని బజాజ్ ఫైనాన్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,273 కోట్ల నుంచి 48 శాతం వృద్ధి చెంది రూ.6,322 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్ 3.1 శాతం నష్టంతో రూ.8,003 వద్ద, బజాజ్ ఫైనాన్స్ షేర్ 2.5 శాతం తగ్గి రూ.4,032 వద్ద ముగిశాయి.

# ఐసీఐసీఐ ప్రు. లైఫ్ లాభం రూ.301 కోట్లు



**న్యూఢిల్లీ:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.301 కోట్ల నికర లాభం సాధించింది. నికర లాభంలో పెద్దగా మార్పు లేకపోయినా, ఆదాయం మాత్రం తగ్గిందని కంపెనీ వెల్లడించింది. గత క్యూ2లో రూ.8,990 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ2లో రూ.8,027 కోట్లకు తగ్గిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలకు గాను ఒక్కో షేర్‌కు 80 పైసల మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని పేర్కొంది. ఇక ఈ ఆరు నెలల కాలానికి గాను కొత్త వ్యాపార విలువ రూ.590 కోట్ల నుంచి 20 శాతం వృద్ధితో రూ.709 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

# గ్రాన్యూల్స్ లాభం 59 శాతం జూమ్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ రంగ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా సెప్టెంబరు క్వార్టరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 59 శాతం పెరిగి రూ.96 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.581 కోట్ల నుంచి రూ.700 కోట్లకు ఎగసింది. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 25 పైసలు రెండవ మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది.

# కోరమాండల్ లాభం 37 శాతం జంప్



ఎరువులు, పురుగు మందుల తయారీ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ సెప్టెంబరు క్వార్టరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 37 శాతం వృద్ధి చెంది రూ.503 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.5,018 కోట్ల నుంచి రూ.4,867 కోట్లకు వచ్చి చేరింది.

# జీఎస్‌కే ఫార్మా లాభం రూ.503 కోట్లు



**న్యూఢిల్లీ:** గ్లాక్సోస్మిత్‌లైన్ ఫార్మాస్యూటికల్స్(జీఎస్‌కే ఫార్మా) ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.503 కోట్ల నికర లాభం (కన్సాలిడేటెడ్) ఆర్జించింది. గత క్యూ2లో రూ.101 కోట్ల నికర లాభం ఆర్జించామని జీఎస్‌కే ఫార్మా తెలిపింది. ఇక ఆదాయం రూ.816 కోట్ల నుంచి రూ.882 కోట్లకు పెరిగిందని పేర్కొంది. రూ.401 కోట్ల మినహాయింపు అంశాల కారణంగా నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో జీఎస్‌కే ఫార్మా షేర్ 2 శాతం లాభంతో రూ.1,469 వద్ద ముగిసింది.

## రూ.700 కోట్లు సమీకరించిన కార్స్24



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** యూజ్డ్ కార్ మార్కెట్‌ప్లేస్ కార్స్24 తాజాగా సుమారు రూ.700 కోట్లు సమీకరించింది. ఈ నిధులను కొత్త నగరాల్లో విస్తరణ, ఫ్రాంచైజీ విధానం, సాంకేతికత అందిపుచ్చుకోవడంతోపాటు రుణ వ్యాపారంపై వెచ్చించనుంది. ప్రస్తుతం ఏటా 1.5 లక్షల కార్ల క్రయ విక్రయాలు కార్స్24 ద్వారా జరుగుతున్నాయి. 2021 చివరినాటికి దీనిని 10 లక్షల యూనిట్ల స్థాయికి చేర్చాలన్నది లక్ష్యమని కంపెనీ కో–ఫౌండర్ విక్రమ్ చోప్రా తెలిపారు.

## ప్రెస్టీజ్ ‘శుభోత్సవ్’ ఆఫర్

### 79 శాతం వరకు డిస్కౌంట్




గృహోపకరణాల తయారీ సంస్థ టీటీకే ప్రెస్టీజ్.. పండుగల సీజన్ సందర్భంగా తన ఉత్పత్తులపై 79 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తోంది. ‘శుభోత్సవ్’ ఆఫర్ పేరిట ఈ భారీ తగ్గింపును ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్ 28 వరకు ఆఫర్ వర్తిస్తుంది. ప్రెస్టీజ్ వినియోగదారులకు భారీ తగ్గింపును ఇవ్వాలనే లక్ష్యంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నామని, తమ కస్టమర్లు ఈ ఆఫర్‌ను అందిపుచ్చుకుంటారని ఆశిస్తున్నట్లు వెల్లడించింది.

# ఓబీసీకి తగ్గిన ‘మొండి’ భారం

- 24 శాతం వృద్ధితో రూ.126 కోట్లకు నికర లాభం




**న్యూఢిల్లీ:** ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాంలో రూ.126 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం(రూ.102 కోట్లు)తో పోల్చితే 24 శాతం వృద్ధి సాధించామని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,967 కోట్ల నుంచి 15 శాతం వృద్ధితో రూ.5,702 కోట్లకు పెరిగిందని పేర్కొంది. నికర మొండి బకాయిలు 10.07 శాతం నుంచి 5.94 శాతానికి తగ్గాయని తెలిపింది. రుణ నాణ్యత మెరుగుపడటంతో బీఎస్‌ఈలో ఓబీసీ షేర్ 1.4 శాతం లాభంతో రూ.50 వద్ద ముగిసింది.

## టైటాన్ ‘నకాషీ కలెక్షన్’

### టెంపుల్ జ్యూయలరీ స్ఫూర్తితో కొత్త వాచీలు



దేవాలయాల నిర్మాణ శైలి స్ఫూర్తితో రూపొందించిన నూతన ‘నకాషీ కలెక్షన్’ వాచీలను నెబులా విడుదలచేసింది. టైటాన్ కంపెనీకి చెందిన ఈ 18క్యారెట్ల బంగారు ఆభరణాల వాచీల కలెక్షన్.. ఆన్య, ఆద్య, అక్షర, అతుల్య, ఈషానా పేర్లతో నూతన వాచీలను అందిస్తోంది. గోపురాలు, స్థంభాలు, పూలు, చక్ర నమూనాలు ఈ కలెక్షన్‌లో కనిపిసాయి. నకాషీ కలెక్షన్ ప్రారంభ ధర రూ. 2.3 లక్షలు కాగా, పండుగల సీజన్ సందర్భంగా 20 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది.

## నేటి బోర్డ్ సమావేశాలు

ఎల్ అండ్ టీ, బజాజ్ ఆటో, హీరో మోటొకార్ప్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బయోకాన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఆర్తి డ్రగ్స్, హావెల్స్ ఇండియా, హెక్సావేర్ టెక్నాలజీస్, టెక్స్‌మాకో రైల్, షాపర్స్ స్టాప్, జీ మీడియా,



# గిరిజన గ్రామాలను సందర్శిస్తా..

## గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** ములుగు జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం అనుమతి కావాలని, ఈ దిశగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతానని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పథకాలపై మంగళవారం ఆమె రాజ్‌భవన్‌లో సమీక్ష నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో విరివిగా లభించే మూలిక ఔషధాల ఆధారంగా పరిశ్రమలు స్థాపించే విధంగా స్థానిక గిరిజన యువతను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. స్థానిక గిరిజన సముదాయాలకు మాత్రమే తెలిసిన మూలిక ఔషధాల జ్ఞానాన్ని గ్రంథస్తం చేయాలని అధికారులను కోరారు. రాష్ట్రంలోని కొన్ని గిరిజన ప్రాంతాలను సందర్శించి నేరుగా వారిని కలుసుకుంటానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సమస్యలను తెలుసుకోవడానికి ఒక గిరిజన గ్రామాన్ని సందర్శించి అక్కడే రాత్రి బస చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి రాష్ట్రంలో వివిధ పథకాలు అమలు చేస్తున్నామని ఆ శాఖ కార్యదర్శి బీఎండీ ఎక్కా గవర్నర్‌కు తెలియజేశారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వివిధ విద్యా సంస్థల్లో 2.25 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశానికి ముందు కోయ, లంబాడ కళాకారులు రాజ్‌భవన్‌లో నిర్వహించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ క్రిస్టీనా చెంగ్తు పాల్గొన్నారు.



మంగళవారం రాజ్‌భవన్‌లో గిరిజన మహిళలతో నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళసై

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రిఫరల్ వ్యవస్థ

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ రమేశ్‌రెడ్డి కీలక నిర్ణయం
- సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆసుపత్రికి... అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి
- అక్కడ వైద్యం అందక సీరియస్ అయితేనే బోధనాసుపత్రులకు రిఫర్
- ఎందుకు రిఫర్ చేస్తున్నారో వైద్యులు లిఖిత పూర్వకంగా రాసివ్వాల్సిందే

**సాక్షి, హైదరాబాద్:** కిందిస్థాయి ఆసుపత్రుల్లో నయమయ్యే చిన్నపాటి వ్యాధులకూ గాంధీ, ఉస్మానియా వంటి పెద్దాసుపత్రులకు రోగులు పరుగులు తీస్తున్నారు. జ్వరమొచ్చినా, దగ్గొచ్చినా పెద్దాసుపత్రికి వస్తున్నారు. స్థానికంగా ఉండే సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులున్నా వాటిని రోగులు ఉపయోగించుకోవడం లేదు. పైగా అక్కడి డాక్టర్లు కూడా రిస్క్ తీసుకోకుండా పై ఆసుపత్రికి పంపించేస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు వైద్య విద్యా డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రిఫరల్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. చిన్నచిన్న జబ్బులకు పెద్దాసుపత్రులకు రావాల్సిన అవసరం లేకుండా, కిందిస్థాయిలోనే సరైన వైద్యం అందేలా చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ కిందిస్థాయి ఆసుపత్రుల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంటే అక్కడి వైద్యుడి సలహా మేరకు మాత్రమే పై ఆసుపత్రికి వెళ్లాలి. అలా వైద్యుడు రిఫర్ చేశాకే తదుపరి ఆసుపత్రికి రోగి వెళ్లాలి. దీనివల్ల కిందిస్థాయిలో ఉండే ఆసుపత్రుల్లోని వసతులను రోగులు వినియోగించుకునే వీలుంటుంది. దూరాభారం, ఖర్చులు తగ్గించుకునే వెసులుబాటూ ఉంటుంది. కిందిస్థాయి ఆసుపత్రుల్లో ఒకవేళ వైద్యం అందించని పరిస్థితి ఉంటే వైద్యుడు తప్పనిసరిగా లిఖిత పూర్వకంగా పై ఆసుపత్రికి రాసి పంపాలి. దీనివల్ల వైద్యుల్లోనూ జవాబుదారీతనం ఏర్పడుతుంది.

### వైద్య విధాన పరిషత్‌లోనూ స్పెషలిస్టు వైద్యులు...

రాష్ట్రవ్యాప్తంగా 110 వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులున్నాయి. వాటిలో జిల్లా, ఏరియా, సీహెచ్‌సీలున్నాయి. ఏరియా ఆస్పత్రుల్లో గైనిక్, పీడియాట్రిక్, జనరల్ సర్జన్, అనస్థీషియా స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక జిల్లా ఆస్పత్రుల్లో దాదాపు అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నారు. గుండె, కిడ్నీసహా అనేక రకాల స్పెషలిస్టులూ ఉంటున్నారు. గతేడాదే ఏకంగా 919 స్పెషలిస్టు వైద్య పోస్టులనూ భర్తీ చేశారు. కాబట్టి చాలా రోగాలకు జిల్లా స్థాయిలోనే వైద్యం అందించే పరిస్థితి ఉంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో చాలా కేసులను డాక్టర్లు చూడకుండానే హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, నిమ్స్ వంటి ఆస్పత్రులకు పంపుతున్నారు. దీంతో రాజధానిలోని ప్రభుత్వ బోధనాసుపత్రులపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఈ నేపథ్యంలో ఇక నుంచి ఎవరైనా రోగి క్షేత్రస్థాయిలో ఏదైనా ఆస్పత్రికి వెళితే అక్కడ ఆ రోగికి చికిత్స అందించగలిగే పరిస్థితి ఉంటే అక్కడే వైద్యం చేయాలి. ఒకవేళ రోగి పరిస్థితి సీరియస్‌గా ఉండి, వైద్యం అందించలేని పరిస్థితుల్లో మాత్రమే రిఫర్ చేయాలి. అలాగే వైద్యుల రేషనలైజేషన్ చేయాలని కూడా నిర్ణయించారు. ఆ మేరకు వైద్యుల వివరాల జాబితాను కమిషనర్ తెప్పించుకున్నారు.

### విదేశాల్లో రిఫరల్ లేకుంటే చేర్చుకోరు: డాక్టర్ రమేశ్‌రెడ్డి



విదేశాల్లో కింది స్థాయి ఆసుపత్రిలో చూపించుకున్నాక అక్కడి డాక్టర్ అనుమతి మేరకు మాత్రమే పైస్థాయి ఆసుపత్రిలో చేర్చుకుంటారు. పైస్థాయి ఆసుపత్రికి ఎందుకు రిఫర్ చేస్తున్నారో కూడా డాక్టర్ రిఫరల్ కార్డులో వివరంగా రాయాలి. ఈ విధానం మన దగ్గర అమలు కావడంలేదు. దీనిపై దృష్టిపెట్టాం. ఎలా చేయాలో ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు మరో 300 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించే యోచన చేస్తున్నాం.

# మెట్రో రైడ్‌లో హై'టెక్' రికార్డ్

- హైటెక్‌సిటీ నుంచి 25 వేల మంది టెకీల జర్నీ
- నాలుగు లక్షలు దాటుతోన్న మెట్రో ప్రయాణికులు
- ఆర్టీసీ సమ్మె, వరుస వర్షాలతో రూటు మార్చిన గ్రేటర్ సిటిజన్లు

**సాక్షి, హైదరాబాద్:** ఐటీ, బీపీవో, కేపీవో రంగాలకు కొంగుబంగారమైన హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్ వేలాది మంది టెకీల జర్నీతో కిక్కిరిసిపోతోంది. సోమ, మంగళవారాల్లో ఈ స్టేషన్ నుంచి నిత్యం సుమారు 25 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నట్లు మెట్రో రైలు వర్గాలు తెలిపాయి. ఆర్టీసీ సమ్మె, వరుస వర్షాల కారణంగా గ్రేటర్‌వాసులు రూటు మార్చడంతో మెట్రో రైళ్లు మంగళవారం కూడా కిక్కిరిశాయి. సోమవారం ఎల్బీ నగర్–మియాపూర్, నాగోల్–హైటెక్‌సిటీ రూట్లలో మొత్తంగా 830 ట్రిప్పుల మేర నడిపిన మెట్రో రైళ్లలో సుమారు 4.17 లక్షల మంది ప్రయాణించారు. మంగళవారం సైతం రద్దీ ఇదే స్థాయిలో ఉందని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అత్యధికంగా అమీర్‌పేట్ ఇంటర్ ఛేంజ్ స్టేషన్ నుంచి 26 వేల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఇక ఎల్బీ నగర్‌లో 23 వేల మంది, సికింద్రాబాద్, మియాపూర్ స్టేషన్ల నుంచి 18 వేల మంది ప్రయాణించారని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్ నుంచి 15 వేలు.. ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి 14 వేల మంది రాకపోకలు సాగించారని వెల్లడించారు. బస్సులు లేకపోవడంతో మెజారిటీ సిటిజన్లు మెట్రో రైళ్లను ఆశ్రయిస్తుండటంతో రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మెట్రోస్టేషన్ల వద్ద ప్రయాణికులు బారులు తీరుతున్నారు. రద్దీ వేళల్లో ప్రతి 3.5 నిమిషాలు.. రద్దీలేని సమయాల్లో 7 నిమిషాలకో రైలును నడుపుతున్నారు. స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు, అదనపు సిబ్బందిని ఏర్పాటుచేశారు. ఒక్కో మెట్రో రైలు గరిష్ట ప్రయాణికుల సామర్థ్యం సుమారు వెయ్యి మంది కాగా.. రద్దీ సమయాల్లో రద్దీ 1,100 మేర ఉంటోంది. దీంతో బోగీల్లో ఏసీ సరిపోక ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రద్దీకి అనుగుణంగా ఏసీ సౌకర్యాన్ని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఒకే రోజు 11.50 లక్షల మంది

- జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారి సంఖ్య
- దక్షిణ మధ్య రైల్వేలో రికార్డు

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఒకే రోజు జనరల్ బోగీల్లో ప్రయాణించిన వారి సంఖ్య రికార్డు స్థాయిలో 11.5 లక్షలు దాటింది. ఇప్పటివరకు ఎన్నడూ ఆ సంఖ్య 10 లక్షలను దాటలేదు. ప్రస్తుతం ఆర్టీసీ సమ్మె ఉధృతంగా నడుస్తున్న నేపథ్యంలో గత పక్షం రోజులుగా రైలు ప్రయాణికుల సంఖ్య సాధారణ రోజుల కంటే ఎక్కువగా ఉంటోంది. సాధారణ రోజుల్లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మామూలు రైళ్లలో జనరల్ బోగీల్లో సగటున నిత్యం 7.6 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. ఎంఎంటీఎస్ రైళ్లలో 1.6 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. రెండూ కలిపి సగటు ప్రయాణికుల సంఖ్య 9.2 లక్షలుగా ఉంటుంది. తాజా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఈ నెల 21న సాధారణ రైళ్లలోని అన్‌రిజర్వ్‌డ్ బోగీల్లో 9.3 లక్షల మంది, ఎంఎంటీఎస్ సర్వీసుల్లో 2.2 లక్షల మంది వెరసి రెండింటిలో కలిపి 11.5 లక్షల మందికిపైగా ప్రయాణించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు లెక్కలు తీశారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో అన్‌రిజర్వ్‌డ్ బోగీల్లో ఒకే రోజు ఎక్కువ మంది ప్రయాణించిన రోజుగా ఈ నెల 21 రికార్డుల్లోకెక్కింది.

### ఆ రోజే ఎందుకు..?

గత 18 రోజులుగా ఆర్టీసీ సమ్మె కొనసాగుతున్న విషయం తెలిసిందే. సమ్మె విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం దసరా సెలవులు పొడిగించింది. తిరిగి సోమవారమే విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు రోడ్డెక్కారు. హైదరాబాద్‌లో, జిల్లాల్లో చాలినన్ని బస్సుల్లేక విద్యార్థులు రైళ్ల వైపు మళ్లారు. ప్రయాణికుల రద్దీని గుర్తించిన రైల్వే అధికారులు.. తెలంగాణలోని కీలక ప్రాంతాల మీదుగా నడిచే రైళ్ల జనరల్ బోగీల సంఖ్య పెంచారు. ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్యను సైతం పెంచారు. దీంతో రికార్డు స్థాయి ప్రయాణికుల సంఖ్య నమోదైంది. కాగా, జనరల్ బోగీల్లో రద్దీ ఉందని తెలిసిన వెంటనే కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనరల్ బోగీల సంఖ్య పెంచడం అభినందనీయమని దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా అన్నారు.






రోడ్డు ప్రమాదంలో ఢీకొని దగ్ధమవుతున్న రెండు కార్లు

# మంటల్లో కార్లు

## పరస్పరం ఢీకొనడంతో ఘటన

**మునగాల:** సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు దగ్ధమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి దేవరపు నరేందర్ తన భార్యతో కలసి ఇండిగో కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ డస్టర్ కారు మాధవరం శివారులోకి రాగానే అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు వెళ్తున్న నరేందర్ కారును బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు కార్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే బయటకు వచ్చారు. మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో విజయవాడ వైపు వెళ్లే కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ శ్రీకాంత్, ఉప్పలపాటి సత్యనారాయణరాజుకు గాయాలయ్యాయి. ఇండిగో కారులో ప్రయాణిస్తున్న నరేందర్, పరమేశ్వరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని కోదాడలోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. డ్రైవర్ శ్రీకాంత్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.